


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 174 పేజీలు: 12 వెల: 6.50




## నేడే మెగా పీటీయం 4.0




ఈరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్న భోజన సమయం వరకు
ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో జరిగే
మెగా పేరెంట్ టీచర్ సమావేశం 4.0కు
విద్యార్థుల తల్లితండ్రులందరికీ ఆహ్వానం

ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ
వరుసగా రెండో ఏడాదీ
తల్లికి వందనం సకాలంలో విడుదల



67,47,190 విద్యార్థుల కోసం
42,70,802 తల్లుల/ సంరక్షకుల
ఖాతాల్లో రూ.10,120.78 కోట్ల
తల్లికి వందనం నిధులు జమ

Mega PTM 4.0కు వచ్చి
మీ పిల్లల హోలిస్టిక్
ప్రోగ్రెస్ కార్డులను అందుకోండి





డొక్కా సీతమ్మ
మధ్యాహ్న భోజన పథకం కింద
మీ పిల్లలకు అందిస్తున్న శ్రేష్ఠమైన
పౌష్టికాహారాన్ని ఆస్వాదించండి








LEAP యాప్‌ను డౌన్‌లోడ్
చేసుకుని... మీ పిల్లల పురోగతిని
నిరంతరం పర్యవేక్షించండి

Donor పోర్టల్ ద్వారా
మీకు నచ్చిన పాఠశాలల
అభివృద్ధిలో భాగస్వాములవ్వండి

ఆటల్లో పాల్గొనండి...
బహుమతులు గెలుచుకోండి

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

విద్యావ్యవస్థను తీర్చిదిద్దడంలో మనందరం భాగస్వాములవుదాం-మన పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును ఇద్దాం

24-7pg2exHMNWJQE_24-7pg2exHMNWJQE.qxd 24/Jul/26 12:07 AM Page 1





గురువారం సిఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఎంఒయు దృశ్యం

# క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

>> విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలతో పాటు ప్రభుత్వ ఏజెన్సీలను కూడా ఒకే వేదికపైకి తెచ్చేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ పని చేయనుంది. క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్ని ప్రోత్సహించేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించేలా ఈ హబ్ పని చేయనుంది..

**డిజిటల్ లిటరసీపై ప్రత్యేక కార్యాచరణ..**

అమరావతిని క్వాంటం సహా డీప్ టెక్నాలజీలకు కేంద్రంగా మార్చాలని సంకల్పించామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏక్యూవీలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ క్వాంటం ఏఐ ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయటం మరో కీలకమైన మైలు రాయి అవుతుందని సీఎం అన్నారు. బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించే వినియోగదారులతో పాటు ప్రజలకు డిజిటల్ లిటరసీ పెంచే దిశగా కృషి చేయాలని ముఖ్యమంత్రి పీఎన్ బీ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ దిశగా ప్రభుత్వాలు బ్యాంకులు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయటంలో టెక్నాలజీ మరింత విస్తృతమవ్వాలని సీఎం సూచించారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు భద్రతను అత్యుత్తమ స్థాయిలో అందించాలని సీఎం స్పష్టం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ ను మరింత పటిష్టంగా, సులభతరంగా సేవలు అందించేలా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు పంజాబ్ నేషనల్ బ్యాంక్ సిఇఒ ఎండీ అశోక్ చంద్ర ముఖ్యమంత్రికి వివరించారు.

# పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

>> పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు.నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యుపిఎస్‌సి, ఎస్ఎస్‌సి, ఆర్ఆర్‌బి, ఐబిపిఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

# రూ.29.30లక్షల కోట్ల పెట్టుబడులు

>> కోవడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. నవంబర్ లో విశాఖపట్నంలో నిర్వహించే పార్టనర్ షిప్ సమ్మిట్ లో మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు పెద్దఎత్తున పునరుత్పాదక ఇంధనం అవసరం, రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలని కోరారు. నిర్ణీత సమయంలో గ్రౌండ్ చేసిన ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు అందించేలా ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. యువతకు ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈ యూనిట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరు నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**రంపచోడవరంలో మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం**

పోలవరం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు రంపచోడవరం ఘన స్వాగతం లభించింది.ఐ పోలవరం జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, మఠం విజయభాస్కర్ లోకేష్కు జ్ఞాపిక అందజేసి ఘనస్వాగతం పలికారు. రాత్రి 10.30 గంటలు దాటినా లోకేష్ కోసం కార్యకర్తలు వేచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మంత్రిని కలిసేందుకు వచ్చిన ప్రజలు, పార్టీ కార్యకర్తలు తమ సమస్యలను వివరిస్తూ అర్జీలు సమర్పించారు. వారి నుంచి అర్జీలను స్వీకరించిన మంత్రి, సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ పర్యటనకు సంబంధించి పార్టీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా పోలవరం జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రికి స్వాగతం పలికారు.



నవీ ముంబయిలో ఘోడ్‌బందర్ పాటలీపాడ వంతెన మీద
అదుపు తప్పి బోల్తా పడిన ట్రక్కును క్రేన్‌తో తరలిస్తున్న దృశ్యం

# 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

>> ఇందుకోసం బడ్జెట్ లో రూ.250 కోట్లు కేటాయించామని, ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నామన్నారు. రాష్ట్రం చేనేత రంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఈ నెల 26న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా కూటమి ప్రభుత్వం మరో శుభవార్త చెప్పిందన్నారు. నేతన్న సేవలో పథకానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఈ మేరకు కేబినెట్‌లో ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. చేనేతలకు ఆర్థిక దన్ను కలిగించేలా నేతన్న సేవలో పథకానికి శ్రీకారం చుట్టిన సిఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

**నేతన్న కుటుంబానికి భారీ ఆర్థిక లబ్ధి**

50యేళ్లు నిండిన 85,678 మంది చేనేతలకు రూ.4 వేల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. 51,952 మంది నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గం నేతన్నలకు 500 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, యేడాదికి రూ.8,640లు, మర మగ్గం నేతన్నలకు నెలకు రూ.1800 చొప్పున యేడాదికి రూ. 21,600లు లబ్ధి కలుగుతోందన్నారు. మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో రూ.25 వేలు, పెన్షన్ రూ.4 వేల చొప్పున రూ.48 వేలు, ఉచిత్ విద్యుత్‌తో రూ.8,640లు మొత్తం ఏడాదికి రూ. 81,640లు ప్రత్యక్ష ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. మర మగ్గం నేతన్నలకు నేతన్న సేవలో పథకం కింద రూ.25 వేలు, పెన్షన్ రూపంలో రూ.48 వేలు, ఉచిత విద్యుత్ కింద రూ.21,600లు కలిపి మొత్తం రూ.94,000 లబ్ధి కలుగుతోందన్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే నూతన టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకొచ్చామని మంత్రి సవిత గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా టెక్స్‌టైల్స్ పార్కులు, క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేతన్నలకు గౌరవప్రద జీవనమే సిఎం చంద్రబాబు లక్ష ్యమన్నారు. యేటా త్రిఫ్ట్ ఫండ్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నామని, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నామని తెలిపారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష ్యమని, ఆప్కో చరిత్రలో మొట్టమొదటిసారిగా టిటిడితో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. చంద్రబాబు పాలన నేతన్నలకు ఎప్పుడూ స్వర్ణయుగమేనని మంత్రి సవిత

# మాఫియా మూలాలను తుడిచేయండి

>> నాడు రాష్ట్రాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఎర్రచందనాన్ని గుర్తించి, ఆయా రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖల సమన్వయంతో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గతప్రభుత్వ హయాంలో ఇటువంటి అంతర్రాష్ట్ర ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించ లేదని పేర్కొన్నారు. అలాగే, ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో గతంలో కన్విక్షన్ రేటు 3 శాతం కంటే తక్కువగా ఉండేదని, 95 శాతం కేసుల్లో నిందితులకు కోర్టులు శిక్షలువిధించే స్థాయికి కన్విక్షన్ రేటు పెరిగిందని వివరించారు. గతంలో స్మగ్లర్లపై పిడి చట్టం అమలు చేయని పరిస్థితి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 12 మంది స్మగ్లర్లపై పిడి చట్టం కింద చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

**సమన్వయం తక్షణ అవసరం**

ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాత్రమే ప్రత్యేకించిన అటవీ సంపద... ఎర్రచందనం. కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్ర చందనం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వం అవలంబిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టంగా అమలు చేయాలి. దేశంలో ఎక్కడ ఎర్రచందనం అక్రమ నిల్వలు ఉన్నా ఆయా రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుని వాటిని స్వాధీనం చేసుకోవాలి. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో సమన్వయం తక్షణ అవసరం. స్మగ్లింగ్ ముఠాల వెనుక ఉన్న కింగ్ పిన్స్, ఫైనాన్షియర్స్‌పైనా దృష్టి సారించాలి. బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రానికి చెందిన విలువైన ఎర్రచందనం సంపదను రక్షి ంచేందుకు అత్యాధునిక సాంకేతికత, డ్రోన్ల పరిజ్ఞానాన్ని వినియోగించుకొంటూ నిఘాను మరింత విస్తృతంగా వినియోగించాలి. అంతర్రాష్ట్ర సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలి" అని పేర్కొన్నారు.

# 3,168 ఉద్యోగాల భర్తీ!

>> చారు. సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ అయ్యింది. భుజానికి శస్త్ర చికిత్స కారణంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరు కాలేదు. దాదాపు 25కు పైగా అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బాపట్ల జిల్లా వేదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. గోదావరి పుష్కరాల కోసం భద్రతా ఏర్పాట్లకు రూ.50 కోట్లు మంజూరు చేసింది.పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా ఏపీ టూరిజం అథారిటీకి కీలక భూ బదిలీలు జరిగాయి. చిత్తూరు, కాకినాడ నగరాల్లో వరల్డ్ క్లాస్ రిసార్ట్స్, స్టార్ హోటళ్లు, సరికొత్త టూరిజం ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాలను బదిలీ చేస్తూ మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విజయనగరంలో యశశ్రీ విరోహ్ ఇంపెక్స్ సంస్థ ఆధ్వర్యంలో "రద్దీస్ రీజెనరేటివ్ హబ్" పరిశ్రమ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. పుట్టపర్తిలో ఎస్ఎస్ఎస్ ఏరోస్పేస్ ప్రాజెక్టు స్థాపన కోసం శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భూములపై ఉన్న 76.13 ఎకరాల నిషేధాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నారు.మంత్రివర్గ సమావేశంలో ల్యాండ్ పూలింగ్ రైతులకు న్యాయం చేయడంతో పాటు పలు మౌలిక వసతుల ఒప్పందాలకు సవరణలు చేశారు. అనకాపల్లి ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా చెర్లపాలి ఖండం రైతులకు 1,800 చదరపు గజాలు లేఅవుట్ డెవలప్ చేసిన ప్లాట్లను పరిహారంగా ఇవ్వనున్నారు. విజయవాడ జెట్ సిటీ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో స్థలాల కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కుల వేగవంతం కోసం ఎపీఐఐసీ - ఎన్ఐసీడీఐటీ మధ్య జరిగిన ఒప్పందాన్ని సవరించారు. అగ్నిమాపక శాఖ ఆధునీకరణకు ఆమోదం లభించింది. పరిశ్రమలు, విద్య, మౌలిక సదుపాయాలకు ఊతమిస్తూ వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది. విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్ మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నీటిపారుదల రంగంలో నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641 కోట్ల పరిపాలనా అనుమతి, హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్ -2 పనుల వ్యయాన్ని రూ.312 కోట్లకు పెంచే ప్రతిపాదనలకు ఆమోద ముద్ర పడింది.విశాఖలో ఏఐజీసంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్, అలైడ్ హెల్త్ సైన్సెస్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణానికి మంత్రివర్గ కమిటీ భూ కేటాయింపులు జరిపారు. నంద్యాల జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో 700 మెగావాట్ల సోలార్, 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టుల స్థాపనకు రెండు విడతల్లో భూములు కేటాయించారు. గండికోట పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పరిధిలో అదానీ సంస్థ నిర్మిస్తున్న 18 వందల మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్ట్ పనుల కోసం ఎన్ఆర్ఇడిసీఎపికు భూములు కేటాయించారు. కుప్పంలో శ్రేష్ఠ రెన్యూవబుల్స్ ఆధ్వర్యంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు, నంద్యాలలో ఎన్‌సిఎల్ ఇండస్ట్రీస్ మినీ హైడల్ ప్రాజెక్టుకు 33 ఏళ్ల లీజుపై భూములిస్తూ క్లియరెన్స్ ఇచ్చారు.శ్రీకాకుళంలోని బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థల లీజును కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పుష్కరాల నిర్వహణ, భద్రత, బందోబస్తు ఏర్పాట్ల కోసం రూ.50 కోట్ల నిధుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇవ్వడం వంటి అంశాలకు మంత్రివర్గం నుంచి ఆమోదం లభించింది. విష్ణు ఉమెన్స్ యూనివర్సిటీ, చలపతి యూనివర్సిటీలను ప్రైవేట్ యూనివర్సిటీల జాబితాలో చేర్చే ఆర్డినెన్స్‌పై కూడా మంత్రివర్గం చర్చించింది. అలాగే నేరడి బ్యారేజ్ నిర్మాణానికి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతుల మంజూరుపై చర్చ జరిగింది. హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్2 పనుల అంచనా వ్యయాన్ని రూ.241.20 కోట్ల నుంచి రూ.312 కోట్లకు పెంచేందుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది ఇక మంత్రి వర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మదనపల్లిలో ఆగస్టు చివరి వారంలో ఉద్యానవనాన్ని ప్రారంభిస్తారని సీఎం చెప్పారు. గోదావరి పుష్కరాల ప్రారంభం రోజే పోలవరం ప్రారంభం గురించి ఆలోచిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. రెండో త్రైమాసికంలో అడుగుపెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని ఆదేశించారు. ఉత్తరాంధ్రలో వెనుకబాటుతనం ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని అన్నారు.

# ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఏపి

ఇచ్చి ట్యాంపర్‌ప్రూఫ్, సెక్యూరిటీతో లావాదేవీలు జరిగేలా బ్లాక్ చెయిన్ వ్యవస్థను తీర్చిదిద్దినట్టు వెల్లడించారు. ఇక భూ సమస్యలు ఉత్పన్నం కావడానికి డబుల్ రిజిస్ట్రేషన్లు ప్రధాన కారణంగా ఉన్నాయని, ఇకపై డబుల్ రిజిస్ట్రేషన్ సమస్యలను నివారించేలా బ్లాక్ చెయిన్ విధానం పని చేస్తోందని అధికారులు వివరించారు. భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా ఉండేలా మీ భూమి బ్లాక్ చెయిన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చామని, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ల శాఖలను ఒకే వేదిక మీదకు తెచ్చేలా ప్రాజెక్ట్ డిజైన్ చేశామని తెలిపారు. ఎన్ఐసి ఆంధ్రప్రదేశ్, ఎన్ఐసి బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్సలైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో 'మీ భూమి-బ్లాక్ చెయిన్'వ్యవస్థను అభివృద్ధి చేసినట్టు అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టును కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పు గోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ఒక్కో మండలంలో అమలు చేస్తున్నట్టు తెలిపారు. దీంట్లో భాగంగా ఆస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీ ్మపురం, కొత్తవలస మండలాల పరిధిలోని 89 రీసర్వే గ్రామాల్లోని 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ చేసేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్టు వివరించారు. 'మీ భూమి-బ్లాక్ చెయిన్' అమలు జరిగే తీరును వివరించే వీడియోను అధికారులు ప్రజెంట్ చేశారు. ఇదే విధానంలో క్యూ ఆర్ కోడ్, ఆధార్‌ను అనుసంధానించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అధ్యయనం చేయాలి... లోపాలు సరిదిద్దాలి**

'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలెట్ ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్ల విలువైన భూముల విషయంలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణతో పోల్చుకుంటే ఏపిలో ల్యాండ్ లిటిగేషన్లు తక్కువే. కానీ గత ప్రభుత్వ విధానం వల్ల ఏపిలోనూ భూ తగాదాలు, వివాదాలు పెరిగాయి. 22ఏ పేరుతో కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ప్రక్షాళన, విముక్తి, భద్రత వంటి అంశాలపై దృష్టి సారించి భూ సమస్యలను పరిష్కరిస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా సర్వేలు చేపడుతున్నాం.. రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం... పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్ర వేసి ఇస్తున్నాం. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి వంటి గ్రామాల్లో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న భూములకు విముక్తి కల్పించాం. ఇప్పుడు ప్రారంభించిన 'మీ భూమి-బ్లాక్ చెయిన్' ప్రాజెక్టు ద్వారా భూములకు శాశ్వత భద్రత దక్కుతుంది. భూ రికార్డులకు సంబంధించి ట్యాంపర్ ప్రూఫ్ వ్యవస్థను తెస్తున్నాం.. పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాం. బ్లాక్ చెయిన్ ద్వారా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే వేదిక మీదకు వస్తాయి... ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రయ విక్రయాలు చేసుకోవచ్చు. రెండు నెలల పాటు ఈ పైలెట్ ప్రాజెక్టు అమలును పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఈ వ్యవస్థ అమల్లో ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని నమోదు చేసుకోవడానికి ఓ కంప్లైంట్ సెల్ పెట్టాలి... దానికి అనుగుణంగా బ్లాక్ చెయిన్ ప్రాజెక్టులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. ఇప్పటి నుంచి సర్వే పూర్తి అయిన గ్రామాలు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వ్యవస్థలోకి వెళ్తాయి. నవంబర్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' టెక్నాలజీ వ్యవస్థ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. భూ సమస్యలకు ఫుల్ స్టాప్ పెట్టేలా రెవెన్యూ వ్యవస్థను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని లక్ష ్యంగా పెట్టుకున్నాం. భూ సమస్యలకు పరిష్కారం చూపితే ఫిర్యాదుల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సిఎస్ సాయిప్రసాద్, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, ఏడు జిల్లాల కలెక్టర్లు, ఎపి ఎన్ఐసి, బెంగళూరుఎన్ఐసి ప్రతినిధులు హాజరయ్యారు.

## వారం - వర్జ్యం

24-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
దశమి ఉ.9.13, అనూరాధ తె.4.36
వర్జ్యం : ఉ.6.12-ఉ.8.00
దు.ఉ.8.20-ఉ.9.12, 2)మ.12.39-మ.1.31
శుభసమయం : ఉ.5.00-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** పారిశ్రామిక రంగాలలో వారికి పదువులు, హోదాలు లభిస్తాయి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు.

**వృషభం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. రెండు, మూడు విధాలుగా ధన లాభం పొందుతారు. కోర్టు కేసుల నుండి బయటపడతారు.

**మిథునం:** క్రీడారంగం యందు ఆసక్తి కలిగివుంటారు. మొండిబాకీలు రాబట్టు కోవడానికి కొత్తగా మార్గాలు అవలంభిస్తారు.

**కర్కాటకం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడిందని గుర్తించి కొత్త వ్యూహాలను అనుసరిస్తారు. ఆ దిశగా కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**సింహం:** నూతనవ్యక్తులు పరిచయమై మాట సహాయసహకారాలు అందిస్తారు. అప్రయత్నంగా కలిసివస్తాయి. ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** క్రయవిక్రయాలు, దూరప్రాంత ప్రయాణాలు, పెట్టుబడులు కొంతకాలం వాయిదావేయటం అన్నివిధాలా మంచిది.

**తుల:** స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. రాజకీయ రంగాలలోని వారు విదేశీ పర్యటనలు పొందుతారు.

**వృశ్చికం:** సేవకా సిబ్బంది వలన, సహోద్యోగుల వలన నష్టములు వాటిల్లవచ్చు, తగు జాగ్రత్తలు పాటించండి.

**ధనుస్సు:** సంతానం గురించి అధికంగా ఆలోచిస్తారు. వారి పురోభివృద్ధికి కావలసిన వనరులను సమకూరుస్తారు.

**మకరం:** దూరప్రాంతాలలోని ఆత్మీయుల నుండి ఆనందదాయకమైన సమాచారం అందుకుంటారు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** వ్యవహారాల తాలూకు చికాకులను ఇంట్లో ప్రదర్శిస్తారు. ఇది లాభించే అంశం కాదు. కనుక తగుజాగ్రత్తగా ఉండండి.

**మీనం:** ప్రతి చిన్నవిషయానికి శ్రమించి చివరకు పూర్తిచేస్తారు. క్రయవిక్రయాలలో మెలుకువ అవసరం.ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అంపోలు జైలుకు అప్పలరాజు

>>పోలీసులు ఉన్నా వాహనాల రాకపోకలు సంభింపచేసినా కాలిబాటన, పొలాల్లోంచి జనం పలాసకాశీబుగ్గ పట్టణానికి చేరుకుని డాక్టర్ కు తమ సంఘీభావంను తెలియజేశారు.. అప్పలరాజు అరెస్టు హైడ్రామా 24 గంటల పాటు నడిచింది.

**ఆరోపణలతో అక్రమ కేసులు**

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు చేసిన యాక్సిడెంట్ లో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందగా.. సాక్షాలను తారుమారు చేసేందుకు ప్రయత్నం చేశారనే అభియోగంతో మాజీ మంత్రి సీదిరిని బుధవారం రాత్రి కాశీబుగ్గ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. రోడ్డు ప్రమాదంలో అప్పలరాజు కుమారుడు అరవ వర్మ సిద్దార్థ త్యాడీలను పదిరోజుల క్రితం అరెస్టు చేసి జైలుకు పంపిన పోలీసులు ఇదే కేసులో ఏ3గా పేర్కొంటూ డాక్టర్ అప్పలరాజును బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. అరవవర్మ సిద్ధార్థ త్యాడీలను అరెస్టు చేసిన రోజు నుంచి అప్పలరాజు ఇంటి వద్ద పోలీస్ స్తే పెద్దసంఖ్యలోనే ఉంది. బుధవారం సాయంత్రం నాటికి ఎసిపి, ముగ్గురు డిఎస్పిలు, పలువురు సిఐలు, ఎస్సైలు, వందలాది మంద పోలీస్ కానిస్టేబుళ్లు కాశీబుగ్గలోని అప్పలరాజు ఇంటివద్దకు చేరుకున్నారు. పోలీస్ బలగాలు బుధవారం సాయంత్రం నుంచి పెద్ద ఎత్తున సీదిరి ఇంటివైపు కదిలిరావడంతో పరిసర ప్రాంతాల్లో ప్రజలు కార్యకర్తలు కూడా అక్కడకు చేరుకొనే ప్రయత్నం చేశారు. అయితే అరెస్టుకు ముంచే పోలీస్ యంత్రాంగం పలాస, కాశీబుగ్గ పట్టణంలో పెద్ద ఎత్తున వలయాలు ఏర్పాటు చేయడంతో పాటు స్టేషన్ వైపు ఎవరూ రాకుండా జారగేడ్లు ఏర్పాటు చేశారు. అప్పలరాజును అరెస్టు చేసిన సమయంలో పోలీసులకు, వైశాపా నేతలు, కార్యకర్తలు, అభిమానులకు వాగ్వివాదం చోటు చేసుకుంది. మాజీ మంత్రి అప్పలరాజును బలవంతంగా పోలీసులు తీసుకొని వెళ్లడానికి చేసిన ప్రయత్నం ను కార్యకర్తలు, అభిమానులు తీవ్రంగా అడ్డుకున్నారు.. ఆయన సోదరుడు సీదిరి త్రినాధ్‌ను పోలీసులు నెట్టేయడం కూడా కార్యకర్తల ఆగ్రహం మరింత పెరగడానికి కారణమయ్యింది.

**అప్పలరాజును రాత్రంతా పోలీస్ స్టేషన్లోనే ఉంచారు**

ఇదే ఘటనలో అప్పలరాజును తీసుకెళ్తున్నప్పుడు అడ్డుకొనేందుకు ప్రయత్నించిన టెక్కలి వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్‌ను కూడా పోలీస్ స్టేషన్‌కు తీసుకొనివెళ్లారు. గురువారం ఉదయం వలాస నియోజకవర్గంలోని వజ్రపు కొత్తూరు, మందస, పలాస మండలాలతో పాటు పలాస, కాశీబుగ్గ పట్టణానికి చెందిన జనం కూడా పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లా నలు మూలల నుంచి మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వారు, సీదిరి అప్పలరాజు అభిమానులు వైసిపి శ్రేణులు, పలాస కాశీబుగ్గ వాహనాలతో రాకపోకలను పోలీసులు అడ్డుకోగలిగినప్పటికీ కాలిబాటన జనం మాత్రం వేల సంఖ్యలో గుమిగూడిపోయారు. మఫ్టీలోనూ, యూనిఫామ్ తోను వందలాది మంది పోలీసులు అరెస్టు చేయడావికి అక్కడకు వచ్చిన జనాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించడాన్ని జనం చర్చించుకుంటున్నారు. పలాస, ఇచ్చాపురం, టెక్కలి నియోజకవర్గాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో జనం హాజరై అప్పలరాజు అరెస్టును ఖండించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లోనే మాజీ మంత్రి అప్పలరాజును ఉంచడాన్ని ముక్త ఖంఠంతో ఖండిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల తరువాత అప్పలరాజును కోర్టులో ప్రవేశపెట్టడంతో జడ్జి బెయిల్ తిరస్కరించి 14 రోజుల రిమాండ్ ను చెప్పడం శ్రీకాకుళం దగ్గర అంపోలు సబ్ జైలుకు తరలించారు.

# సవాల్‌గా తీసుకోండి!

>> చొరవ తీసుకోవాలని సిఎం చంద్రబాబు సూచించారు. క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవరకు ఇన్చార్జ్ మంత్రులదే బాధ్యత అని స్పష్టం చేశారు. భోగాపురం ప్రధాని పర్యటన వివరాలు మంత్రులకు సిఎం వివరించారు. ఉత్తరాంధ్ర 6 జిల్లాల్లో ఫించన్లు ఒకరోజు ముందే ఇచ్చేసి ఆగస్టు 1న పూర్తి స్థాయిలో ప్రధానమంత్రి కార్యక్రమంలో నిమగ్నం కావాలని చంద్రబాబు ఆదేశించారు. అలాగే ప్లానింగ్ బోర్డు సమావేశాలను తరచూ నిర్వహిస్తూ, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని సూచించారు. 'మీ శాఖల్లో ఉన్న సమస్యలను మీరే పరిష్కరించే విధంగా చొరవ చూపాలి. రెండేళ్ల ప్రభుత్వ విజయాలపై మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహించినప్పటికీ, వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయారు' అని చెప్పుకొచ్చారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ కేసుల్లో సిసిటివి కెమెరాల ఆధారంగా నిందితులు దొరికిపోయారని ముఖ్యమంత్రి చెప్పారు. డిఎస్సీ పరీక్షల అంశంలో ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదని, కోర్టులోనూ వారికి అనుకూల ఫలితం రాలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని ఢిల్లీలో జరిగిన నీట్ ఉద్యమంతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇలాంటి అంశాల్లో మంత్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

గోదావరి పుష్కరాలు, పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఒకే రోజు నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సిఎం పేర్కొన్నారు. పోలవరం ప్రారంభోత్సవం, గోదావరి పుష్కరాల ప్రారంభ కార్యక్రమాలను విడివిడిగా నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశంలో చెప్పినట్లు సమాచారం.

మెగా డిఎస్సీకి, ఢిల్లీ ఆందోళనలకు ముడిపెట్టాలని వైఎస్సార్సీపీ యత్నిస్తోందని మంత్రులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. గొడ్డలి పార్టీ కుట్రల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లేని వివాదాలు సృష్టించటమే ఆ పార్టీ నైజం అని చంద్రబాబు మండిపడ్డారు. ప్రో యాక్టివ్‌గా మంత్రులు ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం పొగాకు రైతుల కోసం తీసుకున్న చర్యలను ప్రజలకు ముందుగానే వివరించాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు ముందే తెలియజేస్తే ప్రతిపక్షానికి అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఆగస్టు చివరి వారంలో ఉద్యాన హబ్‌ను మదనపల్లిలో ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆగస్టు మొదటి వారంలో ఉత్తరాంధ్రలో భోగాపురం ప్రారంభోత్సవం ఉంటే, చివర్లో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు.

**ఇళ్ల పట్టాలు పంపిణీకి లోకేశ్ ప్రత్యేక చొరవ**

జిల్లాల్లో ఇన్‌చార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారం అయినట్టేనని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు తెలిపారు. యేళ్ల తరబడి పెండింగ్ సమస్యల పరిష్కారం అయినవి ఎమ్మెల్యేలు, మంత్రులు ఓనర్షిప్ తీసుకోవాలని సూచించారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాలు పంపిణీకి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు.

# రాజాపై ఎస్సీ, ఎస్టీ కేసు

>> 2024వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల ముందు బద్వేల్ టికెట్ కోసం వైకాపా నాయకుల కాళ్ల చుట్టూ తిరిగారని ఇలాంటి అవినీతిపరులకు, లంచగొండిలకు టిక్కెట్ ఇవ్వమని ఎడమ కాలనీలతో బయటకు తన్నేసామంటూ అత్యంత అవమానికారంగా ఆయన మాట్లాడారు.భూ వివాదాల కోసం, మాట్కా దందాల కోసం కర్నూలు మూడో పట్నం పోలీస్ స్టేషన్లో శేషయ్య పోస్టింగ్ ఇచ్చారని వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు ఒంటిమీద చొక్కా ఉంటే ఒట్టు అని హెచ్చరించారు.ఇంటి గేటు దగ్గర నిలబడి ఎండలో వానలో విధులు నిర్వహించే పోస్టును ఇప్పిస్తామని చెప్పారు. జక్కంపూడి రాజా చేసినవి సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారాయి. విషయం ఎస్సీ కమిషన్ దృష్టికి వెళ్లడంతో జక్కంపూడి రాజాపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ కె జవహర్ ఆదేశాలు జారీ చేశారు. ఆయా ఆదేశాలు ప్రకారం బి.ఎన్.ఎస్ 351( 2)ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద ఈ ఏడాది మే నెల 28వ తేదీన కేసు నమోదు చేశారు.దీనిపై నోటీసులు జారీ చేశారు.

ఆనుబంధం / ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 174 పేజీలు: 12 వెల: 6.50


జొన్నగిరి ఇకపై 'స్వర్ణగిరి' గోల్డ్‌మైన్స్

9లో

ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి: మంత్రి గొట్టిపాటి

# ఎల్ నినో సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకోండి!

లోటు వర్షపాతం నమోదవుతోంది
తాగునీటికి తొలి ప్రాధాన్యతివ్వండి
పశుగ్రాసానికి తదుపరి ప్రాధాన్యం
ప్రత్యామ్నాయ పంటలేయండి
రైతులకు అవగాహన కల్పించాలి
కేబినెట్ భేటీలో విస్తృత చర్చ
మంత్రులకు సిఎం దిశానిర్దేశం




**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతుందనే సమాచారం నేపథ్యంలో వ్యవసాయ రంగం జలవనరులు, పౌరసరఫరాలు, పరిశ్రమలు, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖలు సమన్వయంతో సంక్షోభాన్ని సవాలుగా తీసుకోవాలని మంత్రులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం భేటీలో అజెండా అంశాలు ముగిశాక లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించారు. తాగు నీటికి తొలిప్రాధాన్యం, పశుగ్రాసానికి తదుపరి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు మంత్రులు వివరించాలన్నారు. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కృష్ణా, గుంటూరు డెల్టాలో వరి సాగు వేయకుండా రైతుల్ని చైతన్య పరచాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు పై రైతులకు అర్థమయేలా వివరించేందుకు అవగాహన కార్యక్రమాలుచేపట్టాలని వెల్లడించారు. ఏసమస్య ఎక్కడతలెత్తినా ఇన్‌ఛార్జ్ మంత్రులు >>2

## పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

ప్రధాని మోడీ హామీ... గంటల్లోనే కార్యాచరణ
ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాట్లు కేంద్రం చర్యలు
కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద కేసుల విచారణ
దోషులుగా తేలితే ఐదేళ్లు జైలు, రూ.10 లక్షల జరిమానా
తొలి దశలో 4 రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు

**న్యూఢిల్లీ, జులై 23:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్ 2024' కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కోల్‌కతా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే >>2

### ఉపేక్షించబోం!



"మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది మరొకటి లేదు. పరీక్షా పత్రాల లీకేజీకి పాల్పడిన వారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టుల'ను ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించాము. ఈ దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించాము. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తాము చేపడుతున్న వరుస చర్యలలో ఇది మరొకటి. మన యువత భవిష్యత్తుకు హాని కలిగించడానికి ప్రయత్నించే వారిని ఏమాత్రం ఉపేక్షించబోము"
**- నరేంద్రమోడీ, ప్రధానమంత్రి**

### దెబ్బతీసింది మీరే!



"మన యువత భవిష్యత్తును అత్యంత తీవ్రంగా దెబ్బతీసింది మీరే.మన విద్యా వ్యవస్థను పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకుని నాశనం చేసేలా మీరు అనుమతించారు, ప్రోత్సహించారు. అంతేకాక, అందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ మీరు కాపాడారు. విద్యార్థుల డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలి. విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి"
**- రాహుల్‌గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత**

### భవిత కోసమే పోరు!



"అన్నిటికంటే ముందుగా మీరు యువత డిమాండ్లను నెరవేర్చాలి.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, అవినీతి వ్యవస్థను సంస్కరించాలి, విద్యార్థులందరి నుండి క్షమాపణ కోరాలి. ప్రధానమంత్రి గారూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్నది మీ సొంత దేశానికి చెందిన యువతే"
**- కాక్రోచ్ జనతా పార్టీ**



### చర్చలకు సిద్ధం

- కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేంద్ర సింగ్ వెల్లడి
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే చర్చలు: సిజెపి
- ఆ చర్చలు తటస్థ వేదికపైనే జరగాలని స్పష్టీకరణ

### పార్లమెంట్‌లోనూ రెఢీ!

- కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రిజిజు ప్రకటన
- నాల్గవ రోజూ ఉభయ సభల్లో 'నీట్' రభస
- పార్లమెంట్ వెలుపలా అధికార, విపక్షాల ఆందోళన






- ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన
- పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన ఢిల్లీ పోలీసులు
- పోలీసులకు ప్రత్యేక అధికారాలు కల్పించిన కేంద్ర హోంశాఖ
- కాంగ్రెస్ తీరుపై వాంగ్‌చుక్ భార్య గీతాంజలి మండిపాటు
- రాజకీయాల కోసం విద్యార్థులను వాడుకోవద్దని హితవు
- నేడు దేశవ్యాప్త ఆందోళనలకు సిజెపి పిలుపు

### తగ్గేదేలే!: సిజెపి

- విద్యార్థులకు మద్దతు ప్రకటించిన సినీ ప్రముఖులు
- విద్యార్థులు ఒంటరివారు కాదు మేం వాళ్లతో ఉన్నాం
- జంతర్‌మంతర్ నిరసనల్లో విద్రోహ శక్తులు
- ఢిల్లీ పోలీసుల సంచలన పోస్టులు
- సిజెపి ఆందోళనకు విదేశీ నిధులు...
- బిజెపి కార్యకర్తలు రాళ్లు విసిరారు
- సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే ఆరోపణలు
- జంతర్‌మంతర్ దగ్గర ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిపివేత
- భారీగా పోలీసులు మోహరింపు... ఆంక్షలు

## 'నేతన్న సేవ'తో ఆర్థిక దన్ను

- చేనేతలకు యేటా రూ.25 వేల ఆర్థిక సాయం
- 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి
- ఇప్పటికే ఉచిత విద్యుత్ పథకం అమలు
- 50 యేళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్లు
- చంద్రబాబు పాలన నేతన్నలకు స్వర్ణయుగమే
- చేనేతల తరపున సిఎంకు మంత్రి సవిత ధన్యవాదాలు



**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో చేనేత కళాకారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే సిఎం చంద్రబాబు లక్ష్యమని, ఇందులో భాగంగా నేతన్నలకు ఆర్థిక దన్ను కలిగేలా 'నేతన్న సేవ'లో పథకానికి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు. నేతన్న సేవలో పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 51,952 మంది నేతన్నలకు ఆర్థిక లబ్ధి కలిగేలా ఏటా రూ.25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. >>2

## మరింత అధ్యయనం తర్వాత 3,168 ఉద్యోగాల భర్తీ!

కేబినెట్ భేటీలో కీలక నిర్ణయం
25కు పైగా అంశాలపై చర్చ, ఆమోదం
పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ భూములపై నిషేధం ఎత్తివేత
కుప్పంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు
విజయవాడ జెట్ సిటీ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లో స్థలాల కేటాయింపులకు ఆమోదం
గండికోటలో 18 వందల మెగావాట్ల భారీ విద్యుత్ ప్రాజెక్ట్‌కు భూములు కేటాయింపు

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగాల కల్పన, సంక్షేమం, విద్య, నీటిపారుదల రంగాల వంటి కీలక అంశాలకు ఆమోదం తెలపటమే అజెండాగా సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. రెండో దశలో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశంపై మరింత అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి, తదుపరి కేబినెట్ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని సిఎం సూచిం >>2



## ఎర్రచందనం మాఫియా మూలాలను తుడిచేయండి

- డ్రోన్‌లతో నిఘా.. స్మగ్లింగ్ పూర్తిగా అరికట్టాల్సిందే
- కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపండి
- జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలి
- మన ఎర్ర చందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలవద్దు
- అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** "రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా తుడిచిపెట్టే లక్ష్యంతో అటవీ శాఖ ప్రణాళి కలకు మరింత పదును పెట్టాలి. ఇందుకోసం స్మగ్లింగ్ ముఠాలపై నిఘా పెంచాలి. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించు కొంటూ నిఘా పటిష్టం చేయాలి" అని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యా వరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా నిర్మూలించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం, రెండేళ్లలో ఏమేరకు స్మగ్లింగ్ నిరోధించారు, భవిష్యత్ కార్యా చరణ తదితర అంశాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఈసందర్భంగా గడచిన రెండేళ్లలో ఎర్ర చందనం అక్రమరవాణాను అరికట్టేందుకు అటవీశాఖ తీసుకున్న చర్యలు, సాధించిన ప్రగతి, నమోదైనకేసుల వివరాలను అధికారులు వివరించారు.

**506 కేసులు... 1239మంది అరెస్టు**

గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టినట్లు అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి అధికారులు వివరించారు. 506 కేసులు నమోదు చేసి, 1,239 మందిని అరెస్ట్ చేయగా, 372 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, 12మంది ప్రధాన స్మగ్లర్లపై పిడిచట్టం కింద >>2



## అంపోలు జైలుకు అప్పలరాజు

బెయిలు తిరస్కరణ
14 రోజుల రిమాండ్
పలాసలో హైడ్రామా
రోజంతా పోలీస్ స్టేషన్‌లోనే
భారీగా పోలీసు బందోబస్తు

**పలాస, జులై 23, ప్రభాతవార్త :** మాజీ మంత్రి వైకాపా నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్టుతో పలాసకాశీబుగ్గ జంట పట్టణాలు అట్టుడికిపోయాయి. అప్పలరాజు అరెస్టు వార్త బుధవారం సాయంత్రం జనానికి తెలిసిపోవడంతో పరిసర ప్రాంతాలనుంచి జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గురువారంసాయంత్రం వేలాది సంఖ్యలో జనం పలాస కాశీబుగ్గ పట్టణానికి చేరుకున్నారు. వందలాది మంది >>2

## అమరావతిలో పిఎన్‌బి క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్

సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

**విజయవాడ , జులై 23.ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటం వ్యాలీలో మరో కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందుకు వచ్చింది. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ లో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ఎపి క్వాంటం మిషన్‌పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య ఒప్పందం కుదిరింది. సిఎం చంద్రబాబు నాయుడు పిఎన్‌బి సిఇఒ, ఎండి అశోక్ చంద్ర సమక్షంలో ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న మొట్ట మొదటి బ్యాంక్‌గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచింది. బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను పటిష్టం చేయటంతో పాటు ఆర్థిక మోసాలను ముందుగా గుర్తించే వ్యవస్థ ఏర్పాటు, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్ని సురక్షితంగా నిర్వహించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తోంది. పరిశ్రమలు, >>2

## జక్కంపూడి రాజాపై ఎస్సీ, ఎస్టీ కేసు

28న విచారణకు రావాలంటూ వైసిపి నేతకు నోటీసులు

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రతినిధి, జులై 23,ప్రభాతవార్త:** కర్నూలు మూడవ పట్టణ సిఐగా విధులు నిర్వహిస్తున్న శేషయ్యను ఉద్దేశించి అత్యంత అభ్యంతరంగా మాట్లాడిన వైయస్ఆర్సీపి యువత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కర్నూలు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 28వ తేదీన ఉదయం 11 గంటలకు వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలని డిఎస్‌పి రాఘవేంద్ర ఆయనకు నోటీసులు పేర్కొన్నారు. వైకాపా యోజన విభాగం కర్నూలు నగర అధ్యక్షుడు బాలును పోలీసులు వేధిస్తున్నారంటూ వైకాపా నాయకులు మే 14వ తేదీన కలెక్టరేట్ దగ్గర ధర్నా చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ పోలీసులు కాకి చొక్కాలు వేసుకుని తప్పు చేస్తున్నారని తాము కొట్టే దెబ్బ చావుదెబ్బలాగా ఉంటుందని హెచ్చరించారు. సిఐ శేషయ్య తాను సంపాదించిన అక్రమ సంపాదనతో రాజకీయాల్లోకి రావాలని చూశారని జక్కంపూడి ఆరోపించారు. >>2

## రెండేళ్లలో రూ.29.30లక్షల కోట్ల పెట్టుబడులు

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చిత్తశుద్ధితో అమలు చేయాలి
పరిశ్రమల గ్రౌండింగ్‌లో ప్రతినెలా పురోగతి కన్పించాలి
20లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రుల బృంద సమావేశంలో మంత్రి లోకేష్ దిశానిర్దేశం



గురువారం రంపచోడవరంలో మంత్రి లోకేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న దృశ్యం

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.29,30,357 కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు ముందుకు వచ్చాయి. వీటిద్వారా 24,66,165 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించే అవకాశంఉంది. ప్రతి ప్రాజెక్టును ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశం మంత్రిలోకేష్ అధ్యక్షతన ఉండవల్లిలో జరిగింది. సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... పరిశ్రమలకు భూకేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షలో పురోగతి కన్పించాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలు ఎపిని ఎంచు >>2

## ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఎపి

భూ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి
భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్'
ట్యాంపర్ చేయలేని విధంగా ల్యాండ్ రికార్డులకు హై సెక్యూర్టీ
'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రక్షాళన-విముక్తి- భద్రత అంశాలుగా భూ సమస్యలకుశాశ్వతపరిష్కారంచూపేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ల్యాండ్ లిటిగేషన్ ఫ్రీ రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామని సిఎం తెలిపారు. దీనికి అనుగుణంగానే భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా 'మీ భూమి-బ్లాక్ చెయిన్' ప్రాజెక్టును తెచ్చామని సిఎం చంద్రబాబు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి 'మీ భూమి-బ్లాక్ చెయిన్' పైలెట్ ప్రాజెక్టును వర్చువల్‌గా సిఎం ప్రారంభించారు. ఈ మేరకు ఈ ప్రాజెక్టులో ఉన్న ఫీచర్స్, ప్రత్యేకత లను సిఎస్ సాయిప్రసాద్, రెవెన్యూ శాఖ అధికారులు సిఎం చంద్రబాబుకు వివరించారు. భూ రికార్డులకు శాశ్వత భద్రత కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు బ్లాక్‌చెయిన్ విధానాన్ని రెవెన్యూశాఖ రూపొందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో భూ సమస్యలకు చెక్ పెట్టేలా ప్రతి ల్యాండ్ పార్సెల్‌కు ప్రత్యేక డిజిటల్ ఐడి >>2

24-7pg4_24-7pg4.qxd 23/Jul/26 10:35 PM Page 1



వార్త

భూమ్మీద మనిషంత గొప్పవాడు ఎవడూ లేడు. మనిషిలో మెదడంత గొప్ప అవయవం మరొకటి లేదు.

న-విలియం హామిల్టన్

# ఒక దీక్ష... ఎన్నో ఆలోచనలు!

*ప్రభుత్వాలకు కూడా ఒక చారిత్రక బాధ్యత ఉంది. శాంతియుత నిరసనలను బల హీనతగా కాకుండా ప్రజాస్వామ్య శక్తిగా చూడాలి. విభేదాలను అణచివేయడం తాత్కాలిక నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ సంభాషణ మాత్రమే శాశ్వత విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ప్రజాస్వామ్యం అనేది గెలుపుఓటమి రాజకీయాల కంటే, పరస్పర విశ్వాసం మీద నిలిచే వ్యవస్థ. సోనం వాంగ్‌చుక్ ఉద్యమం చివరకు విజయం సాధిస్తుందా? కాలమే సమాధానం చెబుతుంది. కానీ ఈ ఉద్యమం ఇప్పటికే ఒక విజయాన్ని సాధించింది. అది లక్షలాది మందిని ఆలోచింప జేసింది. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతితో మన సంబంధం ఎలా ఉండాలి? యువత పాత్ర ఏమిటి? ప్రభుత్వ బాధ్యత ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలను మళ్లీ మన ముందుంచింది.*

చరిత్రలో కొన్ని క్షణాలు ఉంటాయి. అవి యుద్ధాల వల్ల కాదు. ఎన్నికల వల్ల కాదు. ఒక మనిషి మౌనంగా కూర్చోవడం వల్ల పుడతాయి. మాట్లాడకపోవడం వల్ల వినిపిస్తాయి. తినకపోవడం వల్ల దేశాన్ని ఆలోచింపజేస్తాయి. సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష అలాంటి క్షణాల్లో ఒకటి. ఆకలి సాధారణంగా శరీరానికి సంబంధించిన విషయం. కానీ కొన్నిసార్లు ఆకలి ఒక రాజకీయ భాష అవుతుంది. ఒక నిరసన అవుతుంది. ఒక నైతిక ప్రశ్నగా మారుతుంది. ఒక వ్యక్తి తన శరీరాన్నే వాదనగా మార్చుకున్నప్పుడు, అతని శక్తి కండరాల్లో ఉండదు. అతని బలం అతని నిశ్శబ్దంలో ఉంటుంది. ఆ నిశ్శబ్దం అధికారాన్ని అవమానించదు. కానీ ప్రశ్నిస్తుంది. సమాధానం కోరుతుంది. ఈ దేశం నిరాహార దీక్షలను కొత్తగా చూడలేదు. మహాత్మా గాంధీ కాలం నుంచి ఈ నేల ఒక విచిత్రమైన రాజకీయ సత్యాన్ని తెలుసుకుంది. కొన్నిసార్లు ఖడ్గం చేయలేని పనిని ఉపవాసం చేస్తుంది. శబ్దం చేయలేని మార్పును మౌనం తీసుకొస్తుంది. అయితే ప్రతి నిరాహార దీక్ష చరిత్రలో నిలవదు. ప్రజల హృదయాలను తాకినప్పుడే అది ఉద్యమమవుతుంది. సోనం వాంగ్‌చుక్ విషయంలో ఆసక్తికరమైన విషయం ఆయన వ్యక్తిత్వంకాదు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలు. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతి కేవలం వినియోగించాల్సిన వనరేనా? పర్వతాలు రాళ్ల కుప్పలా? నదులు కేవలం నీటి పైపులా? లేక ఇవన్నీ మన నాగరికతకు ఊపిరా? ఈ ప్రశ్నలు ఒక్క ప్రాంతానికి సంబంధించినవి కావు. ఇవి భవిష్యత్తు తరాల ప్రశ్నలు. మన కాలంలో అభివృద్ధి అనే పదం అత్యంత ఎక్కువగా వినిపిస్తోంది. కానీ అదే సమయంలో అడవులు తగ్గుతున్నాయి. నదులు ఎండిపోతున్నాయి. పర్వతాలు కోతలకు గురవుతున్నాయి. గాలి భారంగా మారుతోంది. అభివృద్ధి మనిషి కోసం జరగాలి. మనిషి ప్రకృతిని కోల్పోయేలా జరిగితే, అది అభివృద్ధి కాదు, భవిష్యత్తుపై అప్పు. ఈ ఉద్యమంలో మరో ఆశ్చర్యకరమైన అంశం జెన్‌జెడ్ యువత స్పందన. ఈ తరాన్ని చాలామంది మొబైల్ స్క్రీన్‌ల తరం అంటారు. కానీ అదే స్క్రీన్‌ల నుంచి ఒక సామాజిక చైతన్యం కూడా పుట్టవచ్చని ఈ సంఘీభావం చూపించింది. వారు కేవలం ఒక వ్యక్తికి మద్దతు ఇవ్వడం కాదు. ఒక ప్రశ్నకు మద్దతు ఇస్తున్నారు. 'భవిష్యత్తు ఎలా ఉండాలి?' అనే ప్రశ్నకు. యువత ఉద్యమాల్లో చేరడం కొత్త విషయం కాదు. కానీ నేటి యువత భావోద్వేగాలకంటే సమాచారంతో ముందుకు వస్తోంది. వారు పర్యావరణంపై చదువుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలను గమనిస్తున్నారు. తమ భవిష్యత్తు వాతావరణ మార్పులతో ముడిపడి ఉందని అర్థం చేసుకుంటున్నారు. అందుకే వారి సంఘీభావాన్ని కేవలం సోషల్ మీడియా ట్రెండ్‌గా తీసిపారేయలేం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల బాధ్యత కేవలం పాలించడం కాదు. వినడం కూడా. ప్రతి నిరసన సరైందని చెప్పలేం. ప్రతి డిమాండ్‌ను అంగీకరించాల్సిన అవసరం కూడా లేదు. కానీ శాంతి

ఎం కె కుమార్


యుతంగా ప్రశ్నించే పౌరులను వినడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచిక. ప్రశ్నలను అణచివేయడం కంటే వాటితో సంభాషించడం ఎప్పుడూ మెరుగైన మార్గం. ఈ ఉద్యమాన్ని చూసి మరో ప్రశ్న కూడా మన ముందుకొస్తుంది. మనం ప్రకృతిని ప్రేమిస్తున్నామా? లేక అవసరమైనంత వరకు మాత్రమే ఉపయోగించుకుంటున్నామా? హిమాలయాలు కేవలం పర్యాటక ప్రాంతాలు కావు. అవి భారతదేశ జలవనరుల హృదయం. వాటి ఆరోగ్యం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. అక్కడ జరిగే మార్పులు వేల కిలోమీటర్ల



దూరంలో ఉన్న ప్రజల జీవితాలను కూడాప్రభావితం చేయగలవు. సోనం వాంగ్‌చుక్ గెలుస్తారా? ఓడిపోతారా? ఈ ప్రశ్నకు సమాధానం భవిష్యత్తు చెబుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన ఒక చర్చను ప్రారంభించారు. ఒక దేశం తన అభివృద్ధి నమూనాను మరోసారి పరిశీలించాలా అనే ప్రశ్నను ముందుంచారు. అదే ఒక ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన పని. ఎందుకంటే ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేయడం కాదు. ప్రతి రోజు మన భవిష్యత్తు గురించి మాట్లాడుకోవడం. ప్రకృతి గురించి ఆలోచించడం. భిన్నాభిప్రాయాలను వినడం. అధికారాన్ని ప్రశ్నించడం. సమాధానాలను కలిసి వెతకడం. ఒక మనిషి ఆకలి ఎన్నిరోజులు కొనసాగుతుందో తెలియదు. కానీ ఆ ఆకలి ఒక దేశపు మనస్సాక్షి ని మేల్కొలిపితే, ఆ నిరాహార దీక్ష చరిత్రలో ఒక రాజకీయ సంఘటనగానే కాదు, ఒక నైతిక సంభాషణగా కూడా నిలి చిపోతుంది. ఒక దేశం బలం దాని సైన్యంలో మాత్రమే ఉండదు. దాని సంపదలో మాత్రమే ఉండదు. ఆ దేశంలో ఒక సాధారణ పౌరుడు అధికారాన్ని ప్రశ్నించగల ధైర్యంలో ఉంటుంది. ప్రశ్నించిన వ్యక్తిని శత్రువుగా కాకుండా, సంభా షణకు ఆహ్వానించే రాజకీయ సంస్కృతిలో ఉంటుంది. ఈ కారణంగానే సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కేవలం ఒక ఉద్యమంగా మిగలలేదు. అది భారత ప్రజాస్వామ్యానికి ఒక అద్దంగా మారింది. నేడు ప్రపంచమంతా అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, వేగవంతమైన రైళ్లు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఇవన్నీ అభివృద్ధి సూచికలుగా మారాయి. కానీ ప్రకృతి నిశ్శబ్దంగా ఒక ప్రశ్న అడుగుతోంది. 'ఈ అభివృద్ధిలో నాకు చోటుందా?' అనే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మనం ఎంత దూరం పరిగెత్తినా, ఒకరోజు అదే ప్రకృతి మనల్ని ఆపుతుంది. ప్రపంచ చరిత్ర చెబుతున్న ఒక నిజం ఉంది. ప్రకృతిని జయించాలని ప్రయత్నించిన నాగరికతలు చివరికి ప్రకృతి ముందు తలవంచాయి. నదులకు బంధించిన సమాజాలు వరదలను చూశాయి. అడవులను నరికిన దేశాలు కరవును అనుభవించాయి. పర్వతాలను పేల్చిన నాగరికతలు భూకంపాల భయాన్ని ఎదుర్కొన్నాయి. ప్రకృతి ప్రతీకారం తీర్చుకోదు. కానీ తన నియమాలను మాత్రం మార్చదు. ఈ నేపథ్యంలో యువత స్పందనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఒకప్పుడు రాజకీయాలు పెద్దల విషయం అనుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. వాతావరణ మార్పులు, ఉపాధి, విద్య, సాంకేతికత, స్వేచ్ఛ ఇవి యువత భవిష్యత్తును నేరుగాప్రభావితం చేస్తున్నాయి. అందుకే వారు ప్రేక్షకులుగా ఉండటానికి సిద్ధంగా లేరు. వారు ప్రశ్నిస్తున్నారు. చర్చిస్తున్నారు. భాగస్వాములు కావాలని కోరుకుంటున్నారు. అయితే ప్రతి ఉద్యమానికి ఒకప్రమాదం కూడా ఉంటుంది. అది వ్యక్తి చుట్టూ తిరగడం. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు ముఖ్యమే. కానీ వ్యక్తుల కంటే విలువలు ముఖ్యమైనవి. ఒక ఉద్యమం ఒక నాయకుడి జీవితంతో ముగియకూడదు. అది సమాజంలో ఆలోచనగా మిగలాలి. పర్యావరణం గురించి, ప్రజల భాగస్వామ్యం గురించి, బాధ్యతాయుతమైన పాలన గురించి చర్చలు కొనసాగాలి. అదే ఒక ఉద్యమం నిజమైన విజయం. మీడియా పాత్ర కూడా ఇక్కడ అత్యంత కీలకం. వార్తలను చెప్పడం మాత్రమే కాదు. ప్రజలకు వివిధ కోణాలను అందించడం కూడా మీడియా బాధ్యత. ఒక ఉద్యమాన్ని పొగడడమో, పూర్తిగా ఖండించడమో కాదు దాని వెనుక ఉన్న ప్రశ్నలను సమాజం ముందు ఉంచడమే ప్రజాస్వామ్య మీడియా ధర్మం. ప్రజలు అన్ని వాదనలు విని తమ అభిప్రాయాన్ని ఏర్పరచుకునే అవకాశం కల్పించాలి. ప్రభుత్వాలకు కూడా ఒక చారిత్రక బాధ్యత ఉంది. శాంతియుత నిరసనలను బల హీనతగా కాకుండా ప్రజాస్వామ్య శక్తిగా చూడాలి. విభేదాలను అణచివేయడం తాత్కాలిక నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ సంభాషణ మాత్రమే శాశ్వత విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ప్రజాస్వామ్యం అనేది గెలుపుఓటమి రాజకీయాల కంటే, పరస్పర విశ్వాసం మీద నిలిచే వ్యవస్థ. సోనం వాంగ్‌చుక్ ఉద్యమం చివరకు విజయం సాధిస్తుందా? కాలమే సమాధానం చెబుతుంది. కానీ ఈ ఉద్యమం ఇప్పటికే ఒక విజయాన్ని సాధించింది. అది లక్షలాది మందిని ఆలోచింప జేసింది. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతితో మన సంబంధం ఎలా ఉండాలి? యువత పాత్ర ఏమిటి? ప్రభుత్వ బాధ్యత ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది? అనే

# 'ఉచితాల' కోసం ఎన్ని తిప్పలో!

ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా రూపొందుతున్న పథకాలు ఏలిన వారికి విజయం సాధించి పెట్టినా, ఆ వెంటనే అభాసుపాలు చేస్తున్నాయి. చిత్తశుద్ధికీ లక్ష్య సిద్ధికి లంగరు అందడం లేదు. అనర్హులకు చిక్కుతున్నా యి. ప్రభుత్వ ఖజానాలకు చిల్లుపెడుతున్నాయి. దేశవ్యా ప్తంగా ఏ రాష్ట్రంలో ఏరాజకీయ పార్టీ అధికారంలోఉన్నా అవలంభించాల్సిన ఎన్నికల తంత్రం ఇదేనన్నట్లు చరిత్ర శిలాక్షరాలు రాసిపెట్టేసినట్లుంది. ఉచితాలనేవి తాత్కాలిక ప్రయోజనం ఆశించి గుప్పించే 'ఎర'మాత్రమే.అంతకన్నా వేరుగా విశ్లేషించలేం. కాలక్రమేణ అదే విషయం నిరూపితమవుతోంది. మహారాష్ట్రలో మహిళల కోసం మొన్న ఎన్నికలప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకం ఇప్పుడు ఆ రాష్ట్ర కోశాగారానికి కన్నం పెట్టిందనే చెప్పాలి. అనర్హులకు తామరతంపరగా ఆర్థికలబ్ధి చేరిపోయింది.ఇదేదో కుడి ఎడమైతే పర్వాలేదని పరాకుగా తెచ్చినపథకంకాదు. కానీ మహా కోశాగారం ఖాళీ అయిపోయింది. మహారాష్ట్ర ప్రభుత్వం పేదమహిళల ఆర్థిక పరిపుష్టి కోసం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ముఖ్యమంత్రి మాఝీలాడ్కీ బహీన్ యోజన'లో వెలు గుచూసిన ఆరోపణలు, బడ్జెట్ ఉల్లంఘనలు, నకిలీ లబ్ధిదారుల ఉదంతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో పారదర్శకత లోపిస్తే, ప్రజాధనం ఏ విధంగా దుర్వినియోగమవుతుందో తెలి పేందుకు ఈ ఘటన ఒక ఉదాహరణ. కాగ్ నివేదికతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర తనిఖీల్లో ఈ పథకంలో జరిగిన లోపాలు స్పష్టమయ్యాయి. ప్రాథమిక దశలో కఠినమైన భౌతిక తనిఖీలు లేకుండా కేవలం స్వీయ పత్రాల ఆధారంగా ఆదరబాదరగా నిధులు విడుదల వల్ల నకిలీ ఖాతాలు వెలిశాయి. నిరుపేద మహిళలకు నెలకు రూ.1,500 ఇచ్చే ఈపథకంలో సుమారు 14వేల మంది కి పైగా పురుషులు మహిళలుగా నకిలీపత్రాలతోనమోదు చేసుకుని నిధులు పొందినట్లు తేలింది.దీనివల్ల సుమారు రూ.21.44 కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. అర్హత లేకపోయినా దాదాపు 2,600 మందికి పైగా ప్రభుత్వ మహిళా ఉద్యోగులు (క్లాస్3, క్లాస్4) ఈ ఆర్థిక సహాయాన్ని అక్రమంగా పొందారు. దాదాపు 29వేల మంది పురుషులు, సుమారు 8వేల మంది ప్రభుత్వఉద్యోగులు అనర్హులు అయినప్పటికీ లబ్ధి పొందినట్లు తేలింది.నిధుల కేటాయింపుల్లో అనుమతించిన బడ్జెట్ కంటే దాదాపు రూ.3,541 కోట్ల మేర అదనపు వ్యయం జరిగిందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. ఈ స్థాయిలో అక్రమాలు జరగడానికి ప్రభుత్వ యంత్రాంగం,డిజిటల్ వ్యవస్థల్లో ఉన్న లోపాలే ప్రధాన కారణం. ఎంప్లాయ్ డేటాబేస్ , ఆధార్ సీడింగ్‌ను సరిగ్గా సరిపోల్చకపోవడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం సులభంగా లబ్ధిదారులుగా మారిపోయారు. లోపాలు బయటపడిన తర్వాత ప్రభుత్వం కఠిన తనిఖీలు చేపట్టి,ఆన్‌లైన్ ఈకెవైసి ప్రక్రియ ద్వారా దాదాపు 92లక్షల నకిలీ, అనర్హమైన ఖాతాలను తొలగించింది. అలాగే అక్రమంగా నిధులు పొందిన వారి నుండి రికవరీ చర్యలను ప్రారంభించింది. తొలగించబడిన లబ్ధిదారులు సుమారు రూ.14వేలకోట్లు అందుకున్నారు. ఈ ఘటన ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ పథకాలనిర్వహణపై అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. ఎన్నికల సమయాల్లో హడావుడిగా తగినంత బడ్జెట్ అంచనాలు లేకుండాప్రవేశపెట్టే పథకాలు రాష్ట్ర ఆర్థికపరిస్థితిని దెబ్బతీస్తాయి. ఒకేసారి లక్షలాది పేర్లను తొలగించే క్రమంలో,డిజిటల్ పరిజ్ఞానం లేని కొందరు నిజమైన పేద మహిళలు కూడా ఈకెవైసి సమస్యల వల్ల ప్రయోజనాలు కోల్పోతున్నారనే ఆందోళన ఉంది. లడ్కీబహీన్ యోజన కింద నమోదు చేసుకున్న ప్రతి 10మంది మహిళల్లో దాదాపునలుగురిని తొలగించినట్లు ప్రభుత్వ రికార్డుల సమీక్షలో వెల్లడైంది. ఈపథకం నుండి 92 లక్షలకు పైగా లబ్ధిదారులను తొలగించారు. ఇది మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడించిన సుమారు 80లక్షల తొలగింపులను మించిపోయింది. ఇలాంటి వాటిపై ఎన్నో చర్చోపచర్చలు జరుగుతాయి. కానీ ఫలితం శూన్యం. వారి కుటుంబాల వార్షిక ఆదాయం పథకం అర్హత గరిష్ట పరిమితి అయిన రూ.2.5లక్షలను మించిపోయినందున,దాదాపు 16లక్షల మంది లబ్ధిదారులను తొలగించారు.ధృవీకరణ సమయంలో మరో 4.42లక్షల మంది లబ్ధిదారులు, తాము గానీ లేదా తమ కుటుంబ సభ్యులలో ఒకరు గానీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నారని ప్రకటించారు. వీరిలో సుమారు3.6 లక్షల మంది ఇప్పటికే సంజయ్‌గాంధీ నిరాధర్ యోజన కింద సహాయం పొందుతుండగా, దాదాపు 2.5 లక్షల కేసులలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందుతున్నారు. రికార్డుల ప్రకారం, సుమారు 1.8 లక్షల మంది లబ్ధిదారులు 65ఏళ్ల గరిష్టఅర్హతా పరిమితి కంటే ఎక్కువ వయస్సుగలవారని,జిల్లా స్థాయి ధృవీకరణ సమయంలో దాదాపు 1.7లక్షల మందిని గుర్తించినట్లు వెల్లడైంది. ఈపథకం కింద, సంవత్సరానికి రూ.2.5 లక్షల కంటే తక్కువ సంపాదించే కుటుంబాలకు చెందిన 21నుండి 65 సంవత్సరాల మధ్యవయస్సు గల మహిళలు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా నెలకు రూ. 1,500 పొందుతారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు , కొన్ని ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులను దీని నుండి మినహాయించారు. ధృవీకరణ ప్రక్రియలోని వివిధ దశలలో లబ్ధిదారులు సుమారు 10 నెలల పాటు సహాయం పొందారని అధికారులు తెలిపారు. కేవలం ఓట్ల లబ్ధికోసం వేగంగా నిర్ణయాలు తీసుకోవడం



ఇరవైయేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్కకాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.

థామస్ ఫుల్లర్



మహనీయుడు మరణాసన్న దశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.

లియో టాల్‌స్టాయ్

# ఆదాయపు పన్ను.. ప్రజల ఆర్థిక బాధ్యత



రామ కిష్టయ్య సంగన భట్ల

భారత ఆర్థిక చైతన్యానికి సంకేతంగా నిలిచే జులై 24 ఆదాయపు పన్ను దినోత్సవం. ఇది కేవలం ఓ చట్టబద్ధమైన విధానం రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతను, ప్రభుత్వానికి పౌరుల భాగస్వామ్యాన్ని, నైతికతను, పారదర్శకతను గుర్తుచేసే చైతన్య దినం. భారత దేశంలో ఆదాయపు పన్ను చట్టం మూలాలు బ్రిటిష్ కాలంలోకే వెళ్తాయి. 1857 సిపాయిల తిరుగు బాటుతో ఏర్పడిన ఆర్థిక లోటును తీర్చేందుకు 1860 జూలై 24న బ్రిటన్ ఆర్థిక మంత్రి సర్ జేమ్స్ విల్సన్ పర్యవేక్షణలో ఆదాయపు పన్ను విధానం రూపొందించబడింది. గవర్నర్ జనరల్ లార్డ్ కేనింగ్ మద్దతుతో తొలిసారిగా భారత దేశంలో ఆదాయపు పన్ను అమలులోకి వచ్చింది. ఈ చరిత్రాత్మక నిర్ణయం భారత ఆర్థిక పరిపక్వతకు నాంది పలికింది. ఈ చారిత్రికతకు గౌరవ సూచకంగా భారత ఆదాయపు పన్నుశాఖ 2010 నుంచి ప్రతి సంవత్సరం జూలై 24ను ఆదాయపు పన్ను దినంగా అధికారికంగా నిర్వహిస్తోంది.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పన్ను చెల్లింపుదారుల పట్ల కృతజ్ఞత ప్రకటిస్తూ అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణలు, విజేతల సన్మానాలు నిర్వహించబడుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961నాటి చట్టం, ఇది 1962 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈచట్టం ప్రకారం వ్యక్తులు, కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు తమ ఆదాయానికి తగిన విధంగాపన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను వసూళ్లను పర్యవేక్షి ంచే ఆదాయపు పన్ను శాఖ దీనిని నిష్టతో అమలు చేస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలో ఆదాయపుపన్ను కీలకమైన వన రుగా నిలుస్తోంది. దేశానికి వచ్చే మొత్తం పన్ను ఆదాయం లో సగానికి పైగా




ఆదాయపు పన్నుల ద్వారానేలభిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే ఆదాయపు పన్నుల ద్వారా రూ.10లక్షల కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. ఈ ఆదాయంతోనే ప్రభుత్వం ఆరోగ్యం, విద్య, రక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడు లు పెడుతోంది. పన్ను చెల్లించే వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఆదాయపు పన్ను శాఖ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ఫేస్‌లెస్ అసెస్మెంట్ విధానం ద్వారా అవినీతి నివారణ, ఇఫైలింగ్ వేదిక ద్వారా సుల భత, ప్రీఫిల్డ్ రిటర్న్‌లతో ప్రజలకు సమయాన్ని ఆదా చేసే మార్గం, డిజిటల్ చెల్లింపు పద్ధతుల ద్వారా పారదర్శకత పెరిగింది. అంతేకాక, ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని పన్ను చెల్లింపుదారుల అనుభవాన్ని మెరుగుపరచడం జరిగింది. పన్ను విధానంలో సామాజిక సమతుల్యతకూ ప్రాధాన్యం ఇచ్చారు. అధిక ఆదాయం కలిగిన వారు అధిక పన్నుచెల్లిస్తే, తక్కువ ఆదాయం కలిగినవారు మినహాయింపులను పొందే విధంగా వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఫలితంగా, సమాజంలోని బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి.2023-24లో దేశవ్యాప్తంగా 8.2 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు నమోదయ్యారు. వారిలో 60శాతం పాత పన్నువిధానాన్ని ఎంచుకోగా, మిగిలిన వారు కొత్త పన్ను విధానాన్ని అనుసరించారు. ఇది ఆదాయ స్థాయిలను బట్టి వ్యక్తులు ఎంచుకునే స్వేచ్ఛను సూచిస్తుంది. ఇదే ప్రజల ఆర్థిక చైతన్యానికి నిదర్శనం. పన్ను చెల్లించడాన్ని నేరుగా చట్టబద్ధ కర్తవ్యంగా కాక, దేశానికి చేసే సేవగా భావించాల్సిన అవసరంఉంది. ప్రతి పౌరుడు తన ఆదాయానికి తగిన విధంగా పన్ను చెల్లిస్తే మాత్రమే సమాజంలో సమతుల్యత, అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆదాయపు పన్ను దినం అంటే కేవలం పన్ను చట్టాన్ని గుర్తు చేసే రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతకు గుర్తుగా నిలిచే అవిశ్రాంత పిలుపు. ఈ సందర్భంగా పన్ను చెల్లించు - దేశాన్ని నిర్మించు అనే నినాదం ప్రజల మనసుల్లో నాటుకోవాలి. జూలై 24 - ఇది దేశాభివృద్ధిలో పౌర సహకారానికి ఒక నిశ్చల గుర్తింపు, భవిష్యత్ భారత నిర్మాణానికి ప్రజల నైతిక

# ప్రజావాక్కు

## ప్రభుత్వ భూములాక్రమిస్తే జైలే గతి

ఈ మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబుప్రభుత్వ భూములు ఆక్రమిస్తే జైలే గతి అని ప్రకటించారు.అప్పుడే అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అటవీ భూములు ఆక్రమిస్తే తాట తీస్తాం అన్నాడు.. ఇద్దరి ప్రకటనలు చాలా బాగున్నాయి. అయితే అవి ఉత్తుత్తి ప్రకటనలుగానే మిగిలిపోయాయి అన్న అనుమానం వస్తుంది.ఎందుకంటే రాష్ట్రంలో దొంగ స్వాములు ప్రకాశంజిల్లాలో దొంగస్వామి, తిరుపతి జిల్లాలో కల్కి ఇద్దరు ప్రభుత్వ భూములు, దళితులభూములు, అటవీ భూములు అసైన్డ్ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో రకరకాలుగా మోసం చేస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని దొంగస్వామి ఆక్రమించిన భూముల ను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ 2021లో ఆదేశం ఇచ్చింది. ఇంతవరకు అతీగతీ లేదు.కల్కి వందలాదిఎకరాలు అసైన్డ్‌పేదల భూములుఆక్రమించి ఆశ్రమం నిర్మించాడు.కలెక్టరు ఖాళీచెయ్యమంటే కోర్టుకు వెళ్ళాడు. అటవీ భూమిలో కట్టేపుల్ల విరిస్తే జైల్లో పెడతాం అనే అటవీశాఖవారు కల్కి విషయంలో ఎందుకీ మౌనం?

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## విద్యార్థుల గురించి ఆలోచించాలి?

జిల్లా కేంద్రంలో ఉన్నకాలేజీలు,అందులో కొన్నిఆర్ట్స్ గ్రూపులు గ్రామాలకు తరలించడం అనే ప్రచారం జరుగుతుంది. జులై 31వరకు అడ్మిషన్లు ఇంకా కొనసాగుతున్నాయి. 40 సీట్లు భర్తీ కాలేదు. తగిన వసతులు లేవు. ట్రైబల్ విద్యార్థులు ఏజెన్సీ దూర గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్నారు. ఆగస్టు మొదటి వారంలో టెస్టులు నిర్వహించడం కోసం షెడ్యూల్ వచ్చింది. నోట్ బుక్స్, టెక్స్ట్‌బుక్స్,స్టడీమెటీరియల్,యూనిఫామ్‌లుఇంకారాలేదు. అరకొర వసతులతో ఎలా చదవడం ?గ్రామాలలో తగిన రవాణా వసతులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతవిద్యలతో ఉద్యోగాలుపొందేఅవకాశం కలిపించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## రేషన్ కేవైసీ చేసుకోవాలి

రాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరూ త్వరితగతిన రేషన్ కార్డులో పేరు కలిగిన అందరూ వేలిముద్ర ద్వారా ఈ కేవైసీ చేసుకోవాలి.రేషన్ కార్డు ఈ చేసుకోకపోతే రేషన్ నుండి పేరుతొలగించే అవకాశం లేకపోలేదు. కావున అందరూ చేసుకుని పథకాలకు అర్హులుగా ఉండగలరని అధికారులు సూచిస్తున్నారు.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## సరైన నిర్ణయం కాదు!

దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక సంస్థను ఏర్పాటు చేసుకోవడానికి, అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోరడానికి,హక్కులు నిరాకరించబడినప్పుడు పోరాడేందుకు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి రాజ్యాంగం అందరికీ హక్కులను కల్పించింది. అందుకే 'నీట్'సహా వివిధ పోటీ పరీక్షలలో ప్రశ్నాపత్రాలు లీక్ కుంభకోణం, అవకతవకలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరుగుతున్నాయి. నీట్ పునఃపరీక్ష కారణంగా చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.తమపిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ప్రతిరోజూ కన్నీరు కార్చుతూ ఎంతో దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు.దీనికికారణం అవినీతిమయమైన విద్యా వ్యవస్థ కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్ సమంజసమైనదే.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం

## కరోనా నిజమేనా?

మెడికల్ మాఫియా లేక కరోనా అనేది నిజమా అని నిర్ధారణ చేసుకోలేని స్థితిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరోనా కేసులు నమోదు గురించి సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అధికారికంగా ఆంధ్రప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ, భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ లేదా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గాని ఎలాంటి ప్రకటన చేయలేదు. విజన్ కలిగిన ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిముందు జాగ్రత్త చర్యగా సోషల్ డిస్టెన్స్ పాటించే విధంగా లాక్‌డౌన్ ప్రకటించకుండా మహిళల ఉచిత బస్సు సౌకర్య ప్రయాణాన్ని రద్దు చేయాలి. ముఖ్యంగా కూరగాయలు చిరు వ్యాపారస్తులు స్నానపానాలు లేకుండా బస్సులు ఎక్కి మిగతా ప్రయాణికుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ ఉన్నారు.ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు లేకుండా చేస్తే అంత రద్దీ ఉండదేమో ప్రభుత్వం ఆలోచించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పెరుగుతున్న పర్యావరణ సమస్యలు

వైశాల్యంలో దేశంలోనే కీలక నగరంగా ఉన్న విశాఖపట్నం నేడు తీవ్రమైన పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోంది అని పలునివేదికలు తెలియచేస్తున్నాయి.ఇప్పటికే ఉన్న కాలుష్యానికితోడు, ప్రైవేట్‌రంగంలోని పోర్టు ను ండి వెలువడుతున్న కాలుష్యం గాజువాక, మల్కాపురం తదితరప్రాంతాలను పూర్తిగా కమ్మేయడం వలన ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు.విలీన ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సదుపాయాలు,వీధిలైట్లు,డ్రైనేజీవ్యవస్థ నేటికీఅధ్వాన్నంగా ఉన్నాయి.

-సి. రాజేందర్ , విశాఖపట్నం

# ఉపాధ్యాయుడే భవిష్యత్ మార్గదర్శి

తరిగోపుల నారాయణస్వామి

విద్య అనేది ఏ రాష్ట్రానికైనా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి పునాది. ఆ పునాదిని నిర్మించే ప్రధాన శిల్పి ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు ప్రశాంతంగా, ఆత్మ విశ్వాసంతో, వృత్తిపరమైన గౌరవంతో పనిచేసినప్పుడే విద్యార్థి అభ్యసన ఫలితాలు మెరుగుపడతాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో నేడు అనేక మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుఎదుర్కొంటున్న పరిస్థితులను పరిశీలిస్తే, బోధన కంటేబోధనకు ఆటంకాలు ఎక్కువగా కనిపిస్తున్నాయనే భావన కలుగుతుంది. ఈ పరిస్థితి కేవలం ఉపాధ్యాయుని వ్యక్తిగత సమస్య కాదు, అది విద్యార్థి భవిష్యత్తు, పాఠశాల వాతావరణం, సమాజ అభివృద్ధితో ముడిపడి ఉన్న అంశం. ఒక ఉపాధ్యాయుని ప్రధాన బాధ్యత తరగతిగదిలో విద్యార్థులను బోధించడం. కానీ వాస్తవ పరిస్థితుల్లో బోధనేతర కార్యక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే అభిప్రాయం ఉపాధ్యాయుల్లో విస్తృతంగా వినిపిస్తోంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, నివేదికలు, డేటా నమోదు, ప్రత్యేక కార్యక్రమాలు, పరిపాలనా పనులు వంటి బాధ్యతలుబోధన సమయాన్నే ప్రభావితం చేస్తున్నాయని పలువురు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. తరగతి గదిలో గడపాల్సిన సమయం కార్యాలయ సంబంధిత పనుల్లో గడిస్తే, విద్యార్థుల అభ్యసన నాణ్యతపై దాని ప్రభావం సహజంగానే ఉంటుంది.విద్యార్థి ముందు నిలబడే ఉపాధ్యాయుడు కేవలం పాఠ్య పుస్తకాన్ని బోధించే వ్యక్తి కాదు. ఆయన ఆలోచింపజేసే మార్గదర్శి. విలువలను నాటే వ్యక్తిత్వ నిర్మాత. అలాంటి బాధ్యతలను నిర్వర్తించాలంటే ఉపాధ్యాయునికి మానసిక ప్రశాంతత అత్యవసరం. అయితే నిరంతర పరిపాలనా ఒత్తిళ్లు, తరచూ మారే ఆదేశాలు, అదనపు బాధ్యతలు, అనిశ్చితి వంటి అంశాలు బోధనపై ప్రభావం చూపే అవకాశాన్ని విస్మరించలేం. ఇటీవలి కాలంలో యాభై సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయుల్లో కూడా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించిన ఆందోళనలు కనిపిస్తున్నాయి. అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు మళ్లీ పరీక్షలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి మానసిక ఒత్తిడిని పెంచుతుందని వారు భావిస్తున్నారు.జీవిత అనుభవం, బోధనా అనుభవం, కుటుంబ బాధ్యతలు, ఆరోగ్య సమస్యలు,వయస్సు వంటి అంశాల మధ్య పరీక్షలకు సిద్ధమవడం సులభం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైనవిద్య లక్ష్యం ఎంత ముఖ్యమో, ఆలక్ష్యాన్ని అమలు చేసే విధానం లో మానవీయ కోణం కూడా అంతేముఖ్యమనే చర్చ అవస రం. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత ఉపాధ్యాయుల్లో కేటాయింపులపై ఏర్పడిన అనిశ్చితి కూడా చాలామందిలో ఆందోళనకు కారణమైంది. ఏ జిల్లాలో సేవలు కొనసాగు తాయో తెలియని పరిస్థితి కుటుంబ జీవితం, పిల్లల చదు వులు, వృద్ధుల సంరక్షణ వంటి అనేక అంశాలను ప్రభావి తం చేస్తుంది. ఉపాధ్యాయుడు పాఠశాలలో చిరునవ్వుతో కనిపించినా, మనసులో అనిశ్చితి ఉంటే అది బోధనలో ప్రతిఫలించే అవకాశం ఉంటుంది. ఆర్థిక అంశాలు కూడా ఉపాధ్యాయుల మనోధైర్యంపై ప్రభావం చూపుతాయి. పెండింగ్ డీఏలు, వేతన సవరణ ఆలస్యం, ఇతర ఆర్థిక అంశాలపై ఉపాధ్యాయ సంఘాలు తరచూ తమ ఆందోళ నలను వ్యక్తం చేస్తున్నాయి. ఆర్థిక భద్రత ఉద్యోగ సంతృ ప్తికి ఒక ముఖ్యమైన ఆధారం. కుటుంబ అవసరాలు,పిల్లల ఉన్నత విద్య, వైద్య ఖర్చులు, ద్రవ్యోల్బణం వంటి పరిస్థి తుల్లో ఆర్థిక అనిశ్చితి ఉద్యోగి మానసిక ప్రశాంతతను ప్రభావితం చేయవచ్చు. ఆర్జిత సెలవులు మంజూరులో ఆలస్యం లేదా పరిమితులపై కూడా ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విశ్రాంతి అనేది విలా సం కాదు, అది వృత్తి సామర్థ్యాన్ని నిలబెట్టే అవసరం. శారీరకంగా, మానసికంగా పునరుత్తేజం పొందిన ఉపా ధ్యాయుడే తరగతి గదిలో ఉత్సాహంగా బోధించగలడు. ఆదివారాలు, పండుగ సెలవులు, ఇతర విశ్రాంతి రోజుల్లో కూడా అధికారిక కార్యక్రమాలకు హాజరు కావాల్సి వస్తోం దని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. కుటుంబం తో గడపాల్సిన సమయం తగ్గిపోతే కుటుంబ బంధాలపై ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయుడు కూడా ఒక కుటుంబ సభ్యుడే. ఆయనకు కూడా వ్యక్తిగత జీవితం ఉంటుంది. వృత్తి, కుటుంబం మధ్య సమతుల్యత కోల్పోతే ఉద్యోగంపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంది. పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరమే. కానీ అదే సమయంలో మిగతా తరగతుల విద్యార్థుల అభ్యసన కూడా సమానంగా ముఖ్యమే. ప్రారంభ తరగతులలో బలమైన పునాది ఏర్పడకపోతే పదో తరగతిలో మంచి ఫలితాలు ఆశించడం కష్టమే. కాబట్టి విద్యా విధానం మొత్తం పాఠశాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకోవాలి. ఒకే తరగతిపై అధిక దృష్టి కేంద్రీ కరిస్తే మిగతా తరగతుల అభ్యసనలో ఖాళీలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. విద్య అనేది పరీక్షల కోసం మాత్రమే కాదు. జీవితాన్ని నిర్మించడానికి. పరీక్షలు అవసరమే కానీ పరీక్షలే విద్యకు కేంద్రబిందువుగా మారకూడదు. విద్యార్థిలో ప్రశ్నించే స్వభావం, సృజనాత్మకత, సహకార భావం, విలు వలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడమే అసలు విద్య లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలలపై సమాజం నమ్మకం పెరగాలంటే మొదట ఉపాధ్యాయుడిపై వ్యవస్థ నమ్మకం చూపాలి. ప్రతిసమస్యకు ఉపాధ్యాయుడినే బాధ్యు డిగా చూడకుండా, ఆయనకు అవసరమైన వనరులు, సమయం, శిక్షణ,మానసిక భరోసా, పరిపాలనా సహకారం అందించడం మరింత ప్రయోజనకరం. ఉపాధ్యాయుడు భాగస్వామి, కేవలం ఆదేశాలు అమలు చేసే ఉద్యోగి మాత్రమే కాదు. విద్యా విధానాల రూపకల్పనలో తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుల అనుభవాలను కూడా వినాలి. పాఠశాల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకుంటే అమలు సులభమవుతుంది. పైస్థాయిలోరూపొందిన విధానాలు నేలస్థాయిలో ఎలాపని చేస్తున్నాయో నిరం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఢిల్లీ పోలీసు లాఠీచార్జికి నిరసనగా నేడు జిల్లావ్యాప్తంగా న్యాయవాదుల విధుల బహిష్కరణ

గుంటూరు లీగల్, జులై 23 ప్రభాతవార్త: ఢిల్లీలో నీట్ పేపర్ లీక్ పై శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్ ని గుంటూరు జిల్లా బార్ అసోసియేషన్ల ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది. పోలీసు చర్యలకు నిరసనగా శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా న్యాయవాదులు తమ విధులు బహిష్కరించాలని ఫెడరేషన్ తీర్మానించిందని ఛైర్మన్ మధిర నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నారదాసు వీరమమణి వెల్లడించారు.

# చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకానికి మంత్రివర్గ ఆమోదం

## టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు

తాడేపల్లి, జూలై 23, ప్రభాతవార్త చేనేత కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.25,000 అందించే నేతన్న సేవ ..పథకానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు పేర్కొన్నారు.చేనేత కార్మికుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలో ఈ పథకం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు. చేనేత వృత్తిని పరిరక్షిస్తూ, నేతన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్, ఈ పథకం అమలుకు ప్రత్యేక కృషి చేసిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్, రాష్ట్ర చేనేత జౌళి శాఖ మాత్యులు సవితమ్మ కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళల భద్రతే ధ్యేయంగా ప్రత్యేక డ్రైవ్

గుంటూరు క్రైమ్,జులై23,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గురువారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక ఈవ్‌టీజింగ్ నిరోధక డ్రైవ్ నిర్వహించబడింది. కొత్తపేట సిఐ యమ్. వీరయ్య ఆధ్వర్యంలో పోలీసు




సిబ్బంది కలిసి కళాశాలల పరిసరాలు,ఉమెన్స్ కాలేజీ రోడ్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి,అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను తనిఖీ చేశారు.అదేవిధంగా,మైనర్లు వాహనాలు నడపడం,ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడుతున్న వాహనదారులను గుర్తించి వారిని ఆపి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు.మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు,రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.మహిళలు,విద్యార్థినులు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు. మహిళల భద్రతకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట పోలీసులు హెచ్చరించారు.

# కేఎల్‌యులో ఘనంగా ఏసీఐసీకేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్ 26

## స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ కింద 8 వినూత్న స్టార్టప్లకు రు. 1.12 కోట్ల నిధులు..

తాడేపల్లి, జులై 23, ప్రభాతవార్త.కెఎల్ యూనివర్శిటీలో ఆవిష్కరణలు, వ్యాపారోద్యమం మరియు సాంకేతిక ఆధారిత సంస్థల పెంపకం పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ ఆధ్వర్యంలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్ మద్దతుతో పనిచేస్తున్న ఏసీఐసీకేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ అద్వర్యంలో వర్సిటీలోని జాస్మిన్ హాల్లో "ఫ్యూచర్ ఫోర్జ్ స్టార్టప్ మహోత్సవ్‌ఖ26 – ఎపిసోడ్ 4"ను ఘనంగా నిర్వహించారు. ఆవిష్కర్తలు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, పెట్టుబడిదారులు, మార్గదర్శకులు, పరిశ్రమ నాయకులు మరియు విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఆవిష్కరణ మరియు వ్యాపారోద్యమ శ్రేష్ఠతను జరుపుకోవడం ద్వారా భారతదేశ స్టార్టప్ వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందని కెఎల్ స్టార్టప్ సిఇఒ డాక్టర్ వి.రమణ్ కాంత్ అన్నారు. ఈ సందర్భంగా వారు స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ నిధుల పంపిణీ చేశారు. ఎనిమిది వినూత్న స్టార్టప్లకు రు.1.12 కోట్ల సీడ్ నిధులను పంపిణీ చేశారు, తద్వారా అవి ఉత్పత్తి అభివృద్ధి, సాంకేతిక ధృవీకరణ, వాణిజ్యీకరణ మరియు మార్కెట్



విస్తరణను వేగవంతం చేసుకోగలుగుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కెఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థ సారథి వర్మ, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రో ఛాన్సలర్ డాక్టర్ జగన్నాథ రావు, కెఎల్ ఇంక్యుబేషన్ సలహాదారు రవి ఈశ్వరపు, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డైరెక్టర్ డాక్టర్ కె. నరసింహా రాజు, ఏసీఐసీ కెఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. రమణ్ కాంత్, స్టార్టప్ వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, మార్గదర్శకులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సందర్భంగా వర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థ సారథి వర్మ మాట్లాడుతూ ఉన్నత విద్య, జాతీయ అభివృద్ధిలో ఆవిష్కరణ, వ్యాపారోద్యమం అంతర్భాగంగా మారాయని అన్నారు. వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరిస్తూ అర్థవంతమైన సామాజిక, ఆర్థిక ప్రభావాన్ని సృష్టించే విస్తరణ యోగ్యమైన, సాంకేతిక ఆధారిత, స్థిరమైన పరిష్కారాలను అభివృద్ధి చేయాలని ఆయన స్టార్టప్లను ప్రోత్సహించారు. ప్రపంచస్థాయి ఇంక్యుబేషన్, మార్గదర్శకత్వం, పరిశ్రమ సహకారం మరియు నిధుల మద్దతు ద్వారా యువ వ్యాపారవేత్తలను ప్రపంచస్థాయి పోటీతత్వం కలిగిన సంస్థలను నిర్మించేలా శక్తివంతం చేస్తున్న ఏసీఐసీకేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ కృషిని ఆయన అభినందించారు. ఏసీఐసీకేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. రమణ్ కాంత్ మాట్లాడుతూ అధిక సామర్థ్యం కలిగిన స్టార్టప్లను గుర్తించడం, పెంపొందించడం మరియు మద్దతు ఇవ్వడం పట్ల ఫౌండేషన్ నిబద్ధతను పునరుద్ఘాటించారు. వ్యూహాత్మక మార్గదర్శకత్వం, పెట్టుబడిదారుల అనుసంధానం మరియు పరిశ్రమ భాగస్వామ్యాలను సాంకేతిక వాణిజ్యీకరణ మరియు ప్రభుత్వ నిధుల కార్యక్రమాలతో మిళితం చేసే ఫౌండేషన్ యొక్క నిర్మాణాత్మక ఇంక్యుబేషన్ విధానాన్ని ఆయన వివరించారు.

**సీడ్ నిధులను పొందిన ఎనిమిది వినూత్న స్టార్టప్లు ...**

అవే టాక్స్ నర్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే వివిధ డిజిటల్ వేదికల్లో వినూత్న కంటెంట్ ద్వారా లీనమయ్యే, సంస్కృతి ఆధారిత కథన అనుభవాలను సృష్టించే మీడియా అండ్ ఎంటర్టైన్మెంట్ స్టార్టప్, బంక్స్ బడ్డీ కనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే తెలివైన మార్గ అనుకూలీకరణ, రియల్‌టైమ్ ఇంధన ధర పోలిక మరియు టోల్ ఖర్చుల నిర్వహణ పరిష్కారాలను అందించే మొబిలిటీ టెక్నాలజీ స్టార్టప్, మైత్రి మెడ్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే నిరంతర ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడానికి ధరించదగిన ఆరోగ్య పరికరాలు మరియు రిమోట్ పేషెంట్ మానిటరింగ్ పరిష్కారాలను అభివృద్ధి చేసే ఎఐఆధారిత డిజిటల్ హెల్త్ స్టార్టప్, హెల్త్ ఫ్లో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే క్లెయిమ్‌లు, రీయింబర్స్‌మెంట్లు మరియు మెడికల్ బిల్లింగ్ ఆటోమేషన్ ద్వారా నగదు రహిత ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తెస్తూ ఆసుపత్రి ఆర్థిక ప్రక్రియలను సరళీకృతం చేసే హెల్త్‌టెక్ ఇన్‌ఫ్రా స్టార్టప్, డేటా ఐక్యూ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ముడి డేటాను దత్తాంశ అంతర్దృష్టులుగా మార్చే బిజినెస్ ఇంటెలిజెన్స్ పరిష్కారాలను అందించే ఎఐ మరియు డేటా అనలిటిక్స్ స్టార్టప్, క్వాడ్ థాట్ ఐటి సొల్యూషన్స్ ఎల్ ఎల్ పి అనే ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల కోసం సామర్థ్యఆధారిత అభ్యాసం, మార్గదర్శకత్వం మరియు ధృవీకరణను కలిగిన ఎఐఆధారిత వర్చువల్ లెర్నింగ్ వ్యవస్థను నిర్మిస్తున్న ఎడ్‌టెక్ స్టార్టప్ లతో పలు స్టార్టప్ లకు స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్ కింద ఆర్థిక సహాయం అందజేశారు. ఇది ఆవిష్కర్తలను వేగవంతం చేయడానికి, తమ ఉత్పత్తులను వాణిజ్యీకరించడానికి మరియు తమ సంస్థలను విస్తరించడానికి వారికి తోడ్పడుతుంది. విద్యాసంస్థలు, పరిశ్రమ, పెట్టుబడిదారులు, మార్గదర్శకులు మరియు ప్రభుత్వ సంస్థలతో స్టార్టప్లను అనుసంధానం చేయడం ద్వారా ఒక శక్తివంతమైన ఆవిష్కరణ వ్యవస్థను నిర్మించాలన్న ఏసీఐసీకేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ కార్యక్రమం ఉన్నత స్థాయిలో ముగిసింది. భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ ఆధ్వర్యంలోని అటల్ ఇన్నోవేషన్ మిషన్ మద్దతుతో పనిచేస్తున్న ఏసీఐసీకేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్, ఆవిష్కరణ, వ్యాపారోద్యమం మరియు స్టార్టప్ శ్రేష్ఠతను పెంపొందించడంలో నిబద్ధత కలిగిన ఒక ప్రముఖ సాంకేతిక వ్యాపార ఇంక్యుబేటర్. మార్గదర్శకత్వం, సీడ్ నిధుల సదుపాయం, సామర్థ్య నిర్మాణం, సాంకేతిక వాణిజ్యీకరణ మరియు భాగస్వామ్యాలు, పెట్టుబడిదారుల అనుసంధానం మరియు వ్యవస్థ అభివృద్ధి ద్వారా ఫౌండేషన్ సమగ్ర ఇంక్యుబేషన్ మద్దతును అందిస్తుంది. వివిధ రంగాలలో ఆవిష్కర్తలు మరియు

# గుంటూరు వార్త

# మెదడు ఆరోగ్యంపై విస్తృత అవగాహన అవసరం

## మెదడు ఆరోగ్యం లక్ష్యంతో న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజా చర్చా వేదిక

## ప్రపంచ స్ట్రోక్ సంస్థ బోర్డు సభ్యురాలిగా ఎన్నికైన డా. పి. విజయకు ఘన సన్మానం

గుంటూరు మెడికల్ జూలై 23: (ప్రభాతవార్త): ప్రపంచ మెదడు దినోత్సవం2026 సందర్భంగా అందరికీ మెదడు ఆరోగ్యంఅనే అంశంపై న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ గుంటూరు ఆధ్వర్యంలో గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ప్రజా చర్చా వేదిక నిర్వహించారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు పాల్గొని మెదడు ఆరోగ్యం, నాడీ సంబంధిత వ్యాధుల నివారణ, ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు.న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డా. పి. విజయ మాట్లాడుతూ గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, ప్రజా ఆరోగ్య వేదిక సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలు ఎంతో ప్రశంసనీయమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించాలని ఆకాంక్షించారు.ఇటీవల డా. పి. విజయ ప్రపంచ స్ట్రోక్ సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా ఎన్నికైన సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వివిధ ప్రజారోగ్య సంఘాల ప్రతినిధులు, నాయకులు ఆమెను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.డా. పి. విజయ మాట్లాడుతూ




పుట్టిన శిశువుల నుంచి వృద్ధుల వరకు ఏ వయస్సులోనైనా మెదడు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ధూమపానం, మద్యపానం, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, అధిక కొలెస్ట్రాల్, వాయు కాలుష్యం వంటి కారణాలు మెదడు వ్యాధులకు ప్రధాన ప్రమాద కారకాలని వివరించారు. సీనియర్ న్యూరాలజిస్టు డా. రామ తారకనాథ్ మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం చేయడం, మానసికంగా చురుకుగా ఉండడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సీనియర్ న్యూరాలజిస్టు డా. కుమారవేలు మాట్లాడుతూ తగినంత నిద్ర మెదడు ఆరోగ్యానికి అత్యంత అవసరమని, గురక సమస్యను నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి డా. శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ మెదడు దినోత్సవ సందేశం అందరికీ మెదడు ఆరోగ్యం ప్రాధాన్యాన్ని వివరించారు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, సరైన అవగాహనతో మెదడు వ్యాధులను నివారించవచ్చన్నారు. పక్షవాతం వచ్చిన వెంటనే నాలుగున్నర గంటలలోపు చికిత్స అందే ఆసుపత్రికి చేరుకుంటే ప్రాణాలతో పాటు వైకల్యాన్ని కూడా నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. సీనియర్ న్యూరాలజిస్టు డా. యు. వీరమ్మ మాట్లాడుతూ తలనొప్పిని నిర్లక్ష్యం చేయరాదని, ముఖ్యంగా వాంతులు, చూపు మసకబారడం, తూలుడు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మైగ్రేన్‌కు సరైన చికిత్సతో మంచి ఉపశమనం పొందవచ్చన్నారు. డా. నవీన్ మాట్లాడుతూ గుండె ఆరోగ్యంతో పాటు మెదడు ఆరోగ్యంపైనా సమాన శ్రద్ధ అవసరమని, నాడీ సంబంధిత లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.న్యూరాలజిస్టు డా. మీనా మాట్లాడుతూ మెదడు వ్యాధులకు సంబంధించిన అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యుల సలహా లేకుండా మందులు వాడకూడదని, వణుకు, మతిమరుపు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.న్యూరోసర్జన్ డా. హేమంత్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలు కాకుండా ఉండేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా రక్షణ శిరస్త్రాణం (హెల్మెట్) ధరించాలని సూచించారు. మెదడు కణితులు, తలకు గాయాల చికిత్సలో ఆధునిక న్యూరో శస్త్రచికిత్సల ప్రాధాన్యాన్ని వివరించారు.అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మెదడు వ్యాధులను ముందుగానే గుర్తించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడం, సమయానికి చికిత్స పొందడం ద్వారా నాడీ సంబంధిత వ్యాధుల భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని వైద్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఎల్.ఎస్. భారవి, జి. శ్రీనివాసరావు, మల్లికార్జున్, మురళి సమన్వయంతో నిర్వహించారు.

# గుంటూరు నగరంలో రాజధానికి తగ్గట్టుగా అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలి

## నగర కమిషనర్ కే. మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జులై 23 ( ప్రభాత వార్త ) : గుంటూరు నగర పాలక సంస్థ రాజధాని పరిధిలో ఉన్నందున, రాజధానికి తగ్గట్టుగా అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని, అందుకు అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకోవాలని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరం రాజధాని పరిధిలో ఉన్నదని, గుంటూరు నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు నిర్వహించడానికి అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. సదరు అభివృద్ధి పనులు వేగవంతంగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఇంజనీరింగ్



అధికారులను ఆదేశించారు. ఏ.ఈ లు వారి పరిధిలో త్రాగునీటి సరఫరా పై దృష్టి సారించాలని, ఎక్కడా కలుషిత నీరు సరఫరా జరగకుండా వారి పరిధిలోని ఈ.యల్.యస్.ఆర్ లలో, గృహాల వద్ద నీటి శాంపిల్స్ విధిగా నూరు శాతం సేకరించాలని ఆదేశించారు. ఈ.యల్.యస్.ఆర్ లను నిర్దేశిత సమయానికి శుభ్రం చేయించాలని, అందుకు ప్రత్యేకంగా రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. ఎవరైనా ఏఈలు విధుల యందు నిర్లక్ష్యం వహించినట్లైతే వారి పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాటర్ మీటర్ రీడింగ్ తప్పకుండా తీయాలని, అవసరమైన ప్రాంతాలలో నూతన మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఏఈ లను ఆదేశించారు. అలాగే నగరంలో ఉన్న పాట్ హుల్స్ కు రానున్న 10 రోజుల్లో మరమ్మతులు నిర్వహించాలని, ప్రధాన కాలువల్లో రెండవ విడత పూడికతీత పనులను చేపట్టాలని ఏఈ లను ఆదేశించారు. నగరంలోని పార్కులు, బరియల్ గ్రౌండ్స్ మరియు జంక్షన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, కన్సల్టెంట్ల ద్వారా అంచనాలు సిద్దం చేయించామని, వారితో కో ఆర్డినేషన్ చేసుకొని పనులు చేపట్టాలని ఆదేశించారు. నగరంలో 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని, అందుకు అవసరమైన టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నగరంలో నూరు శాతం స్ట్రీట్ లైటింగ్ వెలగాలని, అవసరమైన ప్రాంతాలలో నూతన లైట్లు ఏర్పాటు చేయాలని, స్ట్రీట్ లైటింగ్ పై ఎటువంటి పిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో యస్.ఈ (ఇంచార్జ్) సుందర్రామి రెడ్డి, ఈ ఈ లు విష్ణు మూర్తి, వేణుగోపాల్, డి.ఈ.ఈ లు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్తలను శక్తివంతం చేయడం ద్వారా, ఏసీఐసీకేఎల్ స్టార్టప్స్ ఫౌండేషన్ వినూత్న ఆలోచనలను స్థిరమైన, విస్తరణ యోగ్యమైన మరియు ప్రపంచస్థాయి పోటీతత్వం కలిగిన సంస్థలుగా మార్చడం కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో ఛాన్సలర్ డాక్టర్ జగన్నాథ రావు, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కెఐ.పవన్ కుమార్, విద్యార్ధి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, కెఎల్ ఎసిఐసి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.రమణ్ కాంత్, డాక్టర్ నరసింహ రాజు, మేనేజర్ కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో జీస్టాట్ బెంచ్ ప్రారంభం

## ఉన్నతాధికారులు, ప్రముఖుల సమక్షంలో బెంచ్ ను ప్రారంభించిన

## న్యాయమూర్తి భాస్కరరెడ్డి వేమిరెడ్డి ... ప్రారంభోత్సవం రోజునే అప్పీళ్ళ విచారణ

గుంటూరు లీగల్, జులై 23 ప్రభాతవార్త: జీఎస్టీ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా, అప్పీళ్ల ను విచారించడానికి కేంద్ర ప్రభుత్వం గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ( జీస్టాట్ ) ను ఏర్పాటు చేసిందని జీస్టాట్ ఆంధ్రప్రదేశ్ న్యాయవిభాగం ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి వేమిరెడ్డి తెలిపారు. గురువారం మంగళగిరిలో పలువురు ఉన్నతాధికారులు, ప్రముఖుల సమక్షంలో ఆయన ఆంధ్రప్రదేశ్ జీస్టాట్ బెంచ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డి వేమిరెడ్డి మాట్లాడుతూ, జీస్టాట్ అనేది వస్తువులు, సేవల పన్ను చట్టాల క్రింద స్థాపించబడిన ఒక చట్టబద్ధమైన అప్పిలేట్ సంస్థ అని వివరించారు. భారతదేశ జీఎస్టీ ప్రయాణంలో జీస్టాట్ ఒక ముఖ్యమైన మైలురాయిగా పేర్కొన్నారు. జీఎస్టీ వివాద పరిష్కార యంత్రాంగాన్ని బలోపేతం చేసే దిశగా జరిగిన ఈ కీలక పరిణామంలో ప్రారంభోత్సవ రోజునే అప్పీళ్ళ విచారణలు కూడా మొదలయ్యాయి. జీఎస్టీ అప్పీళ్ళ పరిష్కారంలో ఏకరూపత, సమర్థతను పాటిస్తూనే, పన్ను చెల్లింపుదారులకు వేగవంతమైన,



పారదర్శకమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడంలో ట్రిబ్యునల్ నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. అప్పిలేట్ యంత్రాంగాన్ని పూర్తిగా కార్యరూపంలోకి తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాల సమిష్టి కృషిని భాస్కరరెడ్డి ప్రశంసించారు. జీస్టాట్ డిప్యూటీ రిజిస్ట్రార్ వీ ఎస్ కే రాయలు మాట్లాడుతూ, ఈ బెంచ్ ఏర్పాటు వల్ల జీఎస్టీ అప్పీళ్ళ కు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని, ఆంధ్రప్రదేశ్ అంతటా పన్ను చెల్లింపుదారులకు న్యాయం సులభంగా అందుబాటులోకి వస్తుందని, న్యాయపరమైన వివాదాలు తగ్గుతాయని, జీఎస్టీ విధానం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీస్టాట్ సాంకేతిక విభాగం సభ్యులు సతీష్ కుమార్ అగర్వాల్, స్టేట్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ ఎ. బాబు, ప్రత్యేక కమిషనర్ నూతలపాటి సౌమ్య, జీఎస్టీ అప్పీల్స్ కమిషనర్ దేవేష్ గుప్తా, కస్టమ్స్ కమిషనర్ ఆర్. కె. రామన్, సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ అరుణ్ రిచర్డ్, కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, జీఎస్టీ అదనపు కమిషనర్ జీ. రామకృష్ణ రాజు యాదవ్, కోర్టు ఆఫీసర్లు వినయ్ కృష్ణ దాసి, సి. హెచ్ ప్రత్యూష అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఎ. పి, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ట్యాక్స్ బార్ సభ్యులు, పలువురు పన్ను నిపుణులు పాల్గొన్నారు.

# 25న గ్రీన్ గుంటూరు, అమృత్ 2.0 పైలాన్ ఆవిష్కరణ

## నగర కమిషనర్ కె.మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, జులై 23 ( ప్రభాత వార్త ) : ఈనెల 25న జరిగే గ్రీన్ గుంటూరు, అమృత్ 2.0 పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాల విజయవంతానికి అధికారులు కృషి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం గ్రీన్ గుంటూరు కార్యక్రమం జరిగే శిల్పారామం, అమృత్ 2.0 పైలాన్ ఆవిష్కరణ జరిగే ప్రాంతాలను కమిషనర్ పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత శిల్పారామం, సమ్మర్ పేట చెరువు పరిసర ప్రాంతాలను



పరిశీలించారు. గ్రీన్ గుంటూరులో భాగంగా 18 వేల మొక్కలను గుంటూరు నగరంలో నాటే లక్ష్యంతో శనివారం గ్రీన్ గుంటూరు కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. అలాగే అమృత్ 2.0లో శివారు ప్రాంతాలకు త్రాగునీటిని అందించే ప్రాజెక్ట్ పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమం అమరావతి రోడ్ గోరంట్ల సెంటర్ లో జరుగుతుందని తెలిపారు. సదరు కార్యక్రమాలకు సంబంధించిన ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజారోగ్య అధికారులను, రోడ్, డ్రైన్ ఆక్రమణలు, అనధికార హోర్డింగ్స్, బోర్డ్ లను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను, రోడ్ల మరమత్తులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో అదనపు కమిషనర్ ఐ.కిషోర్, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్, డిఈఈ శ్రీనివాస్, ఏడీహెచ్ శాంతి, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజ్ కి కేంద్ర మంత్రే బాధ్యత వహించాలి

గుంటూరు, జూలై 23, ప్రభాతవార్త : నీట్ పరీక్షా పత్రాల లీకేజీల వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, మాన్యశ్రీ ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ సంఘటనపై గురువారం గుంటూరు లాడ్జి సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య మాదిగ పాల్గొని మాట్లాడుతూ..ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు జరపాలనుకుంటే నిరసన జరుగుతున్న జంతర్ మంతర్ వద్దకే రావాలని స్పష్టం చేశారు. ఈ విషయమై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కొనసాగుతుందని తెలిపారు.ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు. నీట్ పరీక్ష పేపర్ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లిబఠానీల మారిపోయిందని వ్యాఖ్యానించారు. కేంద్ర విద్యా విధానాలకు వ్యతిరేకంగా తమ




ఆందోళన కొనసాగుతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును పోలీసులు హరించారని ఘాటుగా విమర్శించారు. దశాబ్దాల కాలంలో దేశవ్యాప్తంగా జరిగిన అతి పెద్ద విద్యార్థి ప్రొటెస్ట్ ఇదేనన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ తో దేశవ్యాప్తంగా 26 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అయినా కానీ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చే రాజీనామా చేయించకపోవడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెళ్ళు వెత్తుతున్నాయి. గతంలో దేవేంద్ర ప్రధాన్ పెట్రోలియం శాఖ మంత్రిగా పని చేసినప్పుడు ఆ శాఖలోని అత్యంత కీలక సమాచారాన్ని ప్రైవేటు కంపెనీలకు లీక్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర ఉక్కు శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు విశాఖ ఉక్కులో 100 ప్రభుత్వం వాటాన్ని ఉపసంహరించి కేంద్ర క్యాబినెట్ తో ఆమోదింప చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా నీట్ పరీక్ష పేపరు లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. ఇతను ఏ శాఖ నిర్వహించిన విమర్శలే ఉన్నాయని, అలాంటప్పుడు పదవి నుండి ఎందుకు తప్పించటం లేదని ప్రశ్నించారు. ఈ సమయంలో సోనమ్ వాంగ్‌చుక్ సేవలు దేశానికి ఎంతో అవసరమని ఆయన ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం గురుగ్రామ్‌లోని వేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్ దీక్ష గురువారం నాటికి 26వ రోజుకు చేరుకుందన్నారు. కేంద్ర మంత్రులతో చర్చల విషయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవైపు చర్చలకు పిలుస్తూనే మరోవైపు పోలీసులతో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి వేటుకూరు విజయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మా ప్రధాన డిమాండ్ అన్నారు. దానిపై చర్చలు లేవు వ్యవస్థలో పైనుంచి కింది వరకు అసమర్థులు, అవినీతిపరులు తిష్ట వేయడం వల్లే నీట్ పరీక్ష పేపర్ లీకులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరి పైన ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నారని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఈ సమస్యకు పరిష్కారం లభించదని విమర్శించారు. కార్యక్రమంలో రావూరి రాజు మాదిగ, కిన్నెర నాగరాజు మాదిగ, బెనర్జు, మాచర్ల దేవిడ్, కారసాల వీరబాబు,చిలుకూరి నాగరాజు, రాజుపాలెం కోటేశ్వరరావు, చంద్ర నాయక్, దేవరకొండ బాబురావు, వలేటి భూషణం, ఇజ్రాయిల్, కస్తుర్తి నవీన్, ఫణి ధర్, కొల్లిపర అరుణ్, ఎమ్మార్పీఎస్ మహిళ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## "ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్" యాప్లో నమోదు చేసుకోండి



చిలకలూరిపేట, జూలై 23, ప్రభాతవార్త: రవాణా కమిషనర్ ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు మరియు యూని ఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్ ఫేస్ ప్లాట్ఫాం సంయుక్త ఆధ్వర్యంలో రూపొందిస్తున్న "ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్" మొబైల్ యాప్ ద్వారా రాష్ట్రంలోని లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు, ఫ్లీట్ ఓనర్లు మరియు ఇతర రవాణా సంస్థలను ఒకే డిజిటల్ లాజిస్టిక్స్ వేదిక పైకి తీసుకురావడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ వేదిక జాతీయ లాజిస్టిక్స్ వ్యవస్థతో అనుసంధానమై రవాణా రంగంలో పారదర్శకత, వేగం మరియు సౌలభ్యాన్ని పెంపొందించేందుకు రూపొందించబడిందన్నారు.

## జీవో నెం. 396 రద్దు, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల నిలిపివేతపై స్పష్టమైన హామీ వచ్చే వరకు పెన్‌డౌన్ కొనసాగింపు

చిలకలూరిపేట, జూలై 23, ప్రభాతవార్త: జీవో నెంబర్ 396 రద్దు చేయడంతో పాటు ప్రతిపాదిత రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ఏర్పాటును పూర్తిగా నిలిపివేస్తామని రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన లిఖితపూర్వక హామీ అందే వరకు తమ పెన్‌డౌన్ ఉద్యమాన్ని కొనసాగిస్తామని చిలకలూరిపేట దస్తావేజు లేఖరులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీవో 396 అమలుతో దస్తావేజు లేఖరులు, స్టాంప్ విక్రేతలు, డీటీపీ నిర్వాహకులు మరియు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వేలాది



కుటుంబాల ఉపాధికి తీవ్ర నష్టం కలిగే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిగణనలోకి తీసుకుని జీవో 396ను రద్దు చేయాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును పూర్తిగా విరమించుకోవాలని కోరారు. డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించి, ఉన్నతాధికారుల నుంచి అధికారిక హామీ వచ్చే వరకు తమ నిరసనను విరమించే ప్రసక్తే లేదని, పెన్‌డౌన్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని దస్తావేజు లేఖరులు హెచ్చరించారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి

చిలకలూరిపేట, జూలై 23, ప్రభాతవార్త: నీట్ ప్రశ్న పత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఎన్ ఎస్‌యూఐల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఆర్ టీ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి, లాఠీచార్జి చేయించడం,




భాష్పవాయువు ప్రయోగించడం అత్యంత హేయమైన చర్యని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన వారిని ప్రశ్నిస్తే, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. అధ్యక్షత వహించిన ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కె. మల్లికార్జున్ మాట్లాడుతూ లీకేజీ ఘటనలో సూత్రధారులను, బాధ్యులైన అధికారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, బాధితులైన విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా విద్యార్థులందరూ ఐక్యంగా ఉద్యమిస్తామని ప్రతిన బూనారు. కార్యక్రమంలో నాయకులు బొంత పృధ్వి, వెంకటేష్, అనిల్, ఎన్ ఎస్ యు వై నాయకులు భాష , స్వప్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న బీమా ... కార్యకర్తల కుటుంబాలకు గొప్ప ధీమా : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 23, ప్రభాతవార్త: తెలుగుదేశం సైనికుల సంక్షేమం..సంతోషానికి టీడీపీ అధినాయకత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, ప్రమాదవశాత్తూ మరణించిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడం.. కార్యకర్తల పిల్లల యోగక్షేమాలు, చదువుసంధ్యలు చూడటంలో పార్టీ ఎప్పుడూ ముందుంటుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. కార్యకర్తల సంక్షేమం కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన చంద్రన్నబీమా నిజంగా లక్షలాది టీడీపీ కుటుంబాలకు గొప్ప ధీమాగా



నిలుస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. రమేష్, రామారావు, శ్రీకాంత్ కుటుంబాలకు అండగా ఉంటాం...ఇటీవలి కాలంలో మూడు వేర్వేరు దుర్ఘటనల్లో ప్రమాదవశాత్తూ మరణించిన ముగ్గురు టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి స్థానిక క్యాంప్ కార్యాలయంలో ప్రమాద బీమా పరిహార చెక్కులు అందించారు. చిలకలూరిపేట రూరల్ మండలం కోమటినేనివారిపాలెం గ్రామానికి చెందిన వెంపరాల రమేష్, నాదెండ్ల మండలం ఎండుగుంపాలెం గ్రామ నాయకులు నెల్లూరి రామారావు, జంగాలపల్లి గ్రామానికి చెందిన మద్ది శ్రీకాంత్ ఇటీవల మరణించిన నేపథ్యంలో, ప్రత్తిపాటి గురువారం వారి కుటుంబసభ్యులతో మాట్లాడి, ఒక్కో కుటుంబానికి పార్టీ అందించిన రూ.5లక్షల విలువైన చెక్కులు అందించి, వారి కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నారు. పార్టీ పటిష్టత, గౌరవం కోసం పాటుపడిన రమేష్, రామారావు శ్రీకాంత్ ఆత్మకులకు శాంతి కలగాలని వారి కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని ప్రత్తిపాటి చెప్పారు. యువనేత లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందనే సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ... దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనంత కార్యకర్తల బలం టీడీపీకి ఉందని, వారే పార్టీ సైన్యమని. ప్రజలకు మంచి చేయడంలో వారు నిస్వార్థంగా తమసేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆటుపోట్ల కార్యకర్తల్ని ఆదుకోవాలన్న దృఢచిత్తంతో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రమాదబీమా సౌకర్యం కల్పించారన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక పార్టీకి యువరక్తం ఎక్కించే చర్యలు తీసుకొచ్చారని ప్రత్తిపాటి చెప్పారు. లోకేశ్ సారథ్యంలో పార్టీ ఇటీవలే కోటిసభ్యత్వాలు పూర్తిచేసుకుందని, కోటిమంది సైన్యాన్ని నడిపించడంలో, వారి సాధకబాధకాలు తెలుసుకోవడంలో యువనేత లోకేశ్ చురుగ్గా వ్యవహరిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. నాయకులు, కార్యకర్తలు ఆయనకు అండగా నిలుస్తున్న లోకేశ్ నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందని ప్రత్తిపాటి ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ ఆదిక స్వాములు, సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, టీడీపీ నాయకులు కొడె హనుమంతరావు, సొరెడ్డి, మద్దిబోయిన శివ, గంజి శ్రీనివాసరావు, గుర్రం నాగ పూర్ణచంద్రరావు, గ్రామ నాయకులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం

చిలకలూరిపేట, జూలై 23, ప్రభాతవార్త: చిలకలూరిపేట వేద పాఠశాలలో ఘనంగా జరిగిన జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం చిలకలూరిపేట స్థానిక వేద పాఠశాలలో జూలై 22 తేదీన బుధవారం జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు విద్యార్థులు పలు కార్యక్రమాల ద్వారా జాతీయ పతాకం విశిష్టతను గురించి జాతీయ జెండా యొక్క చరిత్ర గురించి తెలియజేశారు వైస్ ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ మన జాతీయ జెండా రంగుల ప్రాముఖ్యతను వివరించారు కాషాయం త్యాగానికి తెలుపు శాంతికి ఆకుపచ్చ సమయస్ఫూర్తి కాక మధ్యనున్న 24 ఆకుల నీలిరంగు అశోక చక్రం కూడా ఉండడం మన జెండా ప్రత్యేకత అని కొనియాడారు పాఠశాల డైరెక్టర్ శ్రీనిధి దేవిక్ స్నేహాల్ సి ఈ ఓ శామ్యూల్ రాజ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సత్య దీప్తి పిల్లల్ని మరియు ఉపాధ్యాయులను అభినందిస్తూ మన జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మన తెలుగు జాతికి గర్వ కారణం అని విద్యార్థులందరూ గొప్ప వాళ్ళని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రోత్సహించారు.

## చిలకలూరిపేట బైపాస్‌లో ఘోర ప్రమాదం: కారును ఈడ్చుకెళ్లిన కంటైనర్

చిలకలూరిపేట, జూలై 23, ప్రభాతవార్త: నూతన బైపాస్ తిమ్మాపురం నూతన పెట్రోల్ బంకు వద్ద చోటుచేసుకున్న ఓ ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. క్షణకాలం నిర్లక్ష్యం.. ఊహించని విషాదానికి దారితీసింది. ముందు వెళ్తున్న కంటైనర్‌ను కారు ఢీకొట్టడమే కాకుండా, డ్రైవర్ గమనించకపోవడంతో కారును కొంత దూరం అలాగే ఈడ్చుకెళ్లింది. గుంటూరుకు చెందిన ఉప్పుటూరి హర్ష (33) (తండ్రి: ఆంజనేయులు) తన కారులో గుంటూరు నుండి చిలకలూరిపేట మీదుగా మార్టూరు వైపు ప్రయాణిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం సమయం కావడంతో.. చిలకలూరిపేట కొత్త బైపాస్‌లో తిమ్మాపురం వద్ద ఉన్న నూతన పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే హర్షకు ఒక్కసారిగా నిద్రమత్తు ఆవహించింది. దీంతో అదుపుతప్పిన కారు, ముందు వెళ్తున్న భారీ కంటైనర్ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. గగుర్పొడిచే దృశ్యం.. కారు ఢీకొట్టిన శబ్దాన్ని కంటైనర్ డ్రైవర్ ఏమాత్రం గమనించలేదు. కారు ముందు భాగం కంటైనర్ వెనుక ఇరుక్కుపోవడంతో, అలాగే దాన్ని రోడ్డుపై ఈడ్చుకుంటూ ముందుకు వెళ్లిపోయాడు. రోడ్డు రాపిడికి కారు ముందు టైర్లు పూర్తిగా కాలిపోయి అరిగిపోగా.. ఇంజిన్ తో సహా కారు ముందు వైపు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. మధ్యాహ్నం పట్టపగలు జరగడంతో స్థానికులు వెంటనే ఈ భయానక దృశ్యాన్ని గమనించి అలర్ట్ అయ్యారు. తీవ్రగాయాలతో ఆసుపత్రికి తరలింపు ఈ భయంకరమైన ప్రమాదంలో డ్రైవింగ్ సీటులో ఉన్న ఉప్పుటూరి హర్షకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రధానంగా తల, గడ్డం భాగంలో బలమైన దెబ్బలు తగలగా.. పొత్తికడుపు ప్రాంతంలో ఎయిర్ బ్యాగ్ తెరుచుకున్నట్లు స్థానికులు తెలిపారు. పట్టపగలు కావడంతో వెంటనే స్పందించిన చుట్టుపక్కల వారు, ప్రమాదకర స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని అతి కష్టం మీద కారులోంచి బయటకు తీశారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా, ప్రాణాలు కాపాడేందుకు హుటా హుటిన మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

# పల్నాడు జిల్లా వార్త



## రూపెనగుంట్ల గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్

నకరికల్లు, జూలై 23 ప్రభాతవార్త : మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో గురువారం డి.ఎస్.పి ఎం హనుమంతరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి గ్రామంలోని ఇంటింటిలో సోదాలు నిర్వహించారు. వాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం హనుమంతరావు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు ప్రశాంత



వాతావరణంలో జీవనం కొనసాగించాలన్నారు. ఎటువంటి అల్లర్లకు, ఘర్షణలకు తావు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో, పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సంగీత విభావరి కరపత్రముల విడుద.

నరసరావుపేట టౌన్,జూలై 23 ప్రభాతవార్త : నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు గురువారం సంగీత విభావరి కరపత్రములను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు నరసరావుపేట పట్టణంలో శ్రీ పట్టాభిరామ స్వామి వారి దేవస్థానములోని కళ్యాణ్ మండపం నందు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలనాటి మధుర సినీ సంగీత విభావరి, ఘంటసాల, బాలు సంగీత విభావరి కార్యక్రమానికి సంబంధించిన కరప త్రములను ఆవిష్కరించామన్నారు. స్వర సుధా కళా సేవా సమితి చైర్మన్ కొత్త మాసు సుధాకర్ చే నిర్వహించబడు సంగీత విభావరికి కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులని ఎమ్మెల్యే



డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తెలియజేసారు. కార్యక్రమం లో కొత్త మాసు సుధాకర్, కపలవాయి విజయ్ కుమార్, వనమా సాంబశివరావు, అత్తులూరి సుబ్బు, ప్రవల్లిక సత్యం, చేగు వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు షేక్ రఫీ, బడే బాబు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ అవకతవకలపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన..

నకరికల్లు, జూలై 23 ప్రభాతవార్త : పట్టణంలోని బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్ మాదిగ ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షలలో అవకతవకల పై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వైద్య విద్యార్థులు చేపట్టిన, నిరసన కార్యక్రమం పై మోదీ సర్కార్ అత్యంత పాసవికంగా దాడి చేసిందని ఆరోపించారు. విద్యార్థులను గాయపరచడమే కాకుండా, వారికి సంఘీభావం తెలియపరిచిన, వివిధ రాజకీయ పార్టీల దళిత సంఘాల నాయకులపై దాడి చేయటం అత్యంత బాధాకర మన్నారు. దేశంలో భారతీయ జనతా పార్టీ నమ్ముకున్న మనుధర్మ శాస్త్రం నడుస్తుందా.,లేక అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నడుస్తుందా సమాధానం చెప్పాల్సిన బాధ్యత బిజెపి ప్రభుత్వం పై ఉందన్నారు., తక్షణమే నరేంద్ర మోడీ విద్యార్థుల వద్దకు వచ్చి, బే షరతుగా క్షమాపణ చెప్పాలన్నారు., లాఠీ చార్జి చేసిన పోలీస్ ఉన్నత అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని, సస్పెండ్ చేయాలన్నారు. నీట్ పరీక్షలలో అవకతవకలు అవ్వటానికి కారకులైన విద్యాశాఖ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, నాయకులు గుండాల ఆనంద్, రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, సుకుమార్, వేల్పుల రాంబాబు, వరుణ్, ప్రభుదాస్, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

## పాడి రక్షణే కూటమి ప్రభుత్వ తక్షణ కర్తవ్యం: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల టౌన్ జూలై 23 ప్రభాతవార్త:పాడి పశువుల రక్షణే కూటమి ప్రభుత్వ తక్షణ కర్తవ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. నియోజకవర్గంలోని శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాలల పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే గురువారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైతాంగ మనుగడకు, పంటల దిగుబడికి దోహదం చేసే పాడి పశువుల ప్రాధాన్యత గురించి తెలిసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వాటి సంవృద్ధికి ప్రత్యేక శ్రద్ధ



తీసుకుంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న పశు వైద్యశాలల నూతన భవనాల నిర్మాణాలకు గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబును వెలగపూడి సచివాలయంలో కలిసి, నిధుల మంజూరుకు వినతి పత్రం సమర్పించామన్నారు. శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనాల స్థానంలో నూతన భవనాల నిర్మాణాలకు అందించిన వినతి మేరకు స్పందించిన సీఎం నిధులు మంజూరుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. రెంటచింతల మండల కేంద్రం, మంచికల్లు గ్రామాల్లోని పశువైద్యశాల నిర్మాణానికి రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చిందని చెప్పారు. ముంజూరైన నిధులతో రూ.30లక్షలతో రెంటచింతల పశువైద్యశాల, రూ.20 లక్షలతో మంచికల్లు గ్రామ పశువైద్యశాల పాత భవనాల స్థానంలో నూతన భవనాలను నిర్మించనున్నామని ఆయన వెల్లడించారు. పల్నాడు జిల్లా అత్యంత వెనుకబడిన మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి అడిగిందే తడువుగా కుప్పంతో సమానంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద ఎత్తున నిధులు అందిస్తూ..ప్రజల హృదయాల్లో అభివృద్ధి ప్రదాతగా చెరగని ముద్ర వేసుకుంటున్నారని ఎమ్మెల్యే జూలకంటి కొనియాడారు.

## రైతులకు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలు


కారంపూడి, జూలై 23, ప్రభాతవార్త: మండల పరిధిలోని వేపకంపల్లి, చినకొదంగడ్ల గ్రామాల రైతులకు కూటమి ప్రభుత్వం అందజేసే రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతులమీదిగా అందజేయ నున్నట్లు గురువారం శాసన సభ్యుల వారి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. వేపకంపల్లి గ్రామంలోని బొడ్రాయి సెంటర్ల నందు ఈ నెల 25న ఉదయం 11 గంటలకు దాదాపు 1500 మంది రైతులకు



నూతన పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయడానికి రెవిన్యూ అధికారులు సర్వసిద్ధం చేశారని పేర్కొంది.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ అవగాహన కార్యక్రమానికి విశేష స్పందన

మాచర్ల టౌన్ జూలై 23 ప్రభాతవార్త: ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో పిల్లలు, పెద్దల కోసం నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి మాచర్లలో విశేష స్పందన లభించింది. గురువారం శ్రీ సత్యసాయి విద్యావిహార్, కేసీపీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రయోజనం పొందారు. కార్యక్రమంలో లివింగ్ హార్ట్ ప్రతినిధులు కోరే సురేష్, తన్నీరు వినయ్ పాల్గొని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గుంటూరులోని భాష్యం పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిని మోక్ష తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంది. కళ్లకు



గంతలు కట్టుకున్నప్పటికీ తన ముందున్న వస్తువులను గుర్తించడం, ఎదుటివారి హావభావాలను అనుకరించడం, పుస్తకాలపై ఉన్న పేర్లను గుర్తించడం వంటి ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ సారథ్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 186 దేశాల్లో సేవలందిస్తోందన్నారు. 18 సంవత్సరాల పైబడిన వారి కోసం హ్యాపీనెస్ మరియు ఎనర్జిటిక్ కార్యక్రమాలు, 5 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం ఇంట్యూషన్ ప్రాసెస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణల ద్వారా పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, నాయకత్వ లక్షణాలు, విద్యా నైపుణ్యాలు పెంపొందడంతో పాటు మంచి చెడులపై అవగాహన కూడా పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలకు జ్ఞాపకశక్తి, గ్రహణశక్తి పెంపొందించే పలు సులభ పద్ధతులను నేర్పించారు. ఏకాగ్రతను పెంచే అభ్యాసాలు, అంతర్జ్ఞానాన్ని వికసింపజేసే టెక్నిక్స్‌ను శిక్షకులు ఆచరణాత్మకంగా వివరించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కొత్త విషయాలను నేర్చుకున్నారు. పెద్దల కోసం నిర్వహించిన "స్ట్రెస్ ఫ్రీ లైఫ్ - హ్యాపీనెస్ ప్రోగ్రామ్" అవగాహన సదస్సులో ప్రస్తుత జీవనశైలిలో పెరుగుతున్న శారీరక, మానసిక, భావోద్వేగ ఒత్తిడిని అధిగమించేందుకు ఉపయోగపడే యోగా, శ్వాస వ్యాయామాలు, ధ్యాన పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రతినిధులు అక్కినేని అనిల్, జక్కా శ్రీనివాసరావు, వై. రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశువులను నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న లారీ పట్టివేత - 36 పశువులు స్వాధీనం

యడ్లపాడు, జూలై 23, ప్రభాతవార్త: యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారి16పై పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, గుంటూరు వైపు నుండి ఒంగోలు వైపు వెళ్తున్న పది చక్రాల లారీ అనుమానాస్పదంగా రావడంతో ఆపేందుకు ప్రయత్నించారు. అయితే లారీ డ్రైవర్ పోలీసుల సూచనలను పట్టించుకోకుండా వాహనాన్ని ఆపకుండా అత్యంత వేగంగా, ప్రమాదకరంగా నడుపుతూ ముందుకు



వెళ్లాడు. దీంతో ప్రజల ప్రాణాలకు, రహదారిపై ప్రయాణిస్తున్న ఇతర వాహనదారుల భద్రతకు ముప్పు కలిగించే విధంగా వాహనం నడిపినట్లు గుర్తించారు. అనంతరం లారీని వెంబడించి ఆపి తనిఖీ చేయగా, అందులో నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ (నంబర్ తిశి39 గిగీ 4414)లో మొత్తం 36 పశువులు ఉండగా, వాటిలో 26 దున్నపోతులు, 10 గేదెలు ఉన్నాయి. పశువులను ఒకదానికొకటి ఖాళీ లేకుండా ఇరుకుగా ఎక్కించి, సరైన గాలి, వెలుతురు, ఆహారం, నీటి సౌకర్యాలు లేకుండా, వాటి రక్షణకు అవసరమైన కనీస జాగ్రత్తలు పాటించకుండా తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ సామర్థ్యానికి మించి అదనంగా పశువులను ఎక్కించినట్లు, అనుమతించిన పరిమితికి మించి మొత్తం 36 పశువులను రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనలో లారీని, అందులో ఉన్న 36 పశువులను స్వాధీనం చేసుకుని, లారీ డ్రైవర్ మరియు క్లీనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. పశువుల రక్షణ, అక్రమ రవాణా మరియు నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## స్విమ్మింగ్ పోటీల్లో 5 పతకాలు సాధించిన కృష్ణవేణి విద్యార్థి

నకరికల్లు జులై 23 ప్రభాతవార్త : ఈ నెల 18, 19 తేదీలలో విశాఖపట్నంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ అక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి ఆర్. హర్షవర్ధన్ రాజు అద్భుత ప్రతిభ కనబరిచి ఐదు పతకాలను కైవసం చేసుకుని కళాశాలకు, పల్నాడు జిల్లాకు గర్వకారణంగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో హర్షవర్ధన్ రాజు 1500 మీటర్ల ఫ్రీస్టైల్, 200 మీటర్ల బటర్‌ఫ్లై,



400 మీటర్ల ఇండివిడ్యువల్ మెడ్లే విభాగాల్లో మూడు రజత పతకాలు, 800 మీటర్ల ఫ్రీస్టైల్ మరియు 400 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగాల్లో రెండు కాంస్య పతకాలు సాధించి తన ప్రతిభను చాటుకున్నాడని తెలిపారు. హర్షవర్ధన్ క్రమశిక్షణ, కఠోర సాధన, అంకితభావంతో ఈ విజయాలను సాధించారని కొనియాడారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ దావులూరి యోగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ ఈధర ఆదిబాబు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, హర్షవర్ధన్ రాజును అభినందించారు.

## మహిళా శిశు సంక్షేమ సాధికారత శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

నరసరావుపేట, జులై 23 ప్రభాతవార్త : మహిళా శిశు సంక్షేమ సాధికారత శాఖ పరిధిలోని వన్ స్టాప్ సెంటర్ (నరసరావుపేట, మాచర్ల )స్పెషల్ ఏజెన్సీ చిల్డ్రన్ హోమ్ లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను అధికారులు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఆర్ఓ అధ్యక్షతన కలెక్టరేట్లో పోస్టుల వారీగా ఇంటర్వ్యూలు జరిగాయి. మాచర్ల వన్ స్టాప్ సెంటర్ కి సంబంధించి 12 పోస్టులకు గాను 16 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వన్ స్టాప్ సెంటర్ నరసరావుపేటకు సంబంధించి రెండు



పోస్టులకు గాను 16 మంది అభ్యర్థులు హాజరయ్యారు. స్పెషల్ అడాప్షన్ ఏజెన్సీ ఒక పోస్ట్ కు ముగ్గురు అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా చిల్డ్రన్ హోమ్ లో ఒక పోస్టుకు సంబంధించి ఒక అభ్యర్థి హాజరయ్యారు. వన్ స్టాప్ సెంటర్ పోస్టుల ఎంపిక కమిటీలో డిఆర్ఓ తో పాటు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, మెడికల్ ఆఫీసర్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పాల్గొన్నారు.

## కేరిడ్జ్ లో విద్యార్థి మండలి ఎన్నికలు


రొంపిచర్ల, జూలై 23 ప్రభాతవార్త : నరసరావుపేటలోని కేరిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో గురువారం స్కూల్ హెడ్ బాయ్, స్కూల్ హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ పదవుల కోసం విద్యార్థి మండలి ఎన్నికలను ప్రజాస్వామ్య మరియు పారదర్శక పద్ధతిలో విజయవంతంగా జరిగాయి. దేశంలో జరిగే సాధారణ ఎన్నికల విధానాన్ని అనుసరిస్తూ పాఠశాలలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియను అకాడమిక్ ఆఫీసర్ టి. విజయరాజు చీఫ్ ఎలక్షన్ కమిషనర్, కోకరిక్యులర్ యాక్టివిటీస్ కోఆర్డినేటర్ శుభమిత్ర డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ గా వ్యవహరించి సమర్ధవంతంగా నిర్వహించారు. ఈస్కూల్ ఎన్నికల్లో



భారత సింహ (స్కూల్ హెడ్ బాయ్), హర్షిత (స్కూల్ హెడ్ గర్ల్), వేదాంత్ (డిప్యూటీ హెడ్ బాయ్), ఆశిక (డిప్యూటీ హెడ్ గర్ల్) గా విద్యార్థులు ఎన్నుకున్నారు. ఎన్నికైన ప్రతినిధులు నాయకత్వం, బాధ్యత, క్రమశిక్షణ మరియు సేవా భావాలను పాటిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కొమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జి. బర్నబాస్, క్యాంపస్ ఇన్చార్జ్ కోట బాపూజి, హైస్కూల్ కోఆర్డినేటర్ చిన్నపరెడ్డి, ప్రైమరీ కోఆర్డినేటర్ షహనాజ్, ప్రీప్రైమరీ కోఆర్డినేటర్ రమణ హాజరయ్యారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి, బాధ్యతాయుతమైన నాయకత్వ లక్షణాలు మరియు సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు.

## కోటప్పకొండ ఆలయంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించిన ఎమ్మెల్యే డా. చదలవాడ

నరసరావుపేట, జూలై 23 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖశైవక్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం వద్ద గురువారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నెల 25న తొలి ఏకాదశి పర్వదినసందర్భంగా కోటప్పకొండకు వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఈ డ్రైవ్ చేపట్టారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శానిటేషన్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. గుడి మెట్ల మార్గం, క్యూ లైన్ల మార్గం, గుడి ప్రాంగణం తదితర ప్రాంతాలను స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ భక్తులందరికీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. 25వ తేదీన జరగనున్న తొలి ఏకాదశి కొండ పండుగకు వేలాదిగా భక్తులు హాజరవుతారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు



చేస్తున్నామని తెలిపారు. భక్తులకు సౌకర్యవంతంగా దర్శన ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులు, కలెక్టర్, పోలీసు శాఖను కోరినట్లు చెప్పారు. కొండ పైభాగం మొత్తం శుభ్రం చేశామని, ఎక్కడా మట్టి కనిపించకుండా గ్రాస్ పెంచి, కార్పెట్స్ వేశామని తెలిపారు. "కొండ అంటే మన ఇల్లులా, మన ఇంట్లో గుడిలా ఉండాలనే ఆలోచనతో అన్ని వసతులు కల్పించాం" అని అన్నారు. భక్తుల కోసం ప్రతి అడుగడుగునా మంచినీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ ఏర్పాటు చేశామని, గిరి ప్రదక్షిణ మార్గంలో ఫారెస్ట్ అధికారుల సహకారంతో మంచినీరు, పండ్లు తదితర ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఆలయ అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సిద్ధంగా ఉందన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకోవాలన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

నకరికల్లు, జులై 23 ప్రభాతవార్త :: గుడిపూడి గ్రామంలో సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సింగరాజు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం గురువారం విజయవంతమైంది. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. సింగరాజు సాయికృష్ణ, డాక్టర్ సింగరాజు విద్య వివరాలు తెలిపారు. వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు, నెమ్ము, దగ్గు, ఆయాసం, ఉబ్బసం వ్యాధుల పట్ల తీసుకువాల్సిన జాగ్రత్తలు హాజరైన రోగులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. బీపీ, షుగర్, జ్వరాలు నెమ్ము, ఆయాసం, ఉబ్బసం, జలుబు, దగ్గు, థైరాయిడ్ సమస్యలు, జనరల్ వ్యాధుల కు ఊపిరితిత్తుల వ్యాధులకు ఉచితంగా (ఈసీజీ, ర్యాండమ్ షుగర్, థైరాయిడ్ ప్రొఫైల్, బీ12)పరీక్షలు చేసారు. సుమారు 170 మందికి వైద్య సేవలు అందజేశారు. అలాగే అవసరమైన రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్య శిబిర కార్యక్రమంలో గ్రామపెద్దలు గద్దె అప్పారావు, లగడపాటి గజానన, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇప్పుడు వచ్చిన కరోనా భయపడాల్సిన అవసరం లేదు
## ఏపీ ఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, జూలై 23, ప్రభాతవార్త మంగళగిరి ఆటోనగర్ లోని ఏపీ ఎం ఎస్ ఐ డి సి ప్రధాన కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. గత క్లిష్ట పరిస్థితులతో పోల్చుకుంటే ప్రస్తుతం కోవిడ్ గురించి ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కోవిడ్‌కు సంబంధించి అన్ని రకాల టెస్టింగ్ కిట్లు, నిత్యావసర మందులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా సరిపడా ఆక్సిజన్ నిల్వలు, బెడ్లు పూర్తిగా అందుబాటులో ఉంచామని వెల్లడించారు. ఎక్కడా ఎటువంటి కొరత రాకుండా



వైద్య ఆరోగ్య శాఖతో కలిసి ఏపీఎంఎస్ఐడీసీ నిరంతరం పర్యవేక్షిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫ్రంట్‌లైన్ వైద్య సిబ్బంది సురక్షితంగా సేవలందించేందుకు అవసరమైన పీపీఈ కిట్లు, ఎన్95 మాస్కులు, శానిటైజర్లను అన్ని కేంద్రాలలో తగినంత మొత్తంలో అందుబాటులో ఉంచామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సూచనలు మేరకు మెడికల్ పరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, దీనిపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 బోధనాసుపత్రులలో 255 ప్రత్యేక కోవిడ్ పడకలను (బెడ్స్), ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రుల్లో కోవిడ్ పరీక్షల కిట్లు, మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని" అలాగే వైరస్ రకాన్ని గుర్తించేందుకు వీలుగా నమూనాలను పుణెలోని ల్యాబ్‌కు జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇటీవల నమోదైన కేసుల్లో నలుగురు మృతి చెందినట్లు అధికారులు ధృవీకరించారు. అయితే, ఈ మరణాలు కేవలం కోవిడ్ వల్ల మాత్రమే సంభవించలేదని, సదరు బాధితులు తీవ్రమైన బీపీ, మధుమేహం, కిడ్నీ సమస్యల వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతుండటం వల్లే మృతి చెందారని స్పష్టం చేశారు. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ఒమిక్రాన్ ఆర్ఎఫ్.5 సబ్‌వేరియంట్ అంత ప్రమాదకరమైనది కాదని, ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే ఎలాంటి తప్పుడు వదంతులను నమ్మవద్దని మంత్రి సత్యకుమార్, చిల్లపల్లి శ్రీనివాసరావు కోరారు. ఏ చిన్న లక్షణాలు ఉన్నా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని వారు సూచించారు. మంగళగిరిలో ప్రతిష్టాత్మక వంద పడకల ఆసుపత్రి అతి త్వరలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుందని, తద్వారా ఈ ప్రాంత పేద ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందుతాయని ఆయన వెల్లడించారు.

## ప్రముఖ న్యాయవాది విజయ్ నాయుడు జన్మదినం సందర్భంగా అన్నదానం

తెనాలి జులై23(ప్రభాతవార్త): ప్రముఖ న్యాయవాది మైలా విజయ్ నాయుడు జన్మదిన సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ వద్ద శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షులు కుర్రా



శ్రీను పరివేక్షనలో అన్నదాన కార్యక్రమం నిర్వహించుట జరిగింది. ఈ కార్యక్రమంలో, కఠారి హరీష్, దుబాయ్ బాబు, ఆవుల భానుప్రకాష్, పెదలంక వెంకటేశ్వరరావు, షేక్ మీరావలి, ఎన్. ఆర్. కే శర్మ, మల్లె బోయిన రాము, అమర్తల శ్రీనివాసరావు, అజిత్, బండ్లముడి నాని అసద్, రబ్బు, కుర్రా జస్వంత్, శామ్యల్, జ్యోతుల బాబీ, తెనాలి మెడికల్ కృష్ణంరాజు, దొడ్డంపూడి నాగరాజు, పిల్లి ప్రేమ్ రాజ్, టి. ప్రభాకరరావు, ఎం. కోటెశ్వరరావు, రాజేంద్ర వి. సతీష్, పిరాటి వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అరవింద మోడల్ స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెరిమనీ

మంగళగిరి, జూలై 23, ప్రభాతవార్త: మంగళగిరిలోని అరవింద మోడల్ స్కూల్‌లో నేడు ఇన్వెస్టిట్యూర్ సెరిమనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరవింద విద్యాసంస్థల యాజమాన్యం తరపున నవ్య అరవింద్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సొనెల్ ఆఫీసర్ ఐఆర్‌పీఎస్ అధికారి క్యాప్రిల్ అరోరా విచ్చేసి విద్యార్థి నాయకులకు బాధ్యతల ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నవ్య అరవింద



మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత భావన, సేవా దృక్పథం పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే భయం, బెరుకు లేకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్య అతిథి క్యాప్రిల్ అరోరా విద్యార్థులను ఉద్దేశించి వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, కృషి, సమయపాలన, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై ప్రేరణాత్మక ప్రసంగం చేసి విద్యార్థులను ఉత్తేజపరిచారు. అనంతరం భారతీయ రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన వక్తృత్వ , వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు క్యాప్రిల్ అరోరా చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## తెనాలిలో ఘనంగా 72వ భారతీయ మజ్దూర్ సంఘ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

తెనాలి వార్తలు జులై23(ప్రభాతవార్త): భారతీయ ముజుదూర్ సంఘ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను గురువారం స్థానిక బస్టాండ్, మార్కెట్ సెంటర్ వద్ద జండా ఆవిష్కరణ చేసి అనంతరం మారిస్ పేట లోని కోపరేటివ్ సొసైటీ సంఘ సభ్యులతో మావేశం నిర్వహించారు. భారతీయ



మజ్దూర్ సంఘ్ అతిపెద్ద కార్మిక సంఘం అనేక రకాల సంఘాల్లో విస్తరించి అగ్రగామిగా ఉందని, దేశ హితం, పారిశ్రామిక హితం, కార్మిక హితం, అనే నినాదంతో భారతీయతత్వతని ప్రతిబింబిస్తూ కార్మికులకు అవగాహన కల్పిస్తూ, వారికి అండగా ఉంటున్నాము అని. ఈ కార్యక్రమంలో పాల్గొని అందరిని కలుసుకోటటం నాకు చాలా ఆనందంగా ఉందని రాష్ట్ర అధ్యక్షులు తంగిరాల రఘురామ్ తెలియ చేశారు .ఈ కార్యక్రమంలో జి.సీతారాములు ఎ .పి. సి.పి. డి.ఈ.ఎల్. యూనియన్ గౌరవ అధ్యక్షులు, ( ఆంధ్రా రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్) విజయవాడ. డి.రాజేష్, ( గుంటూరు జిల్లా యూనియన్ సెక్రటరి) రమణ ( రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు) గురు బ్రహ్మం ( ఎలక్ట్రిసిటీ యూనియన్) శ్రీధర్ తదితరులు , కార్మికులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్‌టీచర్స్ మీటింగ్ ఆకృతిలో విద్యార్థులు

తెనాలి జులై23(ప్రభాతవార్త): తెనాలి పట్టణం మారిస్ పేట లోని నల్లమోతు వెంకు రామానాయుడు మున్సిపల్ హై స్కూల్ నందు,ప్రధానోపాధ్యాయులు పఠాన్ కరీముల్లా పర్యవేక్షణలో,



చిత్రకళ ఉపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ ఆధ్వర్యంలో, శుక్రవారం జరగబోయే, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా "మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్" 4.0 ఆకృతి లో విద్యార్థులను అమర్చడం జరిగింది. ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు, ప్రైమరీ స్కూల్ విద్యార్థులు,హై స్కూల్ విద్యార్థుల అందరూ ఐకమత్యంగా, చప్పట్లు, కేరింతలతో నడుమ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులందరూ శుక్రవారం నిర్వహించబోయే కార్యక్రమానికి సంసిద్ధమని సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి శ్రీనివాసరావు, సోమశేఖర్, ఛాయాదేవి, సంపూర్ణ, కాత్యాయని, మాధవి,నాగిరెడ్డి, హబీబ్ బాషా, కరీముల్లా సలీం, పులి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వేయర్‌గా తిరుపతి విజయకుమార్

పొన్నూరు, జూలై 23,ప్రభాతవార్త: పొన్నూరు మండల సర్వేయర్‌గా తిరుపతి విజయకుమార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సర్వేయర్‌గా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై



ఇక్కడు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న అడపాల సత్యనారాయణ ఉద్యోగోన్నతిపై గుంటూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయకుమార్ గతంలో చెరుకుపల్లి, వేమూరు, నకిరికల్లు తదితర చోట్ల పనిచేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో రీ సర్వే జరుగుతుందని, అందుకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రైతులు, భూ యజమానులు సహకరిస్తే సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు.

## సమన్వయంతోనే వినూత్న ఆవిష్కరణలు సాధ్యం

-ఐఐటీ తిరుపతికి చెందిన ప్రొఫెసర్ ఎస్.బాలకృష్ణ

-విజ్ఞాన్‌లో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు

పొన్నూరు, జూలై 23,ప్రభాతవార్త: భవిష్యత్‌లో పరిశోధనలు ఇంటర్‌డిసిప్లినరీ విధానంలో మరింత విస్తరించనున్నాయని, గణితం, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్, జీవశాస్త్రం, వైద్యశాస్త్రం వంటి



విభిన్న రంగాల సమన్వయంతో వినూత్న ఆవిష్కరణలు సాధ్యమవుతాయని ఐఐటీ తిరుపతికి చెందిన ప్రొఫెసర్ ఎస్.బాలకృష్ణ తెలిపారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ పరిధిలోని డిపార్టుమెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న కంప్యూటేషన్ మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టికల్ సైన్సెస్ అంతర్జాతీయ సదస్సు గురువారం ఘనంగా ప్రారంభమైంది. హైబ్రిడ్ విధానంలో (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సుకు సంబంధించిన కాన్ఫరెన్స్ సావనీర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎస్.బాలకృష్ణ మాట్లాడుతూ అనువర్తిత గణితం, కంప్యూటేషనల్ సైన్స్ రంగాలు నేటి సాంకేతిక ప్రపంచానికి వెన్నెముకగా నిలుస్తున్నాయని అన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, హై-పర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్, శాస్త్రీయ అనుకరణలు వంటి రంగాల్లో వేగంగా జరుగుతున్న పరిశోధనలను వివరించారు. గణిత నమూనాలు, కంప్యూటేషనల్ అల్గారిథమ్‌లు సంక్లిష్ట సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తున్నాయని చెప్పారు. మరో ముఖ్య అతిథి ఐఐటీ పాట్నాకు చెందిన ప్రొఫెసర్ ఓం ప్రకాశ్ మాట్లాడుతూ, ఆధునిక శాస్త్రీయ పరిశోధనల్లో గణితశాస్త్రం పాత్ర రోజు రోజుకూ విస్తరిస్తోందన్నారు. సంక్లిష్టమైన శాస్త్రీయ సమస్యలను విశ్లేషించడంలో, వాటికి ఖచ్చితమైన పరిష్కారాలను రూపొందించడంలో అధునాతన గణిత భావనలు కీలకంగా మారాయని తెలిపారు. కంప్యూటేషనల్ మోడలింగ్, సంఖ్యా విశ్లేషణ, ఆప్టిమైజేషన్ పద్ధతులు,గణిత నమూనాల రూపకల్పన వంటి అంశాలు ఇంజనీరింగ్, అంతరిక్ష శాస్త్రతం, ఆరోగ్య సంరక్షణ, వాతావరణ పరిశోధనలు, డేటా సైన్స్, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో విస్తృతంగా వినియోగంలో ఉన్నాయని వివరించారు. పరిశోధకులు కేవలం సిద్ధాంతపరమైన అంశాలకే పరిమితం కాకుండా, సమాజ అవసరాలకు ఉపయోగపడే ఆచరణాత్మక పరిష్కారాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు నూతన పరిశోధన ధోరణులను అవగాహన చేసుకొని విశ్లేషణాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మరో ముఖ్య అతిథి కాలికట్‌కు చెందిన ప్రొఫెసర్ మహేశ్‌కుమార్ మాట్లాడుతూ కంప్యూటేషనల్ గణితం ఆధునిక విజ్ఞానశాస్త్రం, సాంకేతిక అభివృద్ధిలో కీలకమైన సాధనంగా మారిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న పరిణామాలను వివరిస్తూ, గణిత సిద్ధాంతాలను కంప్యూటింగ్ సాంకేతికతతో సమన్వయం చేయడం ద్వారా సంక్లిష్ట సమస్యలకు వేగవంతమైన, ఖచ్చితమైన పరిష్కారాలను అందించగలుగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన రవిశంకర్

పొన్నూరు, జూలై 23,ప్రభాతవార్త: పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన కోట రవిశంకర్ స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకుల సమక్షంలో బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. తనపై



నమ్మకంతో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా నియమించారని, వారి నమ్మకాన్ని వమ్ము కాకుండా ఆర్యవైశ్యుల అభివృద్ధికి, సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. దేవాలయాల అభివృద్ధి, కళ్యాణ మండపం ఆధునీకరణ తదితర అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్యులందరిని కలుపుకుపోయి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కోట రవిశంకర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాక్షి భావనారాయణస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి డైరెక్టర్ శిఖాకొల్లి గుర్నాధరావు, శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుప్తా, వ్యవసాయ మార్కెట్‌యార్డు డైరెక్టర్ తవ్వా విజయ్, ఆలపాటి సుబ్బారాయుడు ధర్మసత్రం ఫౌండర్ ట్రష్టీ ఆలపాటి శ్రీనివాసరావు, కొత్తమాసు రామకృష్ణ,తాడికొంట సుధీర్, కోట హేమసుందరగుప్తా, లింగమల్లు మోహనకృష్ణ, కాకరపర్తి హనుమంతరావు తదితరులున్నారు.

## ఆహార పదార్థాలను వృధా చేయకూడదు

-మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్

పొన్నూరు, జూలై 23,ప్రభాతవార్త: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అలాంటి అన్నాన్ని వృధా



కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థులందరిపై ఉందని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ సూచించారు. నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన పథకం తీరు తెన్నులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాలను హృధా కాకుండా అవసరమైన మేరకు వడ్డించుకొని భుజించాలని కోరారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆహారపదార్థాలను రుచి, శుచిగా తయారు చేసి విద్యార్థులకు అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందిస్తున్నారా..?లేదా..? అనే విషయాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్ గురించి అడిగి తెలుసుకొన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇరువురు కృషి చేయాలన్నారు.

## 25న లక్ష తులసీ దళార్చన మహోత్సవం

పొన్నూరు, జూలై 23,ప్రభాతవార్త: పట్టణంలోని తెలగపాలెం రామమందిరంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 25వ తేదీన స్వామివారికి లక్ష తులసీ దళార్చన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి నాయకులు తెలిపారు. పర్వదినం రోజున స్వామి, అమ్మవార్లకు విష్వక్సేనారాధన, వాసుదేవ, పుణ్యాహవాచన, విశేష ద్రవ్యసన్నపన, నీరాజన మంత్ర పుష్ప కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు(రాము)సెల్ నెం:8500855896, 8500719276 సంప్రదించాలని కోరారు.

## 29న గురుపౌర్ణమి మహోత్సవం

పొన్నూరు, జూలై 23,ప్రభాతవార్త: పట్టణంలోని తెలగపాలెంలో వేంచేసియున్న సద్గురు శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 29వ తేదీన గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు మందిరం అధ్యక్ష, కార్యదర్శులు చక్కా శ్రీనివాసరావు, యరసాని సరిత తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా ఈ నెల 25వ తేదీ నుండే కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 25న ఉదయం 9.30గంటలకు శ్రీ సాయి సత్య వ్రతము, 26న ఉదయం 10గంటలకు హనుమాన్ చాలీసా పారాయణము, 27న ఉదయం 6గంటల నుంచి సాయంత్రం వరకు శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణము, 28వ తేదీన ఉదయం 9.30గంటలకు శ్రీ సాయి నామ జపము జరుగుతాయన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా 29న ఉదయం కాకడ హారతి, పంచామృత అభిషేకము, అష్టోత్తర పూజా కార్యక్రమాలు, భక్తిగీతాలు ఆలాపన, 12.30గంటలకు బాబా వారి అన్నప్రసాదము, పల్లకీసేవ, పలు హారతులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## నేడు మంత్రి అనగాని పర్యటన



రేపల్లె, జూలై 23, ప్రభాతవార్త:రేపల్లె మండలంలోని పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొంటారు.మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రూ.29 లక్షల 30 వేల నిధులతో నూతనంగా నిర్మించిన భవిత కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 1 గంటకు రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్‌లో సమస్యలకు సంబంధించిన అర్జీలను మంత్రి అనగాని సత్యప్రసాద్ స్వీకరిస్తారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్

### విద్యార్థులతో సంకల్పం ప్రతిజ్ఞ చేయించిన తెనాలి పోలీసులు:

తెనాలి జులై23(ప్రభాతవార్త): విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలైతే ఉన్నతమైన ఆశయాలు, జీవిత లక్ష్యాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెనాలి టూ టౌన్ సీఐ దాసరి రవీంద్రబాబు హెచ్చరించారు. యువత తమ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన వయస్సులో మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని సి.వి. రామన్ హాల్‌లో నిర్వహించిన ఖిసంకల్పంఖి మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమంలో టూ టౌన్ సీఐ దాసరి రవీంద్రబాబు, వన్ టౌన్ సీఐ సీహెచ్. రాంబాబు ముఖ్య




అతిథులుగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.పదార్థాలు విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడతాయని, క్షణిక ఆనందం కోసం జీవితాన్ని పణంగా పెట్టవద్దని సూచించారు. చదువు, క్రమశిక్షణ, మంచి స్నేహితులు, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయని అన్నారు. రాష్ట్ర డీజీపీ ఆధ్వర్యంలో గంజాయి రహిత సమాజ నిర్మాణ లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఖిసంకల్పంఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వన్ టౌన్ సీఐ సీహెచ్. రాంబాబు మాట్లాడుతూ, డ్రగ్స్ బారిన పడకుండా, చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. యువతలో చైతన్యం కల్పించేందుకు ఈగల్ ఐజీ రవికృష్ణ చేపట్టిన సంకల్పం కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా, క్రయవిక్రయాలు చట్టరీత్యా నేరమని, డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారికి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు సంబంధిత చట్టాల ప్రకారం కఠిన శిక్షలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే సందేశంతో విద్యార్థులు తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని రాంబాబు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ఖిసంకల్పంఖి ప్రతిజ్ఞ చేయించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా అవగాహన కల్పిస్తామని ప్రతినబూనించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ ప్రకాష్, టూ టౌన్ ఎస్ఐలు లలిత్ కుమార్, సురేష్,గుంటూరు ఈగల్ టీమ్ కానిస్టేబుళ్లు పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీల ప్రతినిధులతో ఆర్డీఓ సమీక్ష

సత్తెనపల్లి, జూలై 23, ప్రభాతవార్త: సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధి లోని పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు, సహాయ ఓటర్ల నమోదు అధికారులకు గురువారం సాయంత్రం సత్తెనపల్లి నియోజకవర్గము లోని గుర్తింపు పొందిన పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఓటర్ల నమోదు అధికారి,(98సత్తెనపల్లి నియోజకవర్గం)మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి వారిచ మ్యాపింగ్ పై పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో మీటింగ్ ఏర్పాటు చేశారు.



సదరు మీటింగ్‌లో సర్‌లో జరుగుతున్న పై అంశములు అనగా పర్మినెంట్ షిఫ్టెడ్,ఆబ్రెడీ ఎన్రోల్డ్,ఆబ్సెంట్ ఓటర్లు వివరములు ,అన్ని పార్టీల ప్రతినిధులకు తెలియపరిచినారు. సదరు మీటింగ్ నందు మండలముల తహశీల్దార్లు, ఆర్డీఓ గోపాల కృష్ణ తహసిల్దార్ లు కెఎస్ చక్రవర్తి (సత్తెనపల్లి), ఎన్ దుర్గేష్ (రాజుపాలెం) కె.పుల్లారావు(నకరికల్లు) కె.నగేష్ (ముప్పాళ్ళ) .వి.ఆనంద్ కుమార్ (మున్సిపల్ కమిషనర్) అన్ని పొలిటికల్ పార్టీ ప్రతినిధులు హాజరయ్యారు.

## నర్సరీ యజమానులు నర్సరీ చట్టం నిబంధనలు పాటించాలి.

సత్తెనపల్లి, జూలై 23, ప్రభాతవార్త: నర్సరీ యజమానులు నర్సరీ చట్టం నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన అధికారి యన్.సురేష్ అన్నారు. సత్తెనపల్లి మండల పరిధిలోని కంకణాలపల్లి, వెన్నాదేవి మరియు ధూళిపాళ్ల గ్రామాలలో ఉన్న షేడ్ నెట్ నర్సరీలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు నర్సరీ చట్టం 2010 ప్రకారం నిబంధనలు పాటించాలన్నారు. నర్సరీ లైసెన్స్ లేని వారు లైసెన్స్ పొందుటకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ యొక్క లైసెన్స్ పొందాలంటే షేడ్ నెట్ చుట్టూ 8 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్ తో రక్షణ కల్పించాలన్నారు అలాగే డబుల్ డోర్ సిస్టంను



కలిగి ఉండాలన్నారు.షేడ్ నెట్ నర్సరీలో లో పై భాగాన ఉన్న నెట్ కు గాని క్రింది భాగంలో ఉన్న ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్ కు గాని కీటకాలు లోపలకు ప్రవేశించకుండా ఉండుటకు ఎక్కడా కూడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలన్నారు. మిరప విత్తనాలను పోట్రేలలో నాటి వాటిని ఎత్తయిన మడులలో అమర్చాలన్నారు. శుద్ధి చేసిన కోకోపీట్ మాత్రమే వాడాలన్నారు. కోకోపీట్ ను శుద్ధి చేయుటకు ఒక కేజీ ట్రైకోడెర్మావిరిడే ఒక కేజీ సూడోమనాస్ ను 200 కేజీల కోకోపీట్ లో కలపాలి అన్నారు. నర్సరీ యజమాలను విత్తనాన్ని కొనుగోలు చేసినప్పుడు విత్తనాల ప్యాకెట్ మీద విత్తన రకము లాట్ నెంబర్ కంపెనీ యొక్క లేబుల్ గమనించి నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొన్న ఒరిజినల్ రసీదులను భద్రపరచుకుని నర్సరీ రిజిస్టర్ లో నమోదు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ లేని ప్రతి ఒక్కరూ లైసెన్స్ కోసం తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా షేడ్ నెట్ నర్సరీలు వేసిన వారు కూడా రిజిస్ట్రేషన్ చేసుకుని లైసెన్స్ పొందవలసిందిగా తెలియజేశారు. అంతేకాకుండా లైసెన్సు రెన్యువల్ చేసుకోవాల్సిన నర్సరీలు ఉన్నట్లయితే వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకొని వారి యొక్క లైసెన్స్ ను రెన్యువల్ చేసుకోవాల్సిందిగా కోరినారు. రైతులకు నాసి రకం నారు అందించిన ఎడల అటువంటి నర్సరీలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లైసెన్స్ లేకుండా మిరపనారును పెంచే నర్సరీలపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

## గుడిపూడి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

సత్తెనపల్లి, జూలై 23, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో సాయికృష్ణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో సింగరాజు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించందని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. సింగరాజు సాయికృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో సాయికృష్ణ ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు,



విషజ్వరాలు,నెమ్ము,దగ్గు, ఆయాసం,ఉబ్బసం వ్యాధుల పట్ల తీసుకువాల్సిన జాగ్రత్తలు హాజరైన రోగులకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో బీపీ,షుగర్,జ్వరాలు నెమ్ము, ఆయాసం, ఉబ్బసం, జలుబు, దగ్గు, థైరాయిడ్ సమస్యలు, మరియు అన్ని జనరల్ వ్యాధుల కు ఊపిరితిత్తుల వ్యాధులకు ఉచితంగా ఈసీజీ, షుగర్, థైరాయిడ్ ప్రొఫైల్, పరీక్షలు చేసి సుమారు 170 మందికి వైద్య సేవలు అందజేశారు.అలాగే అవసరమైన రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ వైద్య శిబిర కార్యక్రమంలో గ్రామపెద్దలు గద్దె అప్పారావు,లగడపాటి గజానన,జీ.రమేష్ ,జి . ఆంజనేయులు, కే. పుల్లారావు, బి. పుల్లారావు, బి. సాంబశివరావు, ఎల్. రామారావు మరియు గుడిపూడి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హిందూ ఫార్మసి కళాశాలలో అవయవదానంపై అవగాహన

గుంటూరు విద్య జూలై 23 ప్రభాతవార్త : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసి కళాశాలలో శరీర అవయవ దానం మీద సావిత్రి భాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, గుంటూరు జిల్లా కమిటీ వారు రాష్ట్ర స్పెక్ట్ అధ్యక్షులు ఆధ్వర్యంలో అవయవ దానం పై లఘు చిత్రం (షార్ట్ ఫిలిం) చిత్రీకరించినట్లు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. ఈ చిత్రాన్ని ఆగష్టు 3న జరిగే జాతీయ అవయవ దాన దినోత్సవం, ఆగష్టు 6 వ తేదీన జరుగు అవయవ దాతల దినోత్సవం సందర్భంగా వివిధ కళా శాలలో ప్రదర్శించనున్నట్లు, అవయవ దానం పై ప్రజలకు, విద్యార్థులకు అవగా హన పెంపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు తమ



కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసినందుకు స్పెక్ట్ సంస్థ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ , జిల్లా ప్రెసిడెంట్ మోదుకూరు రాధారాణి తమ ధన్యవాదాలు తెలియ చేస్తూ చైర్మన్ జూపూడి రంగరాజుని శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ ఎస్ వి రమణ ని, రాధా రాణి కళాశాల చైర్మన్ శాలువా, మొమెంటో తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సదాశివ రావు, జిల్లా కార్యవర్గం రాఘవరావు, ట్రెజరర్ కృష్ణ కుమారి, డాక్టర్ కల్పనా, మురళి మోహన్, గోపిదేవ్ గిరి భూషణ్, ప్రమీల , తాజున్నిస కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్. మధుసూదన రావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. ప్రత్యూష, ఎన్ ఎస్ ఎస్ యూనిట్ । ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు మెగా పి.టి.ఎంలో తల్లిదండ్రులు పాల్గొనాలి జిల్లా కలెక్టర్ సిఎం సాయికాంత్ వర్మ

గుంటూరు విద్య, జూలై 23 ప్రభాతవార్త : మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్ (మెగా పి.టి.ఎం) 4.0లో తల్లిదండ్రులు ఇద్దరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలో 1,048 పాఠశాలలు, ఐదు ప్రభుత్వ కళాశాలల్లో మెగా పి.టి.ఎం 4.0 నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పాఠశాలలు, కళాశాలల్లో దాదాపు 92 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరూ పాల్గొని తమ కుమారుడు లేదా కుమార్తె విద్యా ప్రమాణాలు తెలుసుకోవాలని కోరారు. పాఠశాలను ఒకసారి సందర్శించడం వలన విద్యార్థులకు ఆత్మవిశ్వాసం కలుగుతుందని, పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు తల్లిదండ్రులు కలుసుకోవడం గొప్ప సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. పాఠశాలలో గల మౌలిక సదుపాయాలు తెలుస్తుందని,



ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన స్థాయి తెలియజేస్తారని, మెరుగుపరచుటకు తీసుకోవలసిన చర్యలు చర్చించవచ్చని తెలిపారు. మెగా పి.టి.ఎం ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు. తల్లిదండ్రులకు కూడా ఆటల పోటీలు, భోజన ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఒక రోజు "మీ బిడ్డ చదివే పాఠశాలను సందర్శించండి వారి విద్యా ప్రమాణాలు మెరుగుకు" తోడ్పడండి అని పిలుపునిచ్చారు.

**లీప్ యాప్ డౌన్ లోడ్ చేయండి..** లెర్నింగ్ ఎక్సెలెన్స్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. యాప్ ఆధారంగా విద్యార్థి అభ్యసన స్థాయి తెలుసుకోవచ్చని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## జీవో నెంబర్ 396కు నిరసనగా వంటావార్పు

అమరావతి,జూలై 23 ప్రభాతవార్త : దస్తావేజులేఖరులు జీవో నెంబర్ 396 కు నిరసనగా గురువారం సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదురు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు మద్దతు పలికారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలను ఎగదోస్తూ అన్ని రంగాలను నీరు గారుస్తుందని ఆయన అన్నారు. దస్తావేజులేఖర్లకు సిపిఐ అండగా ఉండి పోరాడుతుందని జీవో నెంబర్ 396 రద్దు చేసే వరకు వారికి మద్దతు ఇస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరు శ్రీనివాస రావు, శర్మ, కుర్ర వెంకటరావు, ఆర్కే యాదవ్, అరుణ, రాణి, తదితరులు పాల్గొన్నారు.



## తల్లికి వందనం.. తల్లుల్లో ఆనందం: మద్దిరాల గంగాధర్

పెదకూరపాడు, జూలై 23 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం వల్ల తల్లులకు ఆర్థిక భరోసా లభించడంతో పాటు పిల్లల చదువుపై మరింత ఉత్సాహం పెరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల గంగాధర్ అన్నారు. రెండో ఏడాది పథకం కింద రూ.10,120.78 కోట్లు విడుదల చేసి 42,70,802 మంది తల్లులు, సంరక్షకుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం, అభినందనీయమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఇంట్లో ఉన్న ప్రతి అర్హ విద్యార్థికి పథకం వర్తింపజేయడం ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. మొదటి తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థుల తల్లులకు అందిస్తున్న ఆర్థిక సాయం చదువుల భారాన్ని తగ్గించి, చదువుల కొనసాగింపుకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటోందని గంగాధర్ తెలిపారు.



## బడివైపు ఒక అడుగు వేద్దాం .. మండల విద్యాశాఖ

కాకుమాను జూలై 23(ప్రభాత వార్త): బడివైపు ఒక అడుగు వేద్దాం మన పిల్లల ప్రగతిని వర్ధిద్దాం అని కాకుమాను మండల విద్యాశాఖ అధికారులు కె.యఫ్ కెనడి కె . విజయ భాస్కర్ ఒక సంయుక్త ప్రకటనలో గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మరియు గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వుల ప్రకారము నేడు మండల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే జరపాలని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు తప్పనిసరిగా తల్లిదండ్రులు పాఠశాల లో జరుగు మెగా పేరెంట్స్ డే లో పాల్గొని పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల అభివృద్ధిలో పరస్పరం టీచర్స్ తో చర్చించుకోవాలని వారు పిలుపునిచ్చారు. మరియు వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, పాఠశాల అభివృద్ధికి దోహదపడిన దాతలు కూడా ఈ కార్యక్రమంలో పాలు పొందవలసిందిగా కోరారు.



## పశ్చిమ నియోజకవర్గం మొత్తం ఖాళీ స్థలాలు క్లియర్ అయ్యే వరకు ఆగం" ..ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టీకరణ

గుంటూరు, జూలై 23,ప్రభాతవార్త :అసెంబ్లీ, మున్సిపల్ కౌన్సిల్ లో లేవనెత్తిన ఖాళీ స్థలాల సమస్య పై నిరంతరం గళమెత్తుతున్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చొరవతో, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఖాళీ స్థలాల క్లియరెన్స్ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. తొలి సారిగా 25వ డివిజన్ సీతారామనగర్ – అడర్సనగర్ రోడ్డులో ఖాళీ స్థలాల శుభ్రత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఘనంగా ప్రారంభించారు. డివిజన్‌లో మూడు ప్రాంతాల్లో జరుగుతున్న ఖాళీ స్థలాల క్లియరెన్స్ పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఇళ్ల మధ్యలో నిర్లక్ష్యంగా వదిలిపెట్టిన ఖాళీ స్థలాలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ఈ సమస్యను గత రెండేళ్లుగా అసెంబ్లీలోనూ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశాల్లోనూ పదేపదే ప్రస్తావించానని,వర్షాకాలంలో ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, విషసర్పాలు, క్రిమికీటకాలు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని, అంతేకాకుండా ఇలాంటి ప్రదేశాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల నుండి వచ్చిన అనేక ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నించామని చెప్పారు.ఈ అంశాన్ని ఫొటోగ్రాఫిక్ ఆధారాలతో అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించడంతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కూడా ప్రత్యేక నివేదిక అందజేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్పొరేషన్‌లోనూ సుదీర్ఘ వివరణలు ఇవ్వడంతో కమిషనర్ మయూర్ అశోక్ సానుకూలంగా స్పందించి ఖాళీ స్థలాల క్లియరెన్స్‌కు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు గాలం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జొన్నకూటి ప్రసాద్, పటాన్ రాజా ఖాన్, వేమూలపల్లిశ్రీనివాసు, మండలా వెంకటరావు, ముత్తినేని పవన్, వేణుగోపాల్ రెడ్డి, సంపత్ శీను,వేముల శీను, కోటయ్య రాజు, సుబ్బారావు,సుబ్బారెడ్డి గొట్టిపాటి శీను, పిఎల్ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## వాహనతనిఖీలు నిర్వహించిన టూ టౌన్ పోలీసులు

తెనాలి జులై23(ప్రభాతవార్త): వాహన తనిఖీల్లో భాగంగా టూ టౌన్ సీఐ రవీంద్రబాబు ఆధ్వర్యంలో తెనాలి పట్టణంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. టూ టౌన్ సిబ్బంది కలిసి కళాశాలల పరిసరాలు, ఉమెన్స్ కాలేజీ రోడ్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక నిఘా ఉంచి, మైనర్లు వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్‌కు పాల్పడుతున్న వాహనదారులను గుర్తించి వారిని ఆపి ట్రాఫిక్



నిబంధనలపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. పట్టుబడిన వాహనాలకు మోటార్ వెహికల్ చట్ట ప్రకారం జరిమానా విధించటం జరిగిందని వారి వద్ద నుండి రు.15,455/ రూపాయలు చలానా రూపంలో జరిమానా విధించడం జరిగిందని టూటౌన్ సీఐ రవీంద్రబాబు తెలిపారు.

## మాజీ సర్పంచ్ తుమ్మల రామచంద్రరావు దంపతుల జ్ఞాపకార్థం దుస్తుల పంపిణీ

తెనాలి జులై23(ప్రభాతవార్త): తెనాలి ప్రాంతం అమృతలూరు మండలం పెదపూడి గ్రామంలో మాజీ సర్పంచ్, ప్రముఖ పశు పోషకులు తుమ్మల రామచంద్రరావు 34వ వర్ధంతి, తుమ్మల నాగరత్నమ్మ 30వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు తుమ్మల శివరాం మోహన్ రావు చార్టెడ్ అకౌంటెంట్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత 34 సంవత్సరాల నుంచి గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నారు. ఆ వివరాలను రామ మోహన్ రావు, వెల్లడిస్తూ,తన తండ్రి



196470లలో పెదపూడి గ్రామ సర్పంచ్ గా పనిచేశారని,ఆయన జ్ఞాపకార్థంగా,గ్రామంలోని దేవాలయాలకు విరాళాలు ఇవ్వటం, గ్రామములో,రోడ్ల వెంబటి చెట్లు నాటి వాటిని పెంచడం,గ్రామంలో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం, హై స్కూల్ అభివృద్ధికి ఎంతగానో తోడ్పాటు అందించారు. గురువారం పెదపూడి గ్రామంలోని వారి నివాసంలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం, ఒక దుప్పటి, ఒక టవలు, కేజీ ఖర్జూరి పండు, ఒక జూటు సంచి, గ్రామంలోని పేదలకు 300 మందికి సహాయాన్ని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ఎల్లిపెద్ది వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, తల్లిదండ్రులను స్మరించుకుంటూ స్వగ్రామ అభివృద్ధికి కృషి చేస్తూ గ్రామస్తులకు బాసటగా నిలుస్తున్న శివ రామ మోహన్ రావు అభినందనీయులని కొనియాడారు. దివంగత తుమ్మల రామచంద్రరావు పశు పోషకుడిగా డెల్టా ప్రాంతంలో ఖ్యాతి గడిచారని తెలిపారు. వ్యవసాయాన్ని ప్రధాన ఆదాయ వనరుగా రామచంద్రరావు ముందుకు సాగుతూ గ్రామంలో ఎందరికో సహాయ సహకారాలు అందించి సర్పంచిగా గ్రామ అభివృద్ధికి ప్రత్యేక బాటలు వేసిన మహానీయుడని వెల్లడించారన్నారు .ఈ కార్యక్రమంలో కమల వరపు రాఘవరావు, షేక్ సుభాని, వేదాంతం మాధవాచారి, జాస్తి సాంబయ్య, ముప్పా వరపూ ఆనంద్, దొడ్డపనేని సుధీర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీం వర్కర్ల సమావేశం

కాకుమాను జూలై 23 (ప్రభాత వార్త): అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ వంటి సామాజిక భద్రతా పథకాలను వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కాకుమాను ప్రజాశక్తి భవన్‌లో బుధవారం సాయంత్రం సీఐటీయూ మండల కమిటీ అధ్యక్షులు కందుల శ్రీనివాసరావు అధ్యక్షతన అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథక కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్లతో శాశ్వత స్వభావం కలిగిన పనులు చేయించుకుంటున్నప్పటికీ, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు స్కీం వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని, వాటిని రద్దు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 31న గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాలో అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి వాసవి, ప్రాజెక్టు నాయకురాలు జి. ప్రేమలేఖ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ. జ్యోతి, మహాలక్ష్మి, నాగరాజు, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జూలై 31 ధర్నాను విజయవంతం చేయాలని నినాదాలు చేస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

## బాధిత మహిళ స్పందనతో అయినా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకోవాలి" - తెలుగు మహిళలు

గుంటూరు, జూలై 23,ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కృష్ణబాబు కాలనీలో జరిగిన ఘటనపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి తీరును తప్పుపడుతూ వైసీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం ..గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాధిత మహిళ స్వయంగా వాస్తవాలు వెల్లడించిన తర్వాత కూడా వైసీపీ నేతలు నీచ రాజకీయాలకు తెరలేపడం సిగ్గుచేటని మండిపడ్డారు.జరిగిన ఘటనపై ప్రభుత్వం, ఎమ్మెల్యే గళ్ళా మాధవి వెంటనే స్పందించి 24 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు



పంపించారని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సీఐపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. బాధితురాలికి న్యాయం చేయడంలో ప్రభుత్వం, ఎమ్మెల్యే చిత్తశుద్ధితో వ్యవహరించగా, దానిని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూసిన వైసీపీ నేతలు ప్రజల ముందు అభాసుపాలయ్యారని పేర్కొన్నారు.బాధిత మహిళ తనకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి అక్కలా అండగా నిలిచారని, ప్రతి రెండు గంటలకు ఒకసారి ఫోన్ చేసి పరామర్శించారని,"నీకు నేను ఉన్నాను" అంటూ ధైర్యం చెప్పారని స్వయంగా వీడియో ద్వారా వెల్లడించిందని తెలిపారు. తనకు జరిగిన అన్యాయంపై న్యాయం జరిగేలా ఎమ్మెల్యే నిరంతరం తోడుగా ఉన్నారని బాధితురాలే స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో వైసీపీ నేతల ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నారు.బాధితురాలు తన గాయాన్ని మరిచిపోవడానికి ప్రయత్నిస్తుంటే, వైసీపీ నేతలు అదే వీడియోలను పదేపదే ప్రసారం చేస్తూ ఆమె మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల గౌరవం, బాధలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. బాధితురాలే బహిరంగంగా వాస్తవాలు చెప్పిన తర్వాత కూడా కథనాలు అల్లుతూ రాజకీయాలు కొనసాగించడం వైసీపీ నాయకత్వం దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు.గళ్ళా మాధవి ఎప్పుడూ బాధితులను సాక్ష్యాలు తీసుకురావాలని అడిగి వెనక్కి పంపిన సందర్భం లేదని, ఎవరు ఏ సమస్యతో వచ్చినా ముందుగా వారి బాధను పూర్తిగా విని, అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపించే నాయకురాలని కొనియాడారు. ముఖ్యంగా మహిళల సమస్యల విషయంలో వ్యక్తిగతంగా మాట్లాడి వారి గోప్యతను కాపాడుతూ న్యాయం జరిగేలా కృషి చేస్తారని తెలిపారు.మహిళా సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా మానవతా దృక్పథంతో స్పందించడం గళ్ళా మాధవి నైజమని పేర్కొన్నారు. అలాంటి మహిళా నాయకురాలిపై మరో మహిళను అడ్డుపెట్టుకుని దుష్ప్రచారం చేయడం వైసీపీ నేతల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు.బాధిత మహిళ స్పందనతో అయినా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకుని మహిళల గౌరవాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం మానుకోవాలని తెలుగు మహిళ నాయకులు హెచ్చరించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలన్న ప్రయత్నాలను తిప్పికొడతారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పంచుమర్తి కల్పన,యార్డు డైరెక్టర్ విజయలక్ష్మి, పార్లమెంట్ పార్టీ కార్యదర్శి గంటా మౌళిక, చెంబేటి మణికుమారి, మీనాక్షి, జీవని, లక్ష్మీ జానకి, భాగ్య లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## తెనాలిలో నాలుగోరోజుకి చేరిన దస్తావేజు లేఖరుల ఆందోళన

తెనాలి మున్సిపాలిటీ జులై23(ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 396కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనలో భాగంగా తెనాలిలో దస్తావేజు లేఖరుల పెన్ డౌన్ కార్యక్రమం బుధవారం నాలుగోరోజుకు చేరుకుంది. ప్రభుత్వ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్నారు. ఈ కారణంగా తెనాలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎ న ౦ ల ౦ నిలిచిపోయాయి. ఈ పెన్ డౌన్ కార్యక్రమానికి తెనాలి సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపి మద్దతుగా నిలిచారు. జీవో 396 వల్ల దస్తావేజు లేఖరుల ఉపాధికి గండిపడుతుందని, ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళనను కొనసాగిస్తామని దస్తావేజు లేఖరులు స్పష్టం చేశారు.



## విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### మలినేని విద్యాసంస్థల చైర్మన్ పెరుమాళ్ళు.

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 23, ప్రభాతవార్త : ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుంటే భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ.. ఉద్యోగ సంస్థల డిమాండ్లను తీర్చడంలో విద్యార్థులకు కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు సహాయపడగల నాలుగు మార్గాల గురించి వివరించారు. ఉన్నత విద్య యొక్క రాబడిని అత్యంత స్పష్టంగా తెలియజేయాలని, పటిష్టమైన సహపాఠ్య కార్యక్రమాలను రూపొందించాలని, ఆత్మ పరిశీలన, సంస్కృతిని పెంపొందించుకోవాలని, సహ పాఠ్య ట్రాన్సిట్లను సృష్టించాలని విద్యార్థులకు సూచించారు. ప్రముఖ ఐటీ నియామక సంస్థ సావంటిస్ నిర్వహించిన



క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 2026-27 బ్యాచ్‌కు చెందిన 118 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన వారికి రూ.3.5 నుండి రూ.4.5 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ లభించ నుందని చెప్పారు. ఈ నియామక ప్రక్రియ రెండు విడతల్లో నిర్వహించారని, మొదటి దశలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థినులు రెండో దశలో జరిగిన సాంకేతిక మరియు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తూ వారి కృషి, అంకితభావం మరియు అధ్యాపకుల మార్గదర్శకత్వంతో ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సంస్థల్లో విద్యార్థినులు అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ విజయాన్ని ఆదర్శంగా తీసుకొని మిగిలిన విద్యార్థులు కూడా నైపుణ్యాలను పెంపొందించుకొని మరిన్ని ప్లేస్‌మెంట్ అవకాశాలను సాధించాలని కోరారు. కళాశాలకు త్వరలోనే మరిన్ని ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు క్యాంపస్ నియామకాల కోసం రానున్నాయని చెప్పారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ డా.కె.శ్వేత మాట్లాడుతూ ప్రస్తుతం పరిశ్రమల్లో నియామకాల పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ, విద్యార్థులకు ఉత్తమ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్లేస్‌మెంట్ విభాగం నిరంతరం పరిశ్రమలతో సమన్వయం చేస్తూ కొత్త కంపెనీలను కళాశాలకు తీసుకువస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కంపెనీలు క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ బృందం,మరియు విద్యార్థులు ఈ విజయాన్ని హర్షిస్తూ ఎంపికైన విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

ఇక అభివృద్ధికి చిరునామా అలీనగర్.... ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వ పాలన

అన్ని ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు... తల్లికి వందనంతో ప్రతి ఇంటా సంతోషాలు

మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

గుంటూరు, జూలై 23,ప్రభాతవార్త :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటా చదువుల పంటగా మారిందని, తల్లికి వందనం అందుకున్న కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక అలీనగర్, సాయినగర్, వెంకటేశ్వర కాలనీ, శ్రీనివాస కాలనీ ప్రాంతాల్లో రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల ఆలోచన మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని



తెలిపారు. అన్ని డివిజన్లలో అభివృద్ధితోపాటు శానిటేషన్ పైనా దృష్టి సారించామని చెప్పారు. క్షేత్రస్థాయిలో కూటమి నాయకులతో కలిసి పర్యటిస్తున్నామని, ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యార్థులు ఉన్న ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందన్నారు. తల్లికి వందనం నిధులు జమ కావడంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు బెంగ లేకుండాపోయిందని తెలిపారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నారని చెప్పారు. నేడు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నారని, దీని ద్వారా విద్యార్థుల సామర్థ్యాల మదింపు సాధ్యమవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా పునాదులు వేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాడునేడు కార్యక్రమం పేరిట దోచుకోదాచుకో చందాన వ్యవహరించారని విమర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను మోడల్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా పాఠశాలల్లో ఇబ్బందులు తలెత్తితే వెంటనే తనను సంప్రదించాలని సూచించారు.

# తిరుమల సమాచారం

## 31న టిటిడి ఖాళీ గోనె సంచుల ఇ-వేలం



**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలవేంకటేశ్వరస్వామి ఆలయంతో బాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో వినియోగించిన ఖాళీ గోనె సంచులను ఇ వేలం వేయనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి 2027 మార్చి 31 వరకు "రేట్ కాంట్రాక్ట్" ప్రాతిపదికన విక్రయించేందుకు ఈనెల 31న ఇ వేలం నిర్వహించనున్నట్లు టిటిడి తెలిపింది. ఈ వేలంలో పాల్గొనదలచిన ఆసక్తిగల వ్యక్తులు, సంస్థలు ఈనెల 30వ తేదీ సాయంత్రం లోపు కొనుగోలు పోర్టల్ ద్వారా 30వేల రూపాయలు ఇఎండీ చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ వేలానికి సంబంధించిన పూర్తి వివరాలను హెచ్‌టిటిపిఎస్://కొనుగోలు.ఎపి.జివొవి.ఇన్" వెబ్‌సైట్ ను సందర్శించవచ్చు. అదనపు సమాచారం కోసం టిటిడి జనరల్ మేనేజర్ (వేలాలు) కార్యాలయాన్ని 0877-2264429 నంబర్‌లో సంప్రదించగలరు.

## శ్రీవాణి బ్రేక్ భక్తులకు తిరుమలలో లాంజ్

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొం డలవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులతోబాటు ప్రతిరోజూ శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనానికి విచ్చేస్తున్న 1,500మంది భక్తులకు సులభంగా విశ్రాంతి తీసుకునేలా లాంజ్ ఏర్పాటుచేయాలని టిటిడి భావిస్తోంది. విమా నాశ్రయంలో ప్రయాణీకులు వేచివుండే లాంజ్‌లా తిరుమలలోనూ శ్రీవాణి భక్తులకు కల్పించాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పరిశీలించారు. ఉదయం టిక్కెట్‌లు అందుకునే భక్తులేగాక ముందుగా ఆన్‌లైన్‌లో విడుదలైన ఈ దర్శన టిక్కెట్లతో వస్తున్న భక్తులకు గదులు సమకూర్చడం కొంత క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఉదయం నుండి సాయంత్రం 4గంటల వరకు దర్శనానికి వెళ్ళే వరకు ఈ భక్తులు ఎక్కడ విశ్రాంతి తీసుకోవాలనేది సమస్యగా మారింది. శ్రీవాణి భక్తుల కోసం నూతన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీవాణి దర్శన టికెట్లు మూడు నెలల ముందు 500 ఆన్ లైన్‌లో ,ప్రతి రోజు 500 కరెంట్ బుకింగ్ ఆన్‌లైన్‌లో, మరో 300 గతంలో విరాళాలిచ్చి టికెట్లు పొందని వారి కోసం కేటాయిస్తున్నారు. మరో 200 టికెట్లు రోజూ తిరుపతి విమా నాశ్రయంలో ఆఫ్ లైన్‌లో ఇస్తున్నారు. ఈ టికెట్లు పొందిన భక్తులకు గదులు కేటాయిస్తున్నారు. కరెంట్ బుకింగ్ లో టికెట్లు పొందిన వారికి అదే రోజు సాయంత్రం 4 గంటలకు టిటిడి దర్శనం కల్పిస్తోంది. ఉదయం 9 గంటలకు టికెట్లు తీసుకున్న భక్తులు సాయంత్రం 4 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తోంది. వారికి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విమా నాశ్రయం తరహాలో శ్రీవాణి భక్తులు వేచి ఉండేందుకు లాంజ్ నిర్మాణం చేయాలని ఆలోచన చేస్తున్నారు. రానున్న టిటిడి బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలు తయారుచేసి ఆమోదించే అవకాశం ఉంది.

## భవిష్యత్తులో ఇలాంటి అపచారాలు పునరావృతం కాకుండా చర్యలు: మంత్రి ఆనం

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల మొదటిఘాట్ రోడ్డులోని 7వ మైలు వద్ద ఇంజనేయస్వామి ఒక అడుగు విగ్రహ అపహరణకేసును కొన్ని గంటల్లోనే తిరుమల పోలీసులు చేదించడం అభినందనీయమని రాష్ట్రదేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు దేవాలయాల వద్ద భద్రతను పటిష్ఠం చేయాలని ఆయన ఆదేశాలిచ్చారు. పక్కా ప్రణాళికతో వేగవంతమైన దర్యాప్తు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతో బాటు, స్వామి విగ్రహాన్ని సురక్షి తంగా స్వాధీనం చేసు కోవడం పోలీసుల సమర్థతకు, అంకితభావానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. తిరుమల వంటి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పవిత్రమైన ఆధ్యాత్మిక క్షేత్రాల్లో భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి అన్నారు. తిరుమలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన దేవాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను తక్షణమే పటిష్ఠం చేయాలని సంబంధిత దేవాదాయ, పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణాల్లో సిసిటీవీ నిఘాను నిరంతరం పర్యవేక్షి ంచాలని, భద్రతా సిబ్బంది గస్తీని పెంచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. దేవతా విగ్రహాలను అపహరించడం,ఆలయ ఆస్తులు, సెంటిమెంట్లతో ఆడుకునే దుశ్చర్యలకు పాల్పడే వారిపై కూటమి ప్రభుత్వం అత్యంత కఠినమైన వైఖరిని అవలంబిస్తుందని మంత్రి హెచ్చ రిం చారు. కోట్ల మంది భక్తుల నమ్మకాలకు, భావోద్వేగాలకు భంగం కలిగించే ప్రయ త్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని తేల్చిచెప్పారు. భవి ష్యత్తులో ఏ పుణ్యక్షేత్రంలోనూ ఇలాంటి అపచారాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన



## శాస్త్రోక్తంగా ఆంజనేయవిగ్రహం పునఃప్రతిష్ఠ

**తిరుమల,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సమీపంలో చోరీకి గురైన ఆంజనేయ స్వామి విగ్రహాన్ని గురువారం ఉదయం యధావిధిగా శాస్త్రోక్తంగా పున:ప్రతిష్టాపన చేశారు. ఇక్కడ పూజలందుకునే విగ్రహాన్ని చోరీ చేసిన విషయం విదితమే. పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో టిటిడి అర్చకులు తిరిగి అంతే వేగంగా పున:ప్రతిష్టించే పనులు చేపట్టారు. టిటిడి ఆగమ సంప్రదాయాల ప్రకారం పుణ్యాహ వచనం, జల సంప్రోక్షణం తదితర శాస్త్రోక్త క్రతువులు నిర్వహించి, గురువారం ఉదయం అదే ప్రదేశంలో విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించినట్లు టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. ఈ ఘటనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సిసి కెమెరాల నిఘా, విజిలెన్స్ సిబ్బంది అప్రమత్తత, జిల్లా పోలీసులతో సమన్వయం కారణంగా అత్యంత తక్కువ సమయంలో నిందితుడిని గుర్తించి విగ్రహాన్ని తిరిగి తీసుకురావడం సాధ్యమైందని అదనపు ఇఒ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఘాట్ రోడ్డులోని చిన్న దేవాలయాలు, విగ్రహాలకు రక్షణగా గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో పాటు మరింత నాణ్యమైన సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి ్మ,తిరుమల ఎఎస్పీ రామకృష్ణ,విఎస్ఒ సురేంద్ర, ఇతర అధికారులు,అర్చకులు పాల్గొన్నారు.

## విగ్రహం మాయం వెనుక భూమన హస్తం

### జనసేన నేత కిరణ్ రాయల్ సంచలన వ్యాఖ్యలు



**తిరుపతి,జులై 23ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంట కట్టుదిట్టమైన భద్రత ఉన్న తిరుమల ఘాట్‌లో ఏడవమైలు వద్ద ఆంజనేయస్వామి విగ్రహాన్ని చోరీచేసుకెళ్ళిన ఘటన వెనుక వైసిపి నేత భూమన హస్తం ఉందని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి నేత కిరణ్‌రాయల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుమల నడక మా ర్గంలో విగ్రహ మాయంపై భూమన అనవసర రార్ధాంతం చేశాడని,ఆవిగ్రహం మాయం చేయడం వెనుక భూమన హస్తం ఉందన్న అనుమానం ఉందని ఆరోపణలు చేశారు. 2019-24మధ్య వైసిపి హయాంలో భూమన తిరుపతి పరిసరాల్లో భారీగా భూకబ్జాలకు పాల్పడ్డారని, 1వందకోట్ల విలువచేసే భూ ములను కబ్జా చేశారని ఆరోపించారు. తిరుపతి పరిసరాల్లోని మంగళం, తిరుచానూరులో 16ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారని కిరణ్‌రాయల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో భూమన బాధితులు చాలా మంది ఉన్నారని, భూమన బాధితులు ముందుకు రండి భూకబ్జాకు పాల్పడలేదని భూమన ఇప్పుడు ప్రమాణం చేయగలడా..? అని ప్రశ్నించారు.

# క్వాంటం పరిశోధనలకు అమరావతి అత్యుత్తమం

### సిఎం చంద్రబాబుతో క్వాంటినమ్ టెక్నాలజీస్ సిఇఒ రాజీబ్ హజ్రా భేటీ



సీఎం చంద్రబాబుతో భేటీ అయిన క్వాంటినమ్ టెక్నాలజీస్ సీఈఓ రాజీబ్ హజ్రా

**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** క్వాంటం కంప్యూటింగ్ సహా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ టెక్నాలజీగా క్వాంటం కంప్యూటింగ్ రంగాన్ని గుర్తించి అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పని చేయటం ప్రారంభిస్తుందని, ఇప్పటికే క్వాంటం టెస్టింగ్ ఫెసిలిటీలు ఏపీలో పని ప్రారంభించాయని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి ఫుల్‌స్టాక్ క్వాంటం కంప్యూటింగ్ కంపెనీ క్వాంటినమ్ సంస్థ సీఈఓ రాజీబ్ హజ్రా సహా ఆ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అమరావతి క్వాంటం వ్యాలీని క్వాంటం ఇన్నోవేషన్ సహా పరిశోధనలు తదితర అంశాల్లో కీలకమైన హబ్ గా తయారు చేసేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో క్వాంటినమ్ సంస్థ సీఈఓ చర్చించారు. జాతీయ క్వాంటం మిషన్ కు అనుగుణంగా ప్రపంచస్థాయి ఎకోసిస్టంను అభివృద్ధి చేసేందుకు ఏపీతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు క్వాంటినమ్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. క్వాంటం నైపుణ్యాలు, ఏఐ ఎనేబుల్డ్ క్వాంటం అప్లికేషన్లు, అడ్వాన్స్ కంప్యూటింగ్ రీసెర్చి, స్టార్టప్ ఇంక్యుబేషన్ టెక్నాలజీలపై పనిచేయాలని సీఎం సూచించారు. గతంలో ఐటీని ప్రోత్సహించామని ఇప్పుడు ఏఐ, క్వాంటం టెక్నాలజీల ద్వారా వేగంగా సమస్యలకు పరిష్కారం అందించాలన్నదే తమ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. క్వాంటం పరిశోధనలకు ఏపీ అమరావతి అత్యుత్తమ ప్రాం తమని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో క్వాంటం కంప్యూటర్ పరికరాల ఉత్పత్తితో పాటు అల్గారిథమ్స్ వరకూ సహకారం అందించేందుకు తాము సిద్ధమని క్వాంటినమ్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు సీతారామకృష్ణ, అమరావతి క్వాంటం మిషన్

### గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో

# నీటి సమస్యలకు చెక్: మంత్రి పార్థసారధి



మంత్రి పార్ధసారధి, కమిషనర్ విశ్వనాథన్

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** గోదా వరి, కావేరి నదుల అనుసంధానంతో మంచి, సాగునీటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని రాష్ట్ర సమాచార,పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురు వారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి వెల్లడించారు. క్యాబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు పలు సమస్యలపై దిశానిర్దేశం చేశారని ముఖ్యంగా ఎల్ నినో ప్రభావంతో రైతులు సాంప్రదాయ పంటలు వేయటం వల్ల సకాలంలో సాగు నీరు అందక పోతే నష్టపో తారన్న అభిప్రాయం ముఖ్యమంత్రి వ్యక్తం చేశారని తెలిపారు.ఈ ఏడాది ఎల్ నినో ప్రభా వం ఆగస్టు తరువాత మరింత తీవ్రంగా ఉం డనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారన్నారు.ఈ ఏడాది సాధారణం కంటే 51 శాతం కంటే ఎక్కువగా వర్షపాతం తగ్గుదల ఉంటుందని, దీంతో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కావున రైతులు ఈ ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొనే ఆరుతడి పంటల సాగు వైపు మొగ్గు చూపాలని తద్వారా ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చని సూచిం చారు. అంతేకాకుండా భూగర్భ జలాలు సైతం అడుగంటే ప్రమాదం పొంచి ఉందని హెచ్చ రించారు.బోర్లు వేసి వ్యవసాయం చేద్దాం అనే ఆలోచనను రైతులు చేయవద్దని కోరారు.దీంతో భూగర్భ జలాలు మరింత అటుగంటే ప్రమాదం పొంచి ఉందని మంత్రి పార్థసారథి అన్నారు. పోలవరం వద్ద గోదావరి నది ప్రతి ఏడాది ఈ సమయానికి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద నీరు ప్రవహించేదని కాని ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడటంతో ఈ ఏడాది కేవలం 35 నుండి 38వేల క్యూసెక్కుల వరద నీరు మాత్రమే ప్రవహిస్తోందని దీంతో గోదావరి,కృష్ణా పరివాహక ప్రాంతాల్లో సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఒక వేళ మంచి వర్షాలు పడితే మంచిదే కాని ఎల్ నినో ప్రభావం పై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోదావరి, కృష్ణా జలాలతో సాగు చేసే రైతులు ఇప్పటికే 70శాతం మంది రైతులు నాట్లు వేశారని, కాని ఇప్పటి వరకు నాట్లు వేయని రైతు లు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంపై కేం ద్రం సానుకూ లంగా ఉండటం హర్షనీయమన్నారు. నదుల అనుసంధానం తెలంగాణా,ఏపి,తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనకరంగా ఉం టుందని, అంతే కాకుండా ఈ నాలుగు రాష్ట్రా ల్లోని రైతులకు మరింత ప్రయోజనం చేకూరు తుందని ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నా రన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు గేమ్ ఛేంజర్ గా నిలవనుందని, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమానా శ్రయాన్ని ప్రారంభించ నున్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభు త్వం సిద్ధం చేస్తోందన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సం చాలకులు కెఎస్.విశ్వనాధన్ పాల్గొన్నారు.

## రూ.5,092కోట్లతో ట్రాన్స్‌కో గ్రిడ్ బలోపేతం

### ప్రాజెక్టుల పురోగతిపై విజయానంద్ సమీక్ష



**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ప్రసార వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీట్రాన్స్‌కో చేపడుతున్న 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ ఎక్స్‌ట్రా హై వోల్టేజ్ ప్రసార ప్రాజెక్టుల పురోగతిపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ , డైరెక్టర్లు ఏ వి కె భాస్కర్, జీవి రావు, వెంకట రమణ మూర్తి, సీ ఈలు, యస్ఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అమలులో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, రానున్న పెట్టుబడులు, భవిష్యత్ కార్యాచరణ, కీలక ప్రసార మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రూ.5,092 కోట్ల అంచనా వ్యయంతో 60 ప్రధాన ప్రసార ప్రాజెక్టులు వివిధ దశల్లో అమలులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రానికి అదనంగా 14,296 ఎంవీఏల ట్రాన్స్‌ఫర్మేషన్ సామర్థ్యం, 1,760 సర్క్యూట్ కిలోమీటర్ల ప్రసార లైన్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. దీంతో విద్యుత్ ప్రసార సామర్థ్యం మరింత పెరగడంతో పాటు ప్రాంతాల మధ్య గ్రిడ్ అనుసంధానం బలోపేతమై, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా, విశ్వసనీయంగా మారనుందని వివరించారు. త్వరలో పూర్తి కానున్న ప్రాజెక్టులపై కూడా విజయానంద్ సమీక్ష నిర్వహించారు. రూ. 3,507 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 36 ప్రధాన ప్రసార ప్రాజెక్టులు (400 కేవీ, 220 కేవీ, 132 కేవీ) రానున్న ఆరు నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయని తెలిపారు.



నవమల్లెతీగను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత

## సామాజిక ప్రయోజనమే సాహిత్యానికి హేతువు: మంత్రి సవిత

**విజయవాడ,జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక ప్రయోజనమే సాహిత్యానికి హేతువుగా నిలవాలని ఏపీ చేనేత,జౌళి,హస్తకళలు,బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు.ఏ ప్రక్రియలో రాసినప్పటికి సాహిత్యం జనజాగృతంగా ఉండాలన్నారు.సమకాలీన పరిస్థితులతో పాటుగా,గతాన్ని గుర్తు చేస్తూ, వర్తమానంలో చోటు చేసుకున్న అవగతం చేసుకుంటూ రేపటి తరానికి మంచి వారధిని నిర్మించే దిశలో రచనలు ఉండాలన్నారు.రచయిత,రచయిత్రి స్వేచ్ఛగానే తమ భావవక్తీకరణ చేయాలని, అయితే ఇతరుల భావోద్వేగాలకు భంగం కలిగించకూడదన్నారు. కలిమిశ్రీ సంపాదకత్వంలో నవమల్లెతీగ శత సంచికని ఏపీ సచివాలయంలో సవిత ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రముఖ చిత్రకారుల ముఖచిత్రాలతో ఇలాంటి ప్రత్యేక సంచికలు వెలువరించేవన్నారు. ప్రచురణలు కనుమరుగవుతున్న నేటి కాలంలో ప్రత్యేక సంపుటికి తీసుకురావడం గొప్ప సాహసమన్నారు. సాహిత్యాన్ని ప్రధానంగా చేసుకుని సాహితీవేత్తలతో పాటు యువతను, మహిళలను అన్నిరకాల పాఠకుల్ని ఆకట్టుకునే విధంగా పత్రికను రూపొందిస్తున్న సంపాదకులను అభినందించారు.

## జొన్నగిరి ఇకపై 'స్వర్ణగిరి' గోల్డ్ మైన్స్

### అధికారికంగా పేరు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం

**విజయవాడ, జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లాలోని జొన్నగిరి గోల్డ్ మైన్ పేరును రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 'స్వర్ణగిరి గోల్డ్ మైన్'గా మార్చింది. జొన్నగిరి గోల్డ్ మైన్ పేరును అధికారికంగా మార్చాలని రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తి చేయగా ఆ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. ఇకపై మైనింగ్ ప్లాన్‌లు, చట్టపరమైన అనుమతులు, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ , పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ తదితర అధికారిక రికార్డుల్లో కూడా స్వర్ణగిరి గోల్డ్ మైన్' పేరును నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.దేశంలో స్వాతంత్రం వచ్చిన తర్వాత ప్రైవేట్ రంగంలో ఏర్పాటైన తొలిబంగారు గనిగా గుర్తింపు పొందిన ఈ గని భవిష్యత్తులో ప్రముఖ బంగారం ఉత్పత్తి కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. కర్నూలుజిల్లా తుగ్గలి మండలం పరిధిలోని పగిడిరాయి, జొన్నగిరి, ఎర్రగుడి గ్రామాల సరిహద్దుల్లో ఈ బంగారు గని విస్తరించి ఉంది. మొత్తం 597.820 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ గనిలో ప్రధానంగా బంగారాన్ని వెలికితీస్తున్నారు. దీంతో పాటు వెండి, రాగి, సీసం, జింక్ వంటి ఇతర ఖనిజాలనుకూడా తవ్వుతున్నారు.బంగారం వెలికితీత కోసం జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రభు త్వం 30 సంవత్సరాల మైనింగ్ లీజును మంజూరు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈయేడాది జూన్‌లో గనిని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన ప్రాసెసింగ్ ప్లాంట్‌లో వాణిజ్య బంగారం ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు.

## ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి: మంత్రి గొట్టిపాటి



**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి త్వరలోనే ఒక అంత ర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేసారు. త్వరలోనే ఇక్కడ భారీ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు ప్రముఖ కళాశాలలు ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. అమరావతిలో భవనాల నిర్మాణాలు అద్భు తంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఇది అత్యంత అద్భుతమైన నివాస యోగ్యమైన నగరంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఐకానిక్ భవనాలకు సంబంధించిన మొదటి డైమండ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి 12 ఫ్లోర్లు సిద్ధమవుతాయని ప్రకటించారు. రాజధాని విషయంలో వైసీపీ అధినేత జగన్ అనవసర గందరగోళం సృష్టిస్తూ ప్రజలను తికమక పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. జగన్ కనీసం ఒక్కసారైనా నేరుగా వచ్చి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లారా చూడాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రైతుల చలవ వల్లే ఈరోజు అమరావతిలో ఇంతటి భారీ నిర్మాణాలు సాధ్యమ వుతున్నాయని మంత్రి కొనియాడారు. వారి త్యాగాలను కూటమి ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు.

### మాజీ మంత్రి అప్పలరాజు అరెస్టుతో

# పలాస-కాశీబుగ్గలో ఉత్కంఠ

### 144 సెక్షన్ అమలు, పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రహదారులన్నీ దిగ్బంధం

### పేరాడ తిలక్‌పై పోలీస్ కేసు నమోదు

**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 23 ప్రభాతవార్త :** పలాస కాశీబుగ్గ మున్సి పాలిటీ ఇంగిలిగాం పారిశ్రామిక వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని కూడా రాజకీయ కక్ష సాధింపు కోసం ఆయుధంగా మార్చుకునే స్థాయికి కూటమి ప్రభుత్వం దిగజారిపోయిందనే ఆరోపణలు పలాస నియోజక వర్గం వైసిపి శ్రేణుల్లో వినిపిస్తున్నాయి. మాజీ మంత్రి డా.సీదిరి అప్పలరాజు రెండవ కుమారుడు 18 యేళ్ల అరవ్ వర్మ ద్విచక్ర వాహనం నడుపుతూ రోడ్డు ప్రమా దానికి కారకుడయ్యాడన్న ఆరోపణలపై రోడ్డు ప్రమాదానికి సంబంధించిన సెక్షన్లు కాకుండా, ఏకంగా హత్యానేరం అభియోగాలు మోపి అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించడం జరిగింది. అయితే అదే కేసులో ఏ3 ముద్దాయిగా ఉన్న డా. సీదిరి అప్పలరాజును బుధవారం రాత్రి అరెస్టు చేయడం చూస్తే ఒక మత్స్యకార వైసీపీ నాయకుడి కుటుంబాన్ని రాజకీయంగా వేధించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా మారిందని ఈ సంఘటనతో తేటతెల్లమైందని వైసిపి నాయకులు పేర్కొంటున్నారు. మరి టీడీపీ నాయకులు, మంత్రులు, వారి కుటుంబ సభ్యులు, అనుచరుల వలన జరిగిన రోడ్డు ప్రమాదాలన్నింటికీ ఇదే సిద్ధాంతం వర్తింపజేస్తారా..? అని వైసీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రశ్నిస్తున్న నాయకులను కేసుల్లో ఇరికించి వారి గొంతునొక్కాలన్నదే ఈ అరెస్టుల వెనుక కనిపిస్తున్న కుట్ర అని పలువురు పేర్కొంటున్నారు.

**వైసిపి నాయకుడు పేరాడ తిలక్ అరెస్ట్ :** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించిన సందర్భంగా బుధవారం రాత్రి సుమారు 2 గంటలకు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజు అరెస్టును నిరసిస్తూ కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద వైసీపీ పార్టీ కి చెందిన పేరాడ తిలక్ మరి కొంత మంది అనుచరులతో కలిసి నినాదాలు చేస్తూ మానవహారం నిర్వహించి సాధారణ ప్రజానీకం రాకపోకలను అడ్డుకొన్నారు. ఈ సమయంలో అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది మానవహారం చేయవద్దని తెలిపారు. అయితే అక్కడ నుండి తప్పుకోమని పోలీసులను బెదిరించి వారి విధులకు ఆటంకం కలిగించడం వలన విధులలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ వైసీపీ నాయకులు తమ విధులకు ఆటంకం కలిగించారని పేరాడ తిలక్, అతని అనుచరులు కొంత మందిపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి వైసీపీ నేత పేరాడ తిలక్‌ను



పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.

పలాసలో 144 సెక్షన్ అమలు: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అరెస్ట్ కు నిరసనగా పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యగా కాశీబుగ్గ పోలీసులు 144 సెక్షన్ ను అమలు చేశారు. ఎమర్జెన్సీ ని తలపించే విధంగా పోలీస్ స్టేషన్ కు వెళ్లే రహదారులలో బారికేడ్లు పెట్టి భారీగా పోలీసు లను మోహరించారు. దీని వలన ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. కాగా రాత్రి అదుపులోకి తీసుకున్న డాక్టర్ అప్పలరాజును గురువారం 12 గంటల వరకు పోలీస్ స్టేషన్ లోనే ఉంచారు. ఈ సమాచారం తెలుసుకున్న వైసిపి పార్టీ శ్రేణులు పోలీస్ స్టేషన్ కు తరలి వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. డాక్టర్ అప్పలరాజుకు వైద్య పరీక్షలు అనంతరం పలాస కోర్టు కు తీసుకువెళ్లి సబ్ జడ్జి ముందు హాజరు పరిచారు.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్)**

AU SMALL FINANCE BANK — A SCHEDULED COMMERCIAL BANK

నమోదిత కార్యాలయం: 19-ఎ, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001(CIN:L36911RJ1996PLC011381)

**అనుబంధం IV (నిబంధన 8(1) చూడండి) స్వాధీనతా ప్రకటన**

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" ఏప్రిల్ 01, 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో విలీనం అయిందని ఋణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియచేయడానికి ఇది. అయితే, కింద సంతకం చేసిన వ్యక్తి "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడిన సెక్షన్ 13(12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. ఆ నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు, క్రింద ఇవ్వబడిన పట్టికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం, ఆ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలి.

| ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/ తనఖాదారు/హామీదారుపేరు/ఋణ ఖాతా నం. | 13(2) నోటీసు తేది మరియు మొత్తం | స్వాధీనం చేసుకున్న తేది |
|---|---|---|
| (Loan A/C No.) 23660000587953, కంచర్ల భవాని శంకర్ (ఋణగ్రహీత) కంచర్ల రమణమ్మ (సహ-ఋణగ్రహీత) కంచర్ల శ్రీను (సహ-ఋణగ్రహీత) | 25-జూన్-24 రూ.5,51,074/-, ఐదు లక్షల యాభై ఒక్క వేల డెబ్బై నాలుగు రూపాయలు మాత్రమే 20-జూన్-24 నాటికి | 19-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: పల్నాడు జిల్లా, నరసరావుపేట రెవెన్యూ డివిజన్ - వినుకొండ సబ్‌డివిజన్ - నూజెండ్ల మండలం - పువ్వాడ గ్రామ పంచాయతీ, పువ్వాడ గ్రామం, డి.నెం. 29/1A ఇంటి నెం. 3-36 అసెస్‌మెంట్ నెం. 343లో 2500 చదరపు లింకులు లేదా 121 చదరపు గజాలు లేదా 101.64 చదరపు మీటర్ల విస్తీర్ణం గల స్థలం అన్ని రాకపోకలు మరియు సులభతర వినియోగ హక్కులతో సహా. ఈ సరిహద్దుల మధ్య ఉన్న స్థలం వివరాలు: తూర్పున: పంచాయతీ స్థలం, పడమరన: వల్లగుంట్ల లింగారావు గారి ఆస్తి, ఉత్తరాన: కంచర్ల తిరుమలబాయి గారి ఆస్తి, దక్షిణాన : వల్లగుంట్ల లింగారావు గారి ఆస్తి. | | |
| (Loan A/C No.) 23630000066394, తిప్పబత్తిన గంగాధరరావు (ఋణగ్రహీత) తిప్పబత్తిన ప్రేమజ్యోతి (సహ-ఋణగ్రహీత) | 04-ఫిబ్రవరి-26 రూ.8,79,348/-, ఎనిమిది లక్షల డెబ్బై తొమ్మిది వేల మూడు వందల నలభై ఎనిమిది రూపాయలు మాత్రమే 03-ఫిబ్రవరి-26 నాటికి | 18-జూలై-26 |
| తనఖా పెట్టిన ఆస్తి వివరణ: బాపట్ల జిల్లా - ఒంగోలు రెవెన్యూ డివిజన్ - దరి సబ్-డివిజన్ - అద్దంకి మండలం - కోటికలపూడి గ్రామ పంచాయతీ పరిధి - కోటికలపూడి గ్రామం, సర్వే నం. 135/6 - కోటికలపూడి గ్రామం, ఇంటి నం. 2-108. ఇందులో ఉన్న RCC ఇల్లు మరియు స్థలంతో కూడిన 0-05 ఎకరాలు లేదా 242 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం; ఈ సరిహద్దుల మధ్య 0-05 ఎకరాలు లేదా 242 చదరపు గజాల స్థలంలో, అన్ని అమరికలు మరియు అనుబంధ హక్కులతో కూడిన 260 చదరపు అడుగుల RCC భవనం ఉంది. సరిహద్దులు: తూర్పున - తిప్పబత్తిన కృష్ణయ్య గారి ఇల్లు, పడమరన - తిప్పబత్తిన నాగరాజు గారి ఇల్లు, ఉత్తరాన - తిప్పబత్తిన [illegible] గారి ఇల్లు, దక్షిణాన - పంచాయతీ రోడ్డు. | | |

ఋణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదవబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకం చేసిన వ్యక్తి స్వాధీనం చేసుకున్నాడని ఋణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8(6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు ఋణగ్రహీత దృష్టిని ఆహ్వానించబడ్డాడు".

ముఖ్యంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు చేయరాదని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేది: 23/07/2026 ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్ సం/- అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్.

24-7Pg6exHMNWJQE_24-7Pg6exHMNWJQE.qxd 23/Jul/26 11:50 PM Page 1



# జి.ఓ నం.3ని పునరుద్ధరిస్తాం

## గిరిజనుల ప్రయోజనాలు పరిరక్షిస్తాం: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**విజయవాడ,జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా బలమైన చట్టం తీసుకొస్తామని ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. గిరిజన సంఘాల నుంచి వచ్చిన సూచనలు, వినతులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గుమ్మిడి సంధ్యారాణి, ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ జీవో నంబర్3 పునరుద్ధరణతో పాటు గిరిజనుల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జీవో నంబర్3కు కూటమి ప్రభుత్వం గానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగానీ ఏనాడూ వ్యతిరేకం కాదని, ఆదివాసీలకు శాశ్వత న్యాయం జరిగేలా చట్టపరంగా బలమైన పరిష్కారం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జీవో చరిత్రను వివరిస్తూ.. 1986లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జీవో275 ద్వారా గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం 2000 లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో నంబర్3ను ప్రవేశపెట్టి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులను 100 శాతం స్థానిక గిరిజనులకే కేటాయించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.సుప్రీంకోర్టులో జీవో నంబర్ 3 రద్దుకు గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో3 పునరుద్ధరణకు నూటికి నూరు శాతం సానుకూలంగా ఉన్నారని, ఈసారి తీసుకొచ్చే చట్టం కోర్టుల్లోనూ నిలిచేలా అందరూ సహకరించాలని మంత్రి కోరారు. గిరిజనుల భూహక్కులను పరిరక్షించే 1/70 చట్టం ఉందని అది వారి ప్రాథమిక హక్కు అని, దానిని ఏ ప్రభుత్వం కూడా పక్కన పెట్టబోదని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను గిరిజనులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# ఎండుతున్న పంటలు..కుములుతున్న రైతులు

## ఎల్‌నినోతో తగ్గిన నీటిమట్టం

## ఫసల్ బీమాకు అధికారులు సూచనలు


**శ్రీకాళహస్తి,జూలై 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో గురువారం ఆచార్య ఎన్.జి రంగా యూనివర్సిటీ సీనియర్ శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించారు. ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో శ్రీకాళహస్తి వ్యవసాయడివిజన్లో రైతులు సుమారు 33వేల ఎకరాల్లో వరిపంటను వేసారు. శ్రీకాళహస్తి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో రైతులు ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఆదేశాలను ఖాతరు చేయక వరిపంటను పోలో మని సాధారణ విస్తీర్ణంకన్నా అధికంగా పంటలు వేసారు.ఎల్‌నినో ప్రభావంతో పంట పిలక దశ నుంచి పరిపక్వత దశకు చేరుకుంది. ఈ పరిస్థితిలో నీటి కొరతతో చేతికొచ్చిన పంట కళ్ళ ముందే ఎండుతుంటే రైతులు తల్లడిల్లుతున్నారు. అనూహ్యంగా బోర్లలో నీరు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతుండటంతో వ్యవసాయశాఖ సహాయ సంచాలకు రమేష్‌రెడ్డి వారి సహకారంతో అన్ని మండలాల్లో పంటల పరిస్థితిని పరిశీలించారు. నివేదికలు తయారు చేస్తున్నారు. రైతులకు అవగాహన కల్పిస్తూ 'పంటల బీమాను' తప్పని సరిగా చేసుకోవాలని ఆగస్టు 15వరకు అవకాశం ఉందని చైతన్య పరుస్తున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు, ఏర్పేడు మండలంలోని దుర్గసముద్రం గ్రామాల్లో వేలకొద్దీ ఎకరాల్లో వేసిన వరి పంట ఎండుతుండటంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈసందర్భంగా దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతలు మాట్లాడుతూ తాము ముందస్తుగానే మేనెలలోనే వరి పంటను వేస్తా మన్నారు. జూన్ నెలలో ఊహించని విధంగా ఎండలతో చెరువులు ఎండాయని బోర్ల నీరు అడుగంటి పోయిందని శాస్త్రవేత్తలకు వివరించారు.

**రైతులకు పలు సూచనలు:**

ఎండుతున్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు అన్నదాతలకు పలు సూచనలు చేస్తూ విత్తనాలు,పురుగుమందులు, ఎరువులు కొనుగోలు చేయాలన్నా అన్నదాత సుఖీభవ, ఎంఎస్‌పి, ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన స్కీం కింద ఇన్సూరెన్స్ లబ్ధి పొందాలన్నా, తప్పని సరిగా ప్రతి ఒక్క రైతు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని కోరారు. అంతేకాక ఎల్‌నినో ప్రభావంతో ఎండలుఅధికమై నీరు ఆవిరిగా మారి బోర్లు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం సహాయం అందాలంటే ప్రతి రైతు తమ పంటకు పంట బీమా చేసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనల్లో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిమ, డాక్టర్ సంధ్యారాణి, సహాయ సంచాలకులు ధనయ్యరెడ్డి, శ్రీకాళహస్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.రమేష్‌రెడ్డితో కలిసి విస్తృతంగా పరిశీలించారు. ఏర్పేడు వ్యవసాయాధికారి మమతారెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది తేజస్విని, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం వరి పంటను పరిశీలిస్తున్న ఆచార్య రంగా వర్సిటీ శాస్త్రవేత్తలు



గురువారం న్యూఢిల్లీలో బిజెపి కార్యనిర్వాహక కార్యదర్శి బిఎల్ సంతోష్‌తో జనసేన ఎంపిలు

# బిఎల్ సంతోష్‌ని కలిసిన జనసేన ఎంపీలు

**విజయవాడ.జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతాపార్టీ ప్రధాన (ప్రచార) కార్యదర్శి బి ఎల్ సంతోష్ ని గురువారం ఢిల్లీలో జనసేన ఎంపీలు లింగమనేని రమేష్ , వల్లభనేని బాల శౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంతోష్‌ని జనసేన ఎంపీలు సత్కరించారు. మోడీ నాయకత్వంలో భారత దేశ అభ్యున్నతికి కూటమి పక్షాలన్నీ సంఘటితంగా కృషి చేద్దామని సంతోష్ వ్యాఖ్యానించారు.

# విజయవాడ, విశాఖపట్నంలో కేంద్ర జిఎస్‌టిఎటి బెంచ్‌ల ప్రారంభం

**విజయవాడ,జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్‌టీఏటీ) విజయవాడ, విశాఖపట్నం బెంచ్‌లు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర జీఎస్‌టీఏటీ ఉపాధ్యక్షులు. సభ్యులు (న్యాయ), (ఆంధ్రప్రదేశ్) భాస్కర్ రెడ్డి వేమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంచ్‌ల ప్రారంభోత్సవం ఒక చారిత్రక మైలురాయి అన్నారు. రెండు బెంచ్‌లలోనూ అప్పీళ్ల విచారణలు ప్రారంభోత్సవం జరిగిన అదే రోజే ప్రారంభమయ్యాయన్నారు. పన్ను చెల్లింపుదారులకు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన న్యాయాన్ని అందించడంతోపాటు, కేంద్ర జీఎస్‌టీ అప్పీళ్ల విచారణలో ఏకరూపత, సమర్థతను నిర్ధారించడం పట్ల ట్రిబ్యునల్ నిబద్ధత కలిగి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీఏటీ (ఆంధ్రప్రదేశ్) సభ్యులు (సాంకేతిక) సతీష్ కుమార్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఎ.బాబు, స్పెషల్ కమిషనర్ నూతులపాటి సౌమ్య, కమిషనర్ (అప్పీల్స్) దేవేష్ గుప్తా, కమిషనర్ (కస్టమ్స్) ఆర్కే రామన్, కమిషనర్ (సీజీ ఎస్‌టీ) అరుణ్ రిచర్డ్, అదనపు కమిషనర్ (కస్టమ్స్) లక్ష్మీ నారాయణ, అదనపు కమిషనర్ (సీజీఎస్‌టీ) జి రాజుయాదవ్, డిప్యూటీ రిజిస్ట్రార్ (జీఎస్‌టీఏటీ ఏపీ) వివిఎస్ కిషోర్ రాయలు,కోర్టుఅధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) వినయ్ కృష్ణ దాసి, కోర్టు అధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) సి.హెచ్.ప్రత్యూష, అకౌంట్స్ అధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన ట్యాక్స్ బార్ సీనియర్ సభ్యులు, ట్యాక్స్ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆఫీస్‌పై దాడిని ఖండిస్తున్నాం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బిజెపి మూకల దాడిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు ఈశ్వరయ్య నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసనగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ర్యాలీపై బిజెపి ఘర్షణకు దిగటం దుర్మార్గం. నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా ఒక బాధ్యతాయుత స్థానంలో ఉన్నారనే విషయాన్ని విస్మరించి, కేవలం బిజెపి నేతగానే శ్రేణులు చూడటం అవివేకమన్నారు. బిజెపి దాడుల వెనక రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండి ఉంటుందన్న పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు లేకుండా ఏపీలో బిజెపి దాడులకు తెగబడే సాహసం చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు, ఉన్మాద చర్యలు అత్యంత హేయం. దాడికిపాల్పడిన బిజెపి మూకలను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతున్నామన్నారు.

# నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై తీర్పు రిజర్వ్

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కేసులో నిందితుడిగా ఉన్న కృష్ణలంక పీఎస్ సస్పెండెడ్ సీఐ నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై సుప్రీంకోర్ట్ తీర్పు రిజర్వ్ చేసింది. సిఐడి కస్టడీలో నాగరాజును విచారించేందుకు హైకోర్టు షరతులు విధించింది. హైకోర్టు షరతులను సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ సవాలు చేసింది.జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం సీఐడీ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ విచారణకోసం నాగరాజును 160కి.మీ. తీసుకొచ్చి మళ్లీపంపించాల్సి ఉంటుందని సీఐడీ స్పష్టం చేసింది.

ఇలా చేస్తే కేసు దర్యాప్తుపై తీవ్ర ప్ర భావం చూపుతుందని సీఐడీ తెలిపింది. ఇరు వర్గాల వాదనల తర్వాత సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు రద్దు చేయండి: హైకోర్టు

**విజయవాడ.జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ నాయకుడు పేర్ని నాని, ఆయన కుమారుడు మచిలీపట్నంలో పంపిణీ చేసిన నకిలీ ఇంటి పట్టాలను రద్దు చేయడానికి నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉన్నతాధికారులను ఆదేశించింది. రోడ్లు, శ్మశాన వాటికలు,డ్రైనేజీ, పోరంబోకు వంటి ప్రభుత్వ భూముల్లో పట్టాల అక్రమ పంపిణీకి సం బంధించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న అధికారులపై తీసుకున్న చర్యల గురించి నివేదిక సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. మచిలీపట్నంలో ఎన్నికలకు ముందు వైఎస్సార్సీపీ నేత నాని, ఆయన కుమారుడు కిట్టు, వైఎస్సార్సీపీ నాయకులు నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినప్పటికీ ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు జాప్యం చేస్తున్నారంటూ టీడీపీ నేత ఐ. దిలీప్‌కుమార్ గతేడాది హైకోర్టులో పిల్‌వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది మల్లవోలు నిఖిత వాదనలు వినిపించారు. నకిలీ పట్టాలు పంపిణీ చేసింది వాస్తవమేనంటూ అధికారులు తేల్చారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం నకిలీ పట్టాల రద్దుకు నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. పేర్ని నాని తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. రాజకీయ ప్రయోజనం కోసం ఈ పిల్ దాఖలు చేశారన్నారు. పిటిషనర్‌పై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయాలను పిల్‌లో దాచి పెట్టారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వాస్తవాలను గోప్యంగా ఉంచి పిల్ దాఖలు చేసినట్లు తేలితే పిటిషనర్‌కు ఖర్చులు విధిస్తామని స్పష్టం చేసింది.

# ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించిన ఉద్యోగ సంఘాల జెఎసి

**శ్రీకాళహస్తి,జులై 23 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండున్నర సం వత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్ర భుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ రాష్ట్ర జేఏసి నాయకులు ఎంఎల్ఏలకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ నేపథ్యంలో గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ జేఏసి చైర్మెన్ చల్లా చెంచురత్నం యాదవ్ సారథ్యంలో ఉద్యోగులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల బాధలను చెంచురత్నం యాదవ్ వివరించారు. ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారన్నారు.అయితే ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన పిఆర్‌సికి సంబంధించి కమిషన్ వేయటంలో చొరవ చూపలేదన్నారు ఇక ఐఆర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఉద్యోగులకు 5డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని సరెండర్ లీవ్‌కు సంబంధించి కూడా అపరిష్కృతంగా ఉందన్నారు.ఈ సమస్యలను ఎంఎల్ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు ఉద్యోగులతో సహకరించాలని కోరారు.



గురువారం ఎంఎల్ఏ బొజ్జల సుధీర్ రెడ్డిని కలసి ఉద్యోగ సంఘాల నాయకులు

జేఏసి నాయకుల అభ్యర్థనను స్వీకరించిన శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలుస్తుందన్నారు.నేడు రాష్ట్ర జేఏసి సంఘ నాయకులు అందించిన వినతి పత్రంలోని డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామన్నారు. రాబోవు శాసనసభ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలకు సంబంధించి చర్చించి పరిష్కరించేందుకు తన వంతు సహాకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ మేరకు ఉద్యోగ సంఘాల జేఏసి చైర్మెన్ చల్లా చెంచురత్నం యాదవ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేష్,కార్యదర్శి వెంకటముని, శ్రీనివాసులు,బాలు తదితరులు పాల్గొన్నారు.



# డెన్మార్క్ ప్రతిష్టాత్మక డారా పిహెచ్‌డి ఫెలోషిప్‌ను దక్కించుకున్న విమల

**విజయవాడ.జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శాస్త్రవేత్త విమల బత్తినేని అరుదైన ఘనత సాధించారు. డెన్మార్క్ ప్రతిష్టాత్మక డారా పీహెచ్‌డీ ఫెలోషిప్‌ను దక్కించుకున్నారు. దీని విలువ సుమారు 25 లక్షల డానిష్ క్రోనార్లు (దాదాపు రూ.3.6 కోట్లు). 2026 సెప్టెంబర్ నుంచి యూనివర్సిటీ ఆఫ్ సదర్న్ డెన్మార్క్‌లో మూడేళ్ల పీహెచ్‌డీ ప్రారంభించనున్నారు. సామాజిక మాధ్యమం లిం క్డిన్‌లో ఈ విషయాన్ని విమల వివరిస్తూ ఈ విజయం వెనుక ఎన్నో తిరస్కరణలు, అనిశ్చితి దాగి ఉన్నాయని చెప్పారు. అనేక పీహెచ్‌డీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, డారా ఫెలోషిప్‌కు చేసిన తొలి ప్రయత్నం కూడా విఫలమైందని గుర్తు చేశారు. అయితే ప్రతి తిరస్కరణ తనకు కొత్త పాఠం నేర్పిందని పేర్కొన్నారు.విమల 2019 నుంచి 2023 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని రేకులకుంట హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో శాస్త్రవేత్తగా పనిచేశారు. అనంతరం భర్త ఉద్యోగరీత్యా డెన్మార్క్‌కు వెళ్లడంతో, అక్కడే పరిశోధన రంగంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆమె చేపట్టనున్న ఫాబా లూప్ పరిశోధనలో ప్రొటీన్ అధికంగా ఉండే ఫాబా బీన్స్ సాగును విస్తరించడం ద్వారా సోయా దిగుమతులపై డెన్మార్క్ ఆధారపడడాన్ని తగ్గించవచ్చా అనే అంశాన్ని అధ్యయనం చేయనున్నారు.

# గ్లోబల్ లూనార్ మిషన్‌కు ఏపి విద్యార్థిని ఎంపిక

## ధవళేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కందుల జెస్సీ

### జెస్సీకి మంత్రి లోకేష్ అభినందన

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అరుదైన అంతర్జాతీయ ఘనతను సొంతం చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, ప్రపంచంలోనే మొట్టమొదటి గ్లోబల్ ఆల్‌గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ అయిన 'మిషన్ శక్తిశాట్' కు ఎంపికయ్యారు.ఈ విజయంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. జెస్సీని అభినందిస్తూ ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రశంసలు కురిపించారు. 'విద్యా రంగంపై మేం ఎందుకు ఇంతగా పెట్టుబడి పెడుతున్నామో అప్పుడప్పుడు ఇలాంటి కథలు గుర్తుచేస్తుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాల నుంచి అంతర్జాతీయ అంతరిక్ష మిషన్‌కు ఆమె ప్రయాణం, కలలు కనే ప్రతి యువతకు స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.' జెస్సీ, నువ్వు ఆంధ్రప్రదేశ్ గర్వపడేలా చేశావు. చంద్రుడిని, ఆపై శిఖరాలను అందుకోవాలని ఆశిస్తూ నీకు శుభాకాంక్షలు' అంటూ లోకేశ్ తన పోస్టులో అభినందనలు తెలిపారు. ఈ మిషన్‌లో భాగంగా జెస్సీ శాటిలైట్ రూపకల్పనలో అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో కలిసి పని చేయనున్నారు. ఈ శాటిలైట్‌ను అక్టోబర్ 11న శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ప్రయోగించనున్నారు. ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతరిక్ష ప్రయోగంలో భాగస్వామి కావడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది.



# చెరువు కబ్జా చేసిన భూమన: టిడిపి జెబి శ్రీనివాస్

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి మొత్తం బతుకు కబ్జాతోనే ప్రారంభమైందని. భూమి లాక్కొని ఇల్లు కట్టావని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జెబి శ్రీనివాస్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గురువారం సాయంత్రం తిరు పతిలో మీడియా సమావేశం నిర్వహించారు. తిరుచానూరులో స్వర్ణ ముఖి నది ఒడ్డున భూమిని కబ్జా చేసిన ఘనత భూమనదేనన్నారు. గతంలోనే ఈ విషయం చెప్పానని, ఇప్పుడు విజిలెన్స్ విచారణతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారని అన్నారు.కోట గోడలు కట్టి స్వర్ణ ముఖి నదిని పూడ్చి మొత్తం 9 ఎకరాలు ఆక్రమించుకున్నావని ఆరోపించారు. అది మాదే అని మీడియాతో చెబుతు న్నావన్నారు. 24 ఎకరాలు మీదే అయితే. 2024 ఎన్నికల అఫిడవిట్ లో సుమారు 15ఎకరాలు మాత్రమే మీ కుటుంబ పేరుతో పొందుపరిచావని, మిగిలిన 9 ఎకరాలు ఆక్రమించినట్టు ఒప్పుకున్నటేగా అని వ్యాఖ్యలు చేశారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కుమారమ్మ ,అన్నా అనిత, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్,తిరుపతి క్లస్టర్ ఇన్చార్జులు శ్రీధర్ వర్మ,దంపూరి భాస్కర్ యాదవ్,మునిశేఖర్ రాయల్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.



# థాయ్‌లాండ్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ విద్యార్థినులు

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళవిశ్వవిద్యాలయంకు చెందిన ఇద్దరు విద్యార్థినులు థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ నాయకత్వ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పి. హరిణి సూర్యం, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగానికి చెందిన జి. శ్రీ సాయి హర్షిత థాయ్‌లాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సాంగ్‌క్లా యూనివర్సిటీ (పీఎస్‌యూ), పట్టానీ క్యాంపస్ నిర్వహించిన ఐదు రోజుల "లీడర్‌షిప్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్" అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన విద్యార్థులతో కలిసి వీళ్ళునాయకత్వ లక్షణాలు, బృందంగా పనిచేసే విధానం, భిన్న సంస్కృతుల గురించి అవగాహన పెంపొందించుకున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అనుభవాత్మకంగా నేర్చుకున్నారు. హరిణి సూర్యం మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మంచి అవగాహనతో పాటు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించిందని చెప్పారు. సాయి హర్షిత మాట్లాడుతూ, ఇతర దేశాల విద్యార్థులతో కలిసి పనిచేయడం వల్ల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, జట్టుగా పనిచేసే సామర్థ్యం, ప్రపంచ దృక్పథం మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. విద్యార్థినులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమా వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్యఆర్. ఉషా, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి అభినందించారు.



# అంతర్జాల సదస్సుకు ఆచార్య రాచపాలెం

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం నిర్వహిస్తున్న అంతర్జాల సాహిత్య సదస్సుకు ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డుగ్రహీత, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి హాజరు కానున్నారు. తెలుగు సాహిత్య విమర్శ "నాడు నేడు" అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేస్తారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఈ వెబినార్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. "నెలనెలా తెలుగు వెన్నెల" పేరుతో ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం "సాహిత్య వేదిక" వెబినార్ సదస్సును నిర్వహిస్తోంది. ఈనెల 26వ తేదీ జరిగే 228 వ అంతర్జాల సాహిత్య సదస్సుకు ముఖ్య అతిథిగా ఆచార్య రాచపాలెంను ఆహ్వానించినట్లు సంఘం అధ్యక్షులు మాధవి లోకిరెడ్డి, సమన్వయకర్త దయాకర్ మాడ వెల్లడించారు. మాతృభాషను అభిమానించి, తెలుగు సాహిత్యాన్ని ఆస్వాదించాలని వారు కోరారు.

# నిరుద్యోగులను మోసగించిన కేసులో ముసునూరి సౌజన్య, శ్రీనివాస్‌లకు రిమాండ్

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** నిరుద్యోగులను మోసం చేసిన కేసులో నిందితులు ముసునూరి సౌజన్య, శ్రీనివాస్‌లను విజయ వాడ న్యాయస్థానం గురువారం రెండు వారాల పాటు రిమాండ్ విధిం చింది. నిందితులను విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో అదు పులోకి తీసుకున్నారు. వారిని విచారించిన తరువాత బుధవారం అధికారికంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రకటించారు.వారిని బుధవారం రాత్రే న్యాయస్థానానికి తరలించారు. అయితే సమయం ముగియడంతో న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన న్యాయమూర్తి అందులో మార్పులు చేయాలని దర్యాప్తు అధికారికి సూచించారు. నివేదికలో మార్పులు చేసి గురువారం ఉదయం న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలని సూచించడంతో నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.రిమాండ్ రిపోర్టులో మార్పుల అనంతరం నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా వారి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. విజయవాడ శివారులోని పెదపులిపాక గ్రామానికి చెందిన ముసునూరి శ్రీనివాస్, సౌజన్యలు భార్యాభర్తలు. సౌజన్య గతంలో పటమట పంటకాలువ రోడ్డులోని ఒక సంస్థలో పని చేసింది. స్టూడెంట్ వీసా ప్రాసెస్ గురించి తెలుసుకుని నిరుద్యోగులను మోసం చేయవచ్చని భావించింది. ఒక పథకం ప్రకారం భర్తతో కలిసి విజయవాడ, విశాఖపట్నం, హైద రాబాద్‌లో ఫ్లైయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ కార్యా లయాలను ఏర్పాటు చేసింది. సోషల్ మీడియా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో విస్తృతంగా ప్రచారం చేసి నిరుద్యోగులను ఆకర్షించారు. ఈ నెల 19న అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే షేక్ సలమా అనే యువకుడికి విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అరెస్టు చేసినట్లు విజయవాడ డీసీపీ గుణ్ణం రామకృష్ణ తెలిపారు.ఇక స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరిల పేరుతో యూరప్ దేశాలైన నెదర్లాండ్స్, ఐర్లాండ్, లక్సెంబర్గ్, ఫిన్లాండ్‌తదితర దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వారిని నమ్మించారు. ఒక్కొక్కరి వద్ద రూ. 8 లక్షల నుంచి రూ. 13లక్షల వరకు వసూలు చేశారు. ఇలా విజయవాడలో 700 మంది నుంచి రూ.11 కోట్లు, విశాఖపట్నంలో 130 మంది నుంచి రూ.2.2 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో దాదాపు 2,400 మంది వీరి కార్యాలయానికి వచ్చినట్లు గుర్తించారు. అక్కడ ఎంత మందిని మోసం చేసింది ఇంకా తెలియరాలేదు. నిరుద్యోగుల నుంచి ప్రాసెసింగ్ రుసుములు వసూలు చేసి, వారికి నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించే వారు. తమ సంస్థ ప్రతినిధులనే విదేశీ కంపెనీ ప్రతినిధులుగా నటింపచేసేవారు. తర్వాత ఇంటర్వ్యూల్లో ఫెయిల్ అయ్యారని అభ్యర్థులకు నకిలీ ఫీడ్‌బ్యాక్ ఇచ్చేవారు. దీనిపై కొంత మంది అనుమానం వ్యక్తం చేయగా వారి చరవాణి నంబర్లను బ్లాక్ చేశారు. ఇలా తెలుగు రాష్ట్రాల్లో అనేక మందిని మోసం చేశారు. మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఈ మోసం డొంక కదిలింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగానే అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. దీంతో పోలీసులు నిందితులను గుర్తించి ఆకస్మాత్తుగా దాడి చేసిఅరెస్టు చేశారు. భార్యాభర్తలపై మొత్తం 8 కేసులు నమోదయ్యాయని పోలీసులు వెల్లడిం చారు. 2011లోనే సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మోసం కేసు నమోదైంది. 2024లో మాచవరం పీఎస్‌లో, 2025లో అన్న మయ్య జిల్లా పీలేరు పోలీస్ స్టేషన్‌లో, 2026లో తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల మహిళా పీఎస్, బేగంపేట పీఎస్, కామారెడ్డి జిల్లా బిక్నూర్ పీఎస్, విజయవాడ మాచవరం, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన డబ్బులతో కారు లోన్ (రూ.3.3 లక్షలు), రూ.71.45 లక్షల విలువైన బంగారం, రూ.2.25 కోట్ల విలువైన స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇంకా ఏమైనా కొనుగోలు చేశారా అనే దానిపై వాకబు చేస్తున్నారు,

# శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ మరింత ఆధునికం

## ఎపి పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ మరింత ఆధునికంగా మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. భవిష్యత్తులో పోలీసులకు ఎదురయ్యే సవాళ్లు.. వాటిని ఏ విధంగా అధిగమించాలనే అంశాలపై మూడు రోజుల నుంచి పోలీస్ ఉన్నతాధికారుల మేథో మధనంగా రిట్రీట్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులు.టెక్నాలజీని వినియోగించి పోలీసింగ్ ఏ విధంగా చేపట్టాలి... మహిళలపై నేరాలను అదుపు చేయడం. సైబర్ నేరాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై కాన్ఫరెన్సులో చర్చలను జరిపారు.తద్వారా వివిధ




ఎపి పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో చర్చించిన అంశాలపై నివేదికను ప్రదర్శిస్తున్న సిఎం చంద్రబాబు,హోంమంత్రి అనిత,డీజీపీ హరీష్

అంశాలపై తాము రూపొందించిన ప్రజెంటేషన్లను సీఎం చంద్రబాబుకు ఐపీఎస్ అధికారులు వివరించారు. సంబంధిత నివేదికను సీఎం చంద్రబాబుకు అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 2001లో ఇదే తరహాలో ఫ్యూచర్ పోలీసింగ్ తరహాలో వర్క్ షాప్ నిర్వహించాం అన్నారు.

గతంతో పోల్చుకుంటే నేరాలతీరు మారిందన్నారు.సోషల్ మీడియా వేదికగా సమాజంలో అశాంతిని రెచ్చగొట్టేలా కొందరు వ్యవహరిస్తున్నారు.నేరాలను కట్టడి చేయడంతోపాటు తప్పులు చేసిన వారికి శిక్షలు పడేలా చేయగలిగితే నేరాలు అదుపులోకి వస్తాయి అన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీస్ వ్యవస్థను రీస్ట్రక్చర్ చేయాల్సిన అవసరం ఏ మేరకు ఉందో పరిశీలించాలన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు కొన్ని పార్టీలు ఏకంగా నేరాలు చేయడానికి కూడా వెనుకాడడం లేదన్నారు. రౌడీయిజం, ఫ్యాక్షనిజాన్ని సమర్థంగా నియంత్రించామని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సిఎం సూచించారు.



## కాణిపాకం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

### స్వర్ణరథం సేవ టిక్కెట్ ధర రూ.5 వేలు, పాలక మండలి ఏకగ్రీవ తీర్మానం

**కాణిపాకం, జూలై 13 ప్రభాతవార్త:** కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈఏడాది సెప్టెంబర్ 14 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని దేవస్థాన పాలక మండలి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించింది. పాలకమండలి సమావేశం గురువారం స్థానిక ఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో పాలకమండలి చైర్మన్ మణి నాయుడు అధ్యక్షతన జరిగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ ప్రధాన అజెండాగా పాలకమండలిలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ వి.మణినాయుడు, ఈవో పెంచల కిషోర్‌లు సమావేశం అనంతరం విలేకరులకు వివరించారు. ఈసందర్భంగా వచ్చే సెప్టెంబర్ 14 నుండి అక్టోబర్ 5 వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగానిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. ప్రతి నెలా ఆలయంలో సంకటహర చతుర్థి రోజున స్వామివారికి జరిగే స్వర్ణ రథోత్సవం ప్రస్తుతం దేవస్థానం వారే నిర్వహిస్తుండగా ఇకపై స్వర్ణ రథోత్సవం నిర్వహించే అవకాశం భక్తులకు కల్పిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు స్వర్ణ రథోత్సవం వంకు 5 వే రూపాయలుగా టిక్కెట్ ధరను ప్రతిపాదిస్తూ సమావేశంలో తీర్మానించినట్లు చైర్మన్ మణినాయుడు,ఈఓ పెంచల కిషోర్‌లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులను ఉత్సవాలకు ఆహ్వానించాలని పాలకమండలి తీర్మానించినట్లు చైర్మన్ మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు తెలిపారు.

## ఆంజనేయుని విగ్రహం అపహరణలో వీడని చిక్కుముడి

**తిరుమల, ప్రభాతవార్త:** తిరుమల డౌన్‌ఘాట్‌రోడ్డు (మొదటి)లోని మామండూరు మిట్ట వద్ద ప్రసన్నాంజనేయ స్వామి గుడి వద్ద చిన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని బుధవారం వేకువజామున అపహరించారు. ఈ కేసును కొన్ని గంటల వ్యవధిలోనే తిరుపతి జిల్లా పోలీసులు ఛేదించడం ఛాలెంజ్‌గా తీసుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్‌. సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఓ మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, 2టౌన్ సిఐ రాముడు ప్రత్యేక బృందాలతో చేపట్టిన దర్యాప్తు సత్ఫలితాలనిచ్చింది. సాంకేతికత తో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ముద్దాయి జశ్వంత్‌కుమార్‌తో పాటు విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు విచారణ తోబాటు అతని తల్లి తండ్రుల విచారణలో జస్వంత్‌కుమార్ ఇంజనీరింగ్ వరకు చదివి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నట్లు, సుమారు మూడు సంవత్సరాలుగా అతని మానసిక పరిస్థితి నిలకడగా లేనట్లు, తరచూ తల్లి తండ్రులతో గొడవ పడుతున్నట్లు వివరాలు రాబట్టారు. ఈ నెల 5 వ తేదీ మిత్రులతో కలిసి నిందితుడు తిరుమల కి వచ్చినట్లు, నడకదారిలో వెళ్తూ ఈ చిన్న ఆంజనేయ స్వామి విగ్రహాన్ని చూసినట్లు, చిన్నదిగా భాగుండటంతో ... అందుకే ఆ రోజు ... ప్రయాణంలో జీపు లో వెళ్తూ ఆంజనేయస్వామి గుడి వద్ద దిగి విగ్రహాన్ని పట్టుకెళ్ళాడు. అయితే ఈ కేసులో దర్యాప్తు అన్ని కోణాల్లో చేపట్టాల్సి ఉండని, విగ్రహం దొంగతనంలో నిందితుడు వెల్లడించిన సమాచారంలో ఎంతవరకు వాస్తవాలు ఉందనేది తేల్చాల్సి ఉందని అదనపు ఎస్పీలు రవి మనోహరచారి, రామకృష్ణ గురువారం సాయంత్రం తిరుమలలో మీడియాకు వెల్లడించారు. త్వరలోనే కోర్టు ద్వారా కస్టడీ కి తీసుకొని పూర్తి స్థాయి లో దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## 25,26 తేదీల్లో 'తెలుగు మహోత్సవం': మంత్రి దుర్గేష్

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాష వైభవాన్ని, సాంస్కృతిక సంపదను భావితరాలకు అందించాలనే ఉన్నతాశయంతో రాష్ట్ర స్థాయిలో తెలుగు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూలై 25, 26 తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలోని చారిత్రాత్మక ఉండవల్లి గుహల ప్రాంగణంలో జరగనున్న తెలుగు మహోత్సవం అధికారిక పోస్టర్‌ను మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు భాషా వైభవం, సాహిత్య సంపద, సాంస్కృతిక



సౌందర్యం, కళా సంప్రదాయాలు, జానపద వారసత్వం మరియు సృజనాత్మకతలను ఒకే వేదికపైకి తెచ్చే అద్భుతమైన వేడుక ఈ తెలుగు మహోత్సవం అన్నారు. మాతృభాష గొప్పతనాన్ని చాటిచెప్పే ఈ మహా కార్యంలో విద్యార్థులు, యువత, తెలుగు భాషాభిమానులు, ప్రతి ఒక్కరూ విశేష సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

## దేశంలో యువ స్వాతంత్ర్య పోరాటం మొదలైంది

### కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్

**విజయనగరం, (కురుపాం), జూలై 23 ప్రభాతవార్త:** దేశంలో యువ స్వాతంత్ర పోరాటం మొదలైందని దానిని నియంత్రణ చేసే స్థాయి ఏఒక్క రాజకీయ పార్టీలకు లేదని ఢిల్లీ జంతర్ మంతర్‌లో నీట్ లీకేజీపై జరుగుతున్న న్యాయ పోరాటంపై స్పందిస్తూ కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్ర దేవ్ అన్నారు. గురువారం ప్రకటన విడుదల చేస్తూ విద్యార్థులకు అన్ని రకాల విద్యకు అర్హత పరీక్షలు నిర్వహణ ,సీట్లు కేటాయింపు పూర్తి అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానికి ఉండని నిబంధనలు కు విరుద్ధంగా



కేంద్ర ప్రభుత్వం వైద్య విద్య అర్హత పరీక్ష (నీట్) తమ ఆధీనంలోకి తీసుకోవడమే చట్టవ్యతిరేకమైనదన్నారు. దేశంలో వివిధ వర్గాల ప్రజలు ,యువత 12 ఏళ్ళ బిజెపి పరిపాలన పై విసిగిపోయి పోరాటం చేసేందుకు సిద్ధం అయ్యారని అన్నారు. ఇది ముమ్మాటికీ కేంద్ర పాలకుల వైఫల్యమేనని, భవిష్యత్ యువతరానిదేనని అన్నారు.

## కందుల జెస్సీకి పవన్ కల్యాణ్ అభినందనలు

**విజయవాడ,జూలై 23,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రతిష్ఠాత్మక మిషన్ శక్తిశాట్ కార్యక్రమానికి ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా జడ్పీ పాఠశాలకు చెందిన కందుల జెస్సీని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్..అభినందించారు. "ప్రభుత్వ పాఠశాల తరగతి గది నుంచి చంద్రుని యాత్ర అంచు వరకు సాగిన నీ ప్రయాణం అద్భుతం" అంటూ పవన్ కళ్యాణ్ ప్రశంసించారు..యువతకు స్ఫూర్తిగా నిలిచేలా మరిన్ని విజయాలు సాధించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు.

## ఉగ్రకుట్ర కేసులో ముగ్గురికి జైలుశిక్ష విధించిన విశాఖ ఎన్ఐఏ కోర్టు

**విజయవాడ.జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఉగ్రకుట్ర కేసులో విశాఖ ఎన్ఐఏ కోర్టు ముగ్గురికి జైలుశిక్ష విధించింది. డొంగరి దేవేంద్ర, దుబాషి స్వప్న, చుక్క శిల్పకు 5 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 5 ఏళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. దోషులు జరిమానా చెల్లించకపోతే అదనంగా 6 నెలల జైలుశిక్ష విధించనున్నారు. దోషులు నిషేధిత సీపీఐ మావోయిస్టు అనుబంధ సంస్థ సభ్యులుగా గుర్తించారు. మావోయిస్టులకు మద్దతు, నియామకాలు, కుట్ర ఆరోపణలతో కేసు నమోదైంది. ఏపీ పోలీసుల నుంచి 2022 జూన్‌లో ఎన్ఐఏ కేసును తీసుకుంది.

## లారీ కింద పడి వ్యక్తి మృతి

**బుచ్చి (నెల్లూరు), జూలై 23, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి రహదారిలో వేణుగోపాల స్వామి గుడి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి ఆత్మకూరుకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. బుచ్చిరెడ్డిపాళెం నుండి సంగం వైపు మోటార్ బైకుపై వెళుతు వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో అదుపు తప్పి ద్విచక్రవాహనదారుడు పడిపోగా వెనుకనే వస్తున్న లారీ అతని తలపైన ఎక్కడంతో తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి ఆత్మకూరు జేఆర్ పేటకు చెందిన అశోక్‌కుమార్ (40)గా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిఐ శివరామ కృష్ణారెడ్డి, ఎస్ఐ ఉమాశంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టరం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐటిపరిశ్రమల స్థాపనకు అనువైన భవనాలు పోర్టల్‌లో నమోదు చేయండి : ఎన్‌టిఆర్ కలెక్టర్

**విజయవాడ, జులై 23, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ఐటి పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీల స్థాపనకు అనువైన ఖాళీ కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, ఖాళీభూములు, ఐటి కార్యకలాపాలకు అనువైన ఇతర ఆస్తుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన పోర్టల్‌లో నమోదు చేసి జిల్లాలో ఐటిపరిశ్రమ విస్తరణకు సహకరించాలని జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్‌జిల్లాను ఐటిహబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఐటిపరిశ్రమల విస్తరణ ద్వారా స్థలాలు, భవన యజమానులకు మంచి అద్దె లభించటంతోపాటు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు.

పోర్టల్ నమోదు వివరాల కోసం 8497961902లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## భూమన కరుణాకర్ రెడ్డికి అరెస్ట్ తప్పదు

### తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి విద్య, జూలై 23 ప్రభాతవార్త:** భూ కబ్జాలు, టిడీఆర్ బాండ్ల కుంభకోణం, 2021 తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంగా జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దొంగ ఓట్ల నమోదుకు సంబంధించిన కేసుల్లో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తప్పవని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ అంశాలపై విజిలెన్స్ నివేదికలు ప్రభుత్వానికి అందాయని, చట్టం తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు.గురువారం తిరుపతిలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై విమర్శలు చేస్తూ భూముల స్వాధీనాన్ని రాజకీయ కక్షసాధింపుగా చిత్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. భూమన కరుణాకర్ రెడ్డి ఆక్రమించినట్లు విజిలెన్స్ నిర్ధారించిన భూములనే రెవెన్యూ అధికారులు చట్ట ప్రకారం స్వాధీనం చేసుకున్నారని, ఇందులో రాజకీయ జోక్యానికి తావులేదని స్పష్టం చేశారు. తాను భూ కబ్జాలకు పాల్పడలేదని చెబుతున్న భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డి ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలు చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. ఆధారాలు లేకుండా హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అలాగే 2021 తిరుపతి ఉప ఎన్నికల సమయంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న దొంగ ఓట్ల నమోదుపై సిట్ విచారణ కొనసాగుతోందని, విచారణలో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్వామివారి సేవలో నిబద్ధతతో పనిచేస్తుంటే, వ్యక్తిగత అక్కసుతో ఆయనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆరణి విమర్శించారు.



## ఉరి వేసుకుని సచివాలయ ఎఎన్ఎం మృతి

**చిల్లకూరు (నెల్లూరు), జూలై 23, ప్రభాతవార్త :** మండలంలోని తోణుకుమాల గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న శ్రీపతి సాయి చందన ప్రియ (27)గురువారం సచివాలయంలో సిబ్బంది ఎవరు లేకపోవడంతో సూసైడ్ లేక రాసిపెట్టి ఫ్యానుకు చున్నితో ఉరేసుకొని మృతి చెందింది. సూసైడ్ లేఖలో అమ్మ నాన్న అక్కకి నమస్కరించి రాయటం ఏమనగా నా చావుకి ఎవరు కారకులు కాదని నేనే ఉరేసుకొని చనిపోతున్నాను అని లేఖలో పేర్కొంది. మృతి చెందిన సాయి చందన ప్రియ ఓజీల మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన అవివాహిత గత సంవత్సరం క్రితమే బదిలీల్లో తోనుకుమాల గ్రామ సచివాలయానికి రావడం జరిగింది. శ్రీపతి రమణయ్య, సుకుమారి దంపతులకు రెండవ కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సచివాలయం వద్దకు వచ్చి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు, సంఘటన స్థానానికి చేరుకొని కేసు నమోదు చేసిపోస్టుమార్టం నిమిత్తం మృ తదేహాన్ని గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తర లించారు.మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది.



## ప్రధాని పర్యటన ఏర్పాట్లలో అత్యున్నత ప్రమాణాలు

### ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ప్రత్యేక అధికారి జి.వీరపాండ్యన్

**విజయనగరం, జూలై 23 ప్రభాతవార్త:** ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం రాష్ట్ర ప్రతిష్ఠాత్మక వేడుకగా నిలిచేలా అన్ని ఏర్పాట్లను అత్యున్నత ప్రమాణాలతో పూర్తి చేయాలని ప్రధానమంత్రి పర్యటన నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ప్రధానమంత్రి పర్యటన ప్రత్యేక అధికారి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండ్యన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డితో కలిసి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించిన వారు, ప్రారంభోత్సవానికి సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ పరిశీలనలో రాష్ట్ర ఎయిర్‌పోర్ట్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, పురపాలక శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ డా. పి.సంపత్ కుమార్, విజయనగరం జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, అనకాపల్లి జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ శోభిత, అదనపు ఎస్పీ సౌమ్యలత, జీఎంఆర్ ప్రతినిధులు ఐ. ప్రభాకర్ రావు, రామరాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దుర్గమ్మకి పాలకమండలి ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జులై 22, ప్రభాతవార్త :** బెజవాడ దుర్గమ్మవారికి ఆషాఢం సారె కార్యక్రమంలో గురువారం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు ఆషాఢం సారెను వైభవంగా సమర్పించారు. సారె సమర్పించడానికి వచ్చిన పాలకమండలికి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేదమంత్ర పఠనోచ్ఛారణతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.



అనంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించారు.

## పేకాట శిబిరంపై దాడి..నలుగురుపై కేసు నమోదు

**కొల్లిపర,జూలై 23 ప్రభాతవార్త:** మండల కేంద్రం కొల్లిపరలో పేకాట శిబిరాలపై దాడి చేయగా రూ.21,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి రూరల్ సీఐ షేక్ నాయబ్ రసూల్ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లిపర ఎస్బీఐ బ్యాంకు సమీపంలో నివాసముంటున్న రిటైర్డు రెవిన్యూ అధికారి వెంకటేశ్వరరెడ్డి ఇంట్లో చట్టవిరుద్ధంగా పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం 11 గంటల సమయంలో మెరుపు దాడి నిర్వహించారు.తెనాలి రూరల్ సీఐ షేక్ నాయబ్ రసూల్ మార్గదర్శకంలో కొల్లిపర ఎస్ఐ ప్రసాదు..సిబ్బంది కలసి దాడి చేపట్టారు.వెంకటేశ్వరరెడ్డి,మహేశ్వరరెడ్డి,పూర్ణచంద్రశేఖర్‌రెడ్డి నాగిరెడ్డి పేకాట నిర్వహిస్తున్న వెంకటేశ్వరరెడ్డితో పాటు ఆటలో పాల్గొన్న మిగతా ముగ్గురుపై చట్టరీత్యా కేసు నమోదు చేయటం జరిగిందని తెనాలి రూరల్ సీఐ షేక్ నాయబ్ రసూల్ తెలిపారు.సమాజంలో అసాంఘిక కార్యకలాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని..జూదం..పేకాట వంటి చట్టవ్యతిరేక పనులు నిర్వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

## బాధ్యత సక్రమంగా నిర్వహించండి..ప్రతి దరఖాస్తును పరిశీలించండి

**కొల్లిపర,జూలై 23 ప్రభాతవార్త:** ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ..ప్రతి దరఖాస్తును స్వీకరించి పరిశీలించాలని డిప్యూటి ఎంపీడీవో దానయ్య అన్నారు.గురువారం మండల పరిధిలోని తూములూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మింగా తనిఖీ చేసి తగిన సూచనలు,సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా దానయ్య మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలు అందించి..ప్రజల మన్ననలు పొందాలన్నారు.సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు.



## బైపాస్‌లో ఘోర ప్రమాదం.. కంటైనర్ కింద ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు

**యడ్లపాడు, జులై 23, ప్రభాతవార్త :** యడ్లపాడు సమీపంలోని నూతన బైపాస్‌లో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. తిమ్మాపురం సమీపంలోని నూతన పెట్రోల్ బంక్ వద్ద ముందుగా వెళ్తున్న కంటైనర్‌ను కారు ఢీకొట్టగా, డ్రైవర్ గుర్తించకపోవడంతో కారును కొంతదూరం ఈడ్చుకెళ్లాడు.పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన ఉప్పుటూరి హర్ష (33) గుంటూరు నుంచి మార్టూరు వైపు కారులో ప్రయాణిస్తున్నాడు. తిమ్మాపురం వద్దకు చేరుకోగానే నిద్రమత్తు కారణంగా కారు అదుపుతప్పి ముందుగా వెళ్తున్న కంటైనర్ వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది.ఢీకొట్టిన విషయం కంటైనర్ డ్రైవర్‌కు తెలియకపోవడంతో కారు కంటైనర్ వెనుక భాగంలో ఇరుక్కుని కొంతదూరం ఈడ్చుకుపోయింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమై, టైర్లు రాపిడికి అరిగిపోయాయి. ప్రమాద దృశ్యాన్ని చూసిన స్థానికులు వెంటనే కంటైనర్‌ను ఆపించి సహాయక చర్యలు చేపట్టారు.ఈ ప్రమాదంలో హర్షకు తల, గడ్డం, పొత్తికడుపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని కారులో నుంచి బయటకు తీసి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి నిద్రమత్తే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నామన్నారు.

## ప్రకృతి వ్యవసాయమే రైతుకు ఆదాయం

**యడ్లపాడు, జులై 23, ప్రభాతవార్త :** ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అంతర పంటల ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమల కుమారి తెలిపారు. నరసరావుపేట డివిజన్ పరిధిలోని యడ్లపాడు గ్రామంలో రైతు మంద మరియబాబు సాగుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల పరిస్థితి,



అంతర పంటల సాగు విధానాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అమల కుమారి మాట్లాడుతూ ప్రధాన పంటపై మాత్రమే ఆధారపడకుండా అంతర పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఏడాది పొడవునా ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం భూమి సారాన్ని పెంపొందించడంతో పాటు నాణ్యమైన ఆహార ఉత్పత్తికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించి భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి సౌజన్య లక్ష్మి ్మ, ఐసీఆర్‌పీ ప్రసన్న, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సాయి పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు -ఎస్ఐ ప్రసాద్

**కొల్లిపర,జూలై 23 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల గురువారం కొల్లిపర పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక ఈవ్‌టీజింగ్ నిరోధక డ్రైవ్ నిర్వహించారు.కొల్లిపర ఎస్ఐ ఎన్‌సి ప్రసాద్ ఆద్వర్యంలో పోలీస్ సిబ్బంది కలసి కళాశాల పరిసరాలు..తదితర ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులకు తనిఖీ చేసారు. మహిళలు..విద్యార్థినులు ఎలాంటి వేదింపులకు గురైనా వెంటనే 112 లేదా సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.మహిళల భద్రతకు భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు.

## ప్రభుత్వప్రైవేటు విద్యాసంస్థలకు బంద్ నోటీసులు

**రేపల్లె, జూలై 23, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి రేపల్లె నియోజకవర్గంలోని ప్రభుత్వ,ప్రైవేటు విద్యాసంస్థలకు గురువారం బంద్ నోటీసులను ఎస్ఎఫ్ఐ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా రేపల్లె డివిజన్ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి ఎం.సూర్యప్రకాష్ మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.నీట్ పేపర్ లీకేజీకి బాధ్యతవహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జ్‌ను నిరసిస్తూ నీట్ పరీక్షా పత్రాల లీకేజీకి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి కుటుంబాలను ఆదుకోవాలని,దేశంలో చదువుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ,నూతన విద్యా విధానంలో మార్పులు తేవాలని కోరుతూ విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఎం.సూర్యప్రకాష్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవి,ఎం.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ దృష్టికి రేపల్లె సమస్యలు



**రేపల్లె, జూలై 23, ప్రభాతవార్త:** రేపల్లె నియోజకవర్గంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి,వైకాపా అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి గురువారం రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ తీసుకువెళ్ళారు. నిజాంపట్నం హర్బర్ వ్యవహారం,ఆక్వా రైతుల సమస్యల గురించి వెల్లడించారు.రేపల్లె నియోజకవర్గంలో అభివృద్ధి పేరిట అవినీతికి పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం గురించి ఆయన తెలిపారు.రూ.1800 కోట్లతో అభివృద్ధి చేశామని రేపల్లె శాసనసభ్యుడు,మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రచారం చేసుకుంటున్నారని, ఆయన సోదరుడు అనగాని శివప్రసాద్ పెత్తనం పెరిగిందని అవినీతి ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు ఉన్న నేపథ్యంలో బహిరంగ చర్చకు రావాలని,శ్వేతపత్రం విడుదల చేయాలని వైకాపా తరపున సవాల్ విసిరినట్లు మోహన్‌కృష్ణ కూలంకుషంగా జగన్‌కు తెలియజేశారు.కూటమి పాలకులు అనుసరిస్తున్న విధానాలతో రేపల్లె నియోజకవర్గంలోని ప్రజలు విసుగుచెందారని ఆయన స్పష్టం చేశారు.వైకాపా బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## 26న వంగవీటి,ముద్రగడల సంస్మరణ

**రేపల్లె, జూలై 23, ప్రభాతవార్త:** రాష్ట్ర,దేశ రాజకీయాలను మలుపు తిప్పిన కాపుజాతి ప్రముఖులు స్వర్గీయ వంగవీటి మోహనరంగా,ముద్రగడ పద్మనాభంల జ్ఞాపకాలను స్మరించుకునేందుకు ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ హాలులో సంస్మరణ సభ జరుగుతుందని రేపల్లె నియోజకవర్గం కాపు ఐక్యత సంఘం గురువారం ప్రకటించింది.రాజకీయ పార్టీలకు అతీతంగా కార్యక్రమానికి హాజరు కావాలని కాపు ఐక్యత సంఘం కోరింది.

## వైభవంగా శ్రీ వారాహీ అమ్మ నవరాత్రులు

**రేపల్లె, జూలై 23, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు మండలంలోని ఓలేరు శివానంద ఆశ్రమంలో గురువారం శ్రీ వారాహీ అమ్మవారి నవరాత్రులు వైభవోపేతంగా ముగిశాయి.శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిగాయి.విశేషమైన హోమం కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ప్రజల సంక్షేమం నెరవేరాలని శ్రీ వారాహీ అమ్మవారిని మోపిదేవి శ్రీనివాసరావు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు,కార్యకర్తలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జూ. స్క్వాష్ క్వార్టర్ ఫైనల్‌కు అనాహత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్క్వాష్ జూనియర్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ల మహిళల క్వార్టర్ ఫైనల్స్‌కు అనాహత్ సింగ్ చేరుకుంది. టాప్ సీడెడ్ భారత క్రీడాకారిణి అనాహత్ సింగ్ మలేషియాకు చెందిన డోయ్స్ యే సాన్ లీని సునాయాసంగా ఓడించింది. గత ఏడాది కాంస్య పతక విజేత అయిన అనాహత్, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో తన 13/16వ సీడ్ ప్రత్యర్థిని 11-4, 11-8, 11-3 తేడాతో ఓడించి, తదుపరి ఈజిప్టుకు చెందిన 5/8వ సీడ్ హబీబా రిజ్క్‌తో తలపడనుంది. మహిళల విభాగంలో, ఈజిప్ట్‌కు చెందిన హబీబా రిజ్క్ నాలుగు గేమ్‌ల పోరులో అమెరికాకు చెందిన షార్లెట్ స్జేను ఓడించగా, బెల్జియంకు చెందిన సవన్నా మోక్సామ్ వెనుకబడి ఉన్నప్పటికీ పుంజుకుని హాంకాంగ్, చైనాకు చెందిన ఎనా క్వాంగ్‌ను 3-1 తేడాతో ఓడించింది. మరో జిప్సీ క్రీడాకారిణి మాలికా ఎల్కరక్సీ, అమెరికాకు చెందిన దియా యాదవ్‌పై విజయంతో తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించగా, నంబర్ 1 సీడ్ మొహమద్ జకారియా పాకిస్థాన్‌కు చెందిన నౌమాన్ ఖాన్‌పై గెలిచి ముందంజ వేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన అమీర్ ఖలీద్‌జౌస్సెలిన్, ఇంగ్లాండ్‌కు చెందిన రోనీ హిక్లింగ్‌పై వరుస గేమ్‌లలో విజయం సాధించగా, హాంకాంగ్, చైనాకు చెందిన హెలెన్ టాంగ్, మలేషియాకు చెందిన హర్లీన్ టాన్‌పై విజయంతో ముందంజ వేసింది. పురుషుల విభాగంలో, టాప్‌ఎనిమిది సీడ్‌లకు సంబంధించి అనేక అనూహ్య ఫలితాలు నమోదయ్యాయి. భారత ఆటగాడు ఆర్యవీర్ దీవాన్ (5/8) అమెరికాకు చెంఇన యాసీన్ షాలాబీ చేతిలో వరుస గేములలో ఓడిపోయాడు. ప్రస్తుత ఆసియా అండర్ 19 ఛాంపియన్ అయిన అతను అమెరికా ప్లేయర్ చేతిలో 4-11, 1-11, 5-11 తేడాతో పరాజయ పాలయ్యాడు.

# చైనా ఓపెన్‌లో సింధు ఓటమి

## ఆయుష్ శెట్టి, లక్ష్య సేన్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2026, రౌండ్ ఆఫ్ 16లో చెన్ యుఫెయ్ చేతిలో భారత్ షట్లరున పీవీ సింధు ఓటమి పాలవ్వగా, ఆయుష్ శెట్టి, లక్ష్య సేన్ పరాజయం పాలై టోర్నీ నుండి నిష్క్రమించారు. చైనాకు చెందిన చెన్ యుఫెయ్ గురువారం భారత క్రీడాకారిణి పివి సింధును 16-21, 22-20, 21-18 తేడాతో ఓడించి, చైనా ఓపెన్ 2026 క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. రెండో గేమ్‌లో సింధుకు నాలుగు మ్యాచ్ పాయింట్లు లభించినప్పటికీ, చెన్ పుంజుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. చివరి గేమ్‌లో, భారత షట్లర్ ఆరంభంలో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, చివరి దశలో చెన్ దూసుకువచ్చి టైను ముగించింది. ఇక భారత యువ ఆటగాడు ఆయుష్ శెట్టి ప్రస్థానం కూడా చివరి 16 రౌండ్‌లో ముగిసింది. అతను ఒక గేమ్ ఆధిక్యాన్ని కోల్పోయి ఐర్లాండ్‌కు చెందిన న్హాట్ గుయెన్ చేతిలో 21-15, 13-21, 20-22 తేడాతో ఓడిపోయాడు. ప్రపంచ 28వ ర్యాంకర్ శెట్టి, రెండో గేమ్ ఓడిపోయిన తర్వాత కోలుకుని, నిర్ణయాత్మక సెట్‌లో 19-15 ఆధిక్యం సాధించినప్పటికీ, తన ప్రత్యర్థిని ఆ స్థితి నుండి తొలగించలేకపోయాడు. కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో లక్ష్య సేన్ 19-21, 11-21 తేడాతో ఓడిపోవడంతో, చివర్లో టోర్నమెంట్‌లో భారత్ పోరాటానికి తెరపడింది. కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో లక్ష ్య సేన్ 1921, 1121 తేడాతో ఓడిపోవడంతో, ఆ రోజు చివర్లో టోర్నమెంట్‌లో భారత్ పోరాటానికి తెరపడింది.

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్

# ఫైనల్స్ ఖరారు

## జూన్ 9న నుండి 13 వరకు




ఆట

**న్యూఢిల్లీ:** ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ 2027లో జరగనుంది. దీనికి సంబంధించి ఫైనల్ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ ఫైనల్ లండన్‌లోని ఓవల్ స్టేడియంలో జరుగుతుంది. ఫైనల్ జూన్ 9న ప్రారంభమై జూన్ 13 వరకు కొనసాగుతుంది. ఈ టోర్నీ 2025లో ప్రారంభమైంది. టెస్ట్ ఛాంపియన్‌షిప్ రెండేళ్ల పాటు కొనసాగుతుంది. ఇందులో 9 జట్లు పాల్గొంటున్నాయి. అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు ఫైనల్ కు చేరుకుంటాయి. 2027 తర్వాత 2029, 2031 టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ల ఫైనల్స్ ఇంగ్లాండ్‌లో జరుగుతాయని ఐసీసీ ఇప్పటికే ప్రకటించింది. గత సంవత్సరం జూన్ 17న బంగ్లాదేశ్‌శ్రీలంక మ్యాచ్‌తో టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ప్రారంభమైంది. ఆస్ట్రేలియా ప్రస్తుతం 8 మ్యాచ్‌లలో ఏడు విజయాలతో, 87.5 శాతం పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా 75 శాతం పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. 2023లో భారత్‌ను ఓడించి ఆస్ట్రేలియా టైటిల్ గెలుచుకోగా, 2025లో ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టుకు ఈ ఐసీసీ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సీజన్ అంతగా కలిసి రాలేదు. ఆ జట్టు తొమ్మిది మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించింది. గతేడాది ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను భారత్ డ్రా చేసుకోగా, వెస్టిండీస్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకుంది. స్వదేశంలో జరిగిన సిరీస్‌లో దక్షిణాఫ్రికా భారత్‌ను క్లీన్ స్వీప్ చేసింది. భారత జట్టు ఇప్పుడు వచ్చే నెలలో శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది.

## కామన్వెల్త్ గేమ్స్‌లో మాల్టాపై

# భారత్ విజయం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో మహిళల బౌల్స్ జంటల ప్రారంభ మ్యాచ్‌లో మాల్టాపై భారత్ విజయం సాధించింది. గురువారం జరిగిన మహిళల జంటల విభాగంలో రూపా రాణి టిర్కీ, పింకీ సింగ్, మాల్టాకు చెందిన కోనీ రిక్సన్, రెబెక్కా రిక్సన్‌లను ఓడించడంతో, భారత్ తన కామన్వెల్త్ గేమ్స్ ప్రచారాన్ని విజయంతో ప్రారంభించింది. గ్రూప్ దశ ఆరంభ మ్యాచ్‌లో పోటీపడిన భారత ద్వయం, హోరాహోరీగా సాగిన పోరు అనంతరం టై బ్రేక్‌లో విజయం సాధించింది. పింకీ సింగ్ రాణించడంతో భారత్ ఉత్కంఠభరితమైన తొలి విజయాన్ని కైవసం చేసుకుంది. భారత్ తొలి అర్ధభాగంలో రెండు పాయింట్లు సాధించి బలమైన ఆరంభాన్ని అందుకుంది. ఆ తర్వాత మాల్టా రెండో అర్ధభాగంలో ఒక పాయింట్‌తో ఆధిక్యాన్ని తగ్గించింది. భారత జంట తొలి సెట్ మిగిలిన భాగమంతా ఆధిపత్యం కొనసాగించి, దానిని 7-1 తేడాతో సునాయాసంగా కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో మాల్టా బలంగా పుంజుకుంది. తొలి ఎండ్‌లో పింకీ సింగ్ అద్భుతమైన ఫైనల్ బౌల్ వేసి భారత్‌కు ఆరంభ ఆధిక్యాన్ని అందించగా, రెండవ ఎండ్‌లో మాల్టా పుంజుకుని స్కోర్లను సమం చేసింది. మూడో ఎండ్‌లో భారత్ మళ్లీ ఆధిక్యం సాధించగా, నాలుగో ఎండ్‌లో మాల్టా స్కోరును సమం చేసింది. ఆ తర్వాత మాల్టా ఐదో ఎండ్‌ను కైవసం చేసుకుని రెండో సెట్‌ను గెలుచుకోవడంతో,




మ్యాచ్ టైబ్రేక్‌కు దారితీసింది. టైబ్రేక్ కూడా అంతే ఉత్కంఠభరితంగా సాగింది. మాల్టా మెరుగైన ఆరంభం చేసినప్పటికీ, పింకీ సింగ్ మరోసారి ఒత్తిడిలో రాణించి, కీలకమైన చివరి బంతితో భారత్ నిర్ణయాత్మక ఎండ్‌ను కైవసం చేసుకుని విజయాన్ని ఖాయం చేసుకోవడంలో సహాయపడింది.



## కామన్వెల్త్‌లో తొలిపతకాన్ని ఖరారు చేసిన

# బాక్సర్ లవ్లీనా

**న్యూఢిల్లీ:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో గురువారం జరిగిన ప్రారంభోత్సవానికి ముందే, మహిళల 75 కేజీల విభాగంలో బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడంతో, 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారతదేశానికి తొలి పతకం ఖరారైంది. 28 ఏళ్ల లవ్లీనా పోటీపడనున్న విభాగంలో కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఫలితంగా, ఈ భారత క్రీడాకారిణికి సెమీఫైనల్స్‌కు నేరుగా ప్రవేశం లభించింది, ఇది ఆమెకు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేస్తుంది. ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లినా జూలైలో జరిగే సెమీఫైనల్స్‌లో టువాలుకు చెందిన గిరీతీశి తాఫాకితో తలపడనుంది.

లవ్లినాకు ఇది తొలి కామన్వెల్త్ గేమ్స్ పతకం. 2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగిన గత ఎడిషన్‌లో, లోవ్లినా లైట్ మిడిల్‌వెయిట్ కేటగిరీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది, అక్కడ ఆమె వేల్స్‌కు చెందిన రోసీ ఎక్లెస్ చేతిలో ఓడిపోయింది. వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చానుతో పాటు, గురువారం జరిగే ప్రారంభోత్సవానికి లవ్లీనాను భారత పతాకధారిగా ఎంపిక చేశారు.

# మెర్సిడిస్ బెంజ్ కొత్త కారు విడుదల!

**ముంబయి,జులై 23:** లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా, భారత మార్కెట్లో తన ప్లగ్ఇన్ హైబ్రిడ్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేసింది. దేశంలోనే తొలి ఎలక్ట్రిఫైడ్ ఏఎమ్‌జీ ఈక్లాస్ సెడాన్ అయిన మెర్సిడెస్ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్ 4మేటిక్‌ప్లస్‌ను గురువారం లాంచ్ చేసింది. ఏఎమ్‌జీ బ్రాండ్ అందించే అద్భుతమైన పనితీరుతో పాటు ప్లగ్ఇన్ హైబ్రిడ్ టెక్నాలజీ అందించే ఇంధన సామర్థం ఈ కారు సొంతం. ఈ కొత్త సెడాన్ రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. పెర్ఫార్మెన్స్ ఎడిషన్ ధర రూ. 1.45 కోట్లు కాగా, రేసింగ్ ఎడిషన్ ధర రూ. 1.48 కోట్లుగా (రెండు ధరలూ ఎక్స్ షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్, ప్లగ్ఇన్ హైబ్రిడ్ వంటి విభిన్న పవర్‌ట్రెయిన్ ఆప్షన్లను వినియోగదారులకు అందించాలనే తమ వ్యూహంలో భాగంగా ఈ కారును విడుదల చేసినట్లు మెర్సిడెస్‌బెంజ్ పేర్కొంది. ఈ సందర్భంగా మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోశ్ అయ్యర్ మాట్లాడుతూ భారత ఆటోమోటివ్ పరిశ్రమలో ఈక్లాస్ సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న మోడల్. కొత్త ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్, అద్భుతమైన పనితీరు, రోజువారీ వినియోగానికి అవసరమైన సౌలభ్యం, ఎలక్ట్రిక్ సామర్థం వంటి అంశాలను ఒకేచోట



అందిస్తోంది. రేస్ ట్రాక్ మీద అవసరమైన పెర్ఫార్మెన్స్‌ను, రోజువారీ ప్రయాణాలకు కావాల్సిన ప్రాక్టికాలిటీని ఈ సెడాన్ సమన్వయం చేస్తుందని వివరించారు. మెర్సిడెస్ ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్‌లో 3.0లీటర్ ఇన్‌లైన్ సిక్స్‌సిలిండర్ టర్బోచార్జ్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 449 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీనికి ఏఎమ్‌జీ స్పీడ్‌షిఫ్ట్ టీసీటీ 9జీ ట్రాన్స్‌మిషన్‌లో అనుసంధానించిన 120 కిలోవాట్ల ఎలక్ట్రిక్ మోటార్‌ను జతచేశారు. ఈ రెండూ కలిసి ఏకంగా 585 హెచ్‌పీ (రేస్ స్టార్ట్ ఫంక్షన్‌తో 612 హెచ్‌పీ) శక్తిని, 750 ఎన్ఎమ్ టార్క్‌ను విడుదల చేస్తాయి. ఈ కారు కేవలం 3.8 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని గరిష్ఠ వేగాన్ని ఎలక్ట్రానిక్‌గా గంటకు 250 కిలోమీటర్లకు పరిమితం చేశారు.

## నాలుగోరోజూ సెన్సెక్స్, నిఫ్టీలకు

# తప్పని నష్టాలు!

**ముంబయి,జులై 23:** మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం ప్రభావంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. రియాల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్,మౌలిక వసతులు (ఇన్‌ఫ్రా), పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఆటో మరియు మీడియా రంగాల షేర్లు మాత్రమే స్వల్ప లాభాలను నమోదు చేశాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 363.66 పాయింట్లు క్షీణించి 76,391.39 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 126.65 పాయింట్లు పడిపోయి 23,896.60 వద్ద స్థిరపడింది. గత నాలుగు వరుస



ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 2.25 శాతం, నిఫ్టీ 1.90 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ పతనానికి ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ షేర్లు కారణమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.01 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.20 శాతం క్షీణించాయి. బిఎస్ఇలో మొత్తం 1,637 షేర్లు లాభపడగా, 2,585 షేర్లు నష్టపోయాయి. మరో 181 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 4.01 డాలర్లు పెరిగి 98.08 డాలర్లకు చేరుకుంది. ముడిచమురు ధరల పెరుగుదలతో పాటు డాలర్ బలపడటంతో రూపాయి బలహీనపడింది. డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 96.5600 వద్ద ట్రేడైంది. అంతకుముందు సెషన్‌లో ఇది 96.5300 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1%తగ్గి రూ.1,44,222కు చేరుకుంది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు కంపెనీల షేర్లలో భారీ కదలికలు నమోదయ్యాయి.ఎటర్నల్ షేరు 0.95 శాతం పెరిగింది.




వాణిజ్యం

## ఇన్ఫోసిస్ తొలి త్రైమాసిక లాభం

# 8.6% తగ్గుదల

**బెంగళూరు,జులై 23:** దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తొలి త్రైమాసికంలో నికరలాభం 8.6 శాతం తగ్గి రూ.7,769 కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో ఇది రూ.8,501 కోట్లుగా నమోదైంది. మార్కెట్ అంచనాలు రూ.7,774 కోట్లుగా ఉన్నాయి. అదే సమయంలో కంపెనీ ఆదాయం మాత్రం పెరుగుదలను నమోదు చేసింది. గత త్రైమాసికంలోని రూ.46,402 కోట్లతో పోలిస్తే 3.9 శాతం పెరిగి రూ.48,211 కోట్లకు చేరుకుంది. వడ్డీ, పన్నుల ముందు లాభం 4.3 శాతం పెరిగి రూ.10,163 కోట్లకు చేరగా, గత త్రైమాసికంలో ఇది రూ.9,743 కోట్లుగా నమోదైంది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 20.99 శాతం నుంచి 21.08 శాతానికి పెరిగి 9 బేసిస్ పాయింట్ల వృద్ధిని నమోదు చేసింది. రాబడులపరంగా 1.5 శాతం నుంచి 3.5 శాతం వృద్ధి ఉంటుందని పేర్కొనగా, తాజా అంచనాలో దానిని 1.5 శాతం నుంచి 3 శాతం మధ్యకు సవరించింది. ఆపరేటింగ్ మార్జిన్ మార్గదర్శకత్వాన్ని మాత్రం 20 నుంచి 22 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది.ఎఐ సేవల ద్వారా బలమైన వృద్ధికంపెనీ సీఈఓ సలిల్ పారేఖ్ మాట్లాడుతూ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు మంచి డిమాండ్ కొనసాగుతోందని తెలిపారు. జూన్ త్రైమాసికంలో స్థిర కరెన్సీ ప్రాతిపదికన కంపెనీ ఆదాయం 1 శాతం పెరిగిందని చెప్పారు. మొత్తం తొలి త్రైమాసిక ఆదాయంలో ఎఐ సేవల వాటా 8.2 శాతంగా నమోదైందని కంపెనీ నాయకత్వ మార్పులో భాగంగా అశిష్ కుమార్ దాస్‌ను 2027 మార్చి 31 వరకు సిఇఒడిజిగ్నేట్‌గా నియమించింది. అనంతరం ఏప్రిల్ నుంచి ఆయన పూర్తి స్థాయి సీఈఓ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉద్యోగులకు రెండు విడతల్లో వేతన పెంపుఇన్ఫోసిస్ సిఎఫ్‌వో జయేష్ సంగ్‌రాజ్‌కా మాట్లాడుతూ, ఉద్యోగుల వార్షిక వేతన పెంపును రెండు విడతల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. షేర్ ధత్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు రూ.1,051.80 వద్ద స్వల్ప నష్టంతో ముగిసింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు షేరు ధర 35 శాతానికి పైగా క్షీణించగా గత 12 నెలల్లో సుమారు 33.5 శాతం పడిపోయింది.

# రాబడుల్లో వృద్ధి, తగ్గిన మీషో నష్టాలు!

**ముంబయి,జులై 23:** ఈకామర్స్ సంస్థ మీషో తొలి త్రైమాసికంలో తన పనితీరును మెరుగుపరుచుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర నష్టం దాదాపు సగానికి తగ్గగా, ఆదాయం భారీగా పెరిగింది. కంపెనీ రూ.132.8 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ నష్టం రూ.289.3 కోట్లుగా ఉంది. మరోవైపు, కంపెనీ ఆదాయం 48.3 శాతం పెరిగి రూ.3,713 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,504 కోట్లు.వడ్డీ, పన్నులు, తరుగుదల, అమోర్టిటైజేషన్‌కు ముందు లాభనష్టం పరంగా కూడా కంపెనీ మెరుగుదల నమోదు చేసింది. ఎబిడిటా నష్టం




రూ.264.4 కోట్ల నుంచి రూ.224.7 కోట్లకు తగ్గింది. వ్యాపార విస్తరణలో భాగంగా, తన అనుబంధ సంస్థ మీషో గ్రోసరీస్లో రూ.75 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నెట్ మెర్చండైజ్ విలువ 34 శాతం పెరిగి రూ.11,614 కోట్లకు చేరుకుంది. మార్కెట్‌ప్లేస్ ఆదాయం 48 శాతం పెరిగి రూ.3,707 కోట్లకు చేరింది. వినియోగదారులు, ఆర్డర్లలో గణనీయమైన పెరుగుదమీషో వార్షిక లావాదేవీలు నిర్వహిస్తున్న వినియోగదారుల సంఖ్య 29 శాతం పెరిగి 27.4 కోట్లకు (274 మిలియన్లు) చేరింది. ఒక్కో వినియోగదారు ఏడాదికి చేసే కొనుగోళ్ల సగటు సంఖ్య 10.3 ట్రాన్సాక్షన్లకు పెరిగింది.అదే విధంగా, కంపెనీకి వచ్చిన మొత్తం ఆర్డర్లు కూడా 29 శాతం పెరిగి 72.5 కోట్లకు (725 మిలియన్లు) చేరాయి.నగదు ప్రవాహంలో మెరుగుదగత 12 నెలల ఫ్రీ క్యాష్ ఫ్లో మైనస్ రూ.633 కోట్ల నుంచి మైనస్ రూ.537 కోట్లకు మెరుగుపడింది. త్రైమాసికంలో షిప్ చేసిన ఆర్డర్లలో సుమారు 37 శాతం ప్రీపెయిడ్ ఆర్డర్లే ఉన్నాయని కంపెనీ వెల్లడించింది.త్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్ఈలో మీషో షేరు 0.48 శాతం తగ్గి రూ.188.95 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 0.53 శాతం క్షీణించింది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటివరకు మీషో షేరు దాదాపు 5 శాతం లాభపడింది.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14